# ది యునైటెడ్ ఇండియా లైఫ్

## అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్

హెడ్ ఆఫీసు : మదరాసు. 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసుయొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పండ్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పోడిమి; మంచిబోనస్సుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు.

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగు డైరెక్టరు.



## గమనింపుడు

మా మ్యాన్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు.

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా ?

## నిజముగ జరిగిన సంగతి

వైద్యపరీక్ష లేదు. స్త్రీ పురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్ధాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు

### ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి : 22, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు :—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి. 4. ట్యూటికొరిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్టుస్.


'ఆంధ్రభూమి' ప్రకటనలు

# విషయసూచిక


౧. సర్వేశ్వరా ... ౭౩
—యథావాక్కుల అన్నమయ్య

౨. పడమటిసీమ కవులకతలు ... ౭౪
—మున్నంగి శర్మ

౩. నిర్వేదగర్జనము ... ౭౮
—ఏటుకూరి వేంకటనరసయ్య

౪. గురుకుల బృందావనము ... ౮౧
—గో. సత్యనారాయణ, బి. ఏ.

౫. జీవనధ్వని ... ౮౩
—మల్లాది వేంకటకృష్ణశర్మ

౬. నేటి డిక్టేటర్ల అలవాటులు ... ౮౪

౭. వైద్యమహాశయుడు ... ౮౫
—నండూరి బంగారయ్య బి. ఏ.

౮. పాపారాయఁడు ... ౮౮
—ఓలేటి సీతారామమూర్తి

౯. సుప్తసౌందర్యము ... ౯౨
—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి. ఏ.

౧౦. జార్జిలాన్సుబరీ జీవితారంభపుదినములు ... ౯౩
—వి. జగన్నాథస్వామి, బి. ఏ.

౧౧. చీనాదేశపు పెద్దగ్రంథాలయము ... ౯౬
—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

౧౨. తెన్గువాటి తూర్పుపడమరలు ... ౯౮
—నాళము కృష్ణారావు

౧౩. తెనుగుకథల తొలికోళ్ళు ... ౯౯

౧౪. పట్టు పరిశ్రమ ... ౧౦౪
—బాగు గోపాలరావు.

౧౫. సుకారీ, లంబాడీ, మరాఠీ ... ౧౦౯
—కవికొండల వెంకటరావు బి. ఏ., బి. ఎల్.

౧౬. ఫ్రాంక్ విన్ఫేల్డు పూల్వర్తు ... ౧౧౧

౧౭. ఓకవీ! ... ౧౧౭
—తురగా వేంకటరామయ్య

౧౮. జిజ్ఞాస : మీమాంస. ... ౧౧౮

౧౯. బర్మాఆంధ్రులు : కొన్నిసమస్యలు. ౧౨౦
—పి. వీరాస్వామి.

౨౦. "తాళితేమూగవాళ్ళు" ... ౧౨౨
—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి.

౨౧. మణిమాల ... ౧౨౩

౨౨. ఎలక్షన్ జ్వరము ... ౧౨౫
—పి. బ్రహ్మాజీరావు, ఎం.బి.బి.ఎస్.

౨౩. ఉలికిపడకుము, గోపాల! ... ౧౨౭
—ముక్కవిల్లి వెంకటనారాయణ, బి.ఏ.

౨౪. పట్నవాసపుకోడలు ... ౧౨౮
—టి. ఎన్. రాములు, బి.ఏ.

౨౫. "ఆంధ్రభూమి" పుస్తకపీఠము ... ౧౩౧

౨౬. క్రొత్త పత్రికలు ... ౧౩౩

౨౭. సంపాదకీయసమాలోచన ... ౧౩౪

౨౮. భీమాప్రచారము ... ౧౩౬
—యం. యస్. ఆర్. ఎ. గుప్త.

౨౯. "జయవిజయ" ... ౧౩౭

౩౦. జీవితభీమా : కొన్ని ఆలోచనలు ... ౧౩౮
—జమిలి నమ్మాళ్వారు.

౩౧. అవలోకనము ... ౧౪౨

౩౨. చాదరీస్ మెడికల్ రిసెర్చిఇన్స్టిట్యూట్. ౧౪౩





బుడ్డి వెల 0-5-0 —నొప్పుల నివారించుటలో సాటిలేనిది—డజను రు. 3-0-0.

హనుమాన్ పెయిన్ బామ్ నుగూర్చి

మదరాసు 61. నారాయణమొదలి వీధిలోనుండే సుప్రసిద్ధ పిజీషియనులు, సర్జనులు అయిన

డాక్టరు వి. చంద్రశేఖరగుప్తగారు

ఇట్లు చెప్పుచున్నారు: "హనుమాన్ పెయిన్ బామ్ను నేను వాడి చూచియున్నాను. తలనొప్పి, నడుమునొప్పి మొదలగు వానియందు అది చాల అమోఘముగ పనిచేసినది."

హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజెంట్లు: 1. పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటరు, శ్రీరామాకృష్ణా ట్రేడింగుకంపెనీ, నరసారావుపేట.

2. శ్రీ కృష్ణా అడ్వర్టయిజింగ కంపెనీ, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరిజిల్లా.

ఏజెంట్లు లేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

## ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :—బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :—మ-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యియ్యబడును

### ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు, 2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును, 3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు, 4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి, 5. పట్టాదారులకు ఋణము లియ్యబడును, 6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును, 7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును, 8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జనన భీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :—సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

## ఆంధ్రప్రావిడెంటుకంపెనీ, గాంధినగర్, బెజవాడ.

## ఇంద్రజాల మహేంద్రజాలము

ఈ గ్రంథములో జర్మనీగారడి, హస్తలాఘవము, ఆంగ్లఇంద్రజాలము, మంత్రశాస్త్రము, భూతవైద్యము, యంత్రములు, చీట్లపేక తమాషాలు, వినోదవిద్యలు మనుష్యుని మాయము చేయుట, మామిడిచెట్టును పుట్టించుట, జీవముతో సమాధి యగుట, శరీరము లేని తలచేత మాట్లాడించుట, గాలిలో మనుష్యుని నిలుపుట, మొదలగు విచిత్రము లున్నవి. దీనిచే మేజిక్ చేయగలరు. వెల రు 4.

**చమత్కార గణితము**:—(అపూర్వము) ఇందులో విచిత్ర వినోదమనోగణితములు, సమస్యలు, చిక్కుప్రశ్నలు, యుక్తి తమాషాలెక్కలు, గణితావధానముగలవు. దీనిని చదివిన తెలివికలుగును. వెల రు. 1.

వలయువారు :—పి. ఆర్. జనార్దనంనాయుడు, ఒంగోలు, (గుంటూరుజిల్లా) అని వ్రాయుడు.

## నిజాము రాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మాకార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొనవగును.

—ఇట్లు, ఆంధ్రభూమి మేనేజరు.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేరు పెంటయ్యగారు, 4121 మూసాఖాన్‌వీథి, శికిందరాబాదు.

# పోటీబహుమానము —రూ. 10—

## క్రా గుణింత పజ్‌ల్

ఇందు కనిపెట్టవలసిన పదములన్నియు మూడేసి అక్షరములవి. ప్రతి పదమునందును ఒక్కొక్క అక్షరము ఈయబడినది. అది పదములో మొదటకాని, చివరనుకాని, మధ్యనుకాని రావచ్చును. కనిపెట్టవలసిన పదములో ఇచ్చిన అక్షరము మాత్రము ఏదో ఒకస్థానమున ఉండవలెను; మరియు ఆపదము సూచనకు సరిపోవలెను. ఉదాహరణము : 10. కొరడా.

ఇట్లే తక్కిన పదములను కనిపెట్టి కాపనులో వ్రాసి, జూలై 20 వ తేదిలోపున ఆంధ్రభూమికి పంపవలెను, సరియైన సమాధానములు సంపాదకునివద్ద ఒక సీలుకవరులో ఉంచబడినవి. వైమాసపు సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు తప్పులేకుండ పంపినవారికి రూ. 10 బహుమాన మీయబడును.

షరా:—సమాధానములు కాపనుమీదనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు కూడదు. ఒక్కొక్కరు ఎన్నికాపను లయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చుకాపనుకు ఒక అణాయును, వ్రాతకాపనుకు 2 అణాలును (తపాలా బిళ్ళలు) ప్రవేశరుసుము.

## కా గుణింత పజ్‌ల్

1. క — స్త్రీలు ధరింతురు.
2. కా — సంవత్సర నామము.
3. కి — రామాయణ కథలో ఒకస్త్రీ.
4. కీ — తురక సన్యాసి.
5. కు — వంటపాత్ర.
6. కూ — జలచరము.
7. కె — ఒక గొప్పదేశము
8. కే — అడవి జంతువు.
9. కై — సవతులు గల రాణి.
10. కొ — శిక్షించుటకు ఆయుధము.
11. కో — పక్షి.
12. కౌ — ప్రియుల విలాసము.
13. కం — వృత్తి.
14. క్ర — బండి నడుపునది.
15. కృ — కవులచే పొగడబడుచుండును.
16. క్క — వెర్రెత్తి మనుషులను కఱచు జంతువులు.

---

కాపను

కా గుణింత పజ్‌ల్ సమాధానములు.


| | |
|---|---|
| 1 ............ | 9 ............ |
| 2 ............ | 10 కొ ర డా |
| 3 ............ | 11. ............ |
| 4 ............ | 12 ............ |
| 5 ............ | 13 ............ |
| 6 ............ | 14 ............ |
| 7 ............ | 15 ............ |
| 8 ............ | 16 ............ |

సంపాదకుని తీర్పును అంగీకరింతును.

పేరు..............................

విలాసము..............................

..............



ప్రాచీన నృత్యము

(శ్రీమతి డిగుమర్తి బుచ్చి కృష్ణమ్మగారు చిత్రించినది.)



నిశ్చింతభావము
(శ్రీమతి దామెర్ల సత్యవాణిగారు చిత్రించినది.)

# సర్వేశ్వరా!

మ. వెలి వీక్షించిన నీస్వరూపమె మహా
విస్పష్టమై యాత్మలో
పల భావించిన నీస్వరూపమె మహా
ప్రవ్యక్తమై దృష్టులం
దలఁపం జేకొనియున్న నీయచలిత
ధ్యానంబునం జేసి తాఁ
గలనైన న్శివయోగి తన్ను జగముం
గానందు సర్వేశ్వరా!

మ భవదాకారమె కాంచు నీస్తవకదం
బశ్రేష్ఠసద్వాక్యముల్
చెవులార న్వినునిన్నె చెప్పు మది దు
శ్శీతేంద్రియాటోప దు
ర్వ్యవసాయాత్ములఁ గాంచుచో వినెడిచో
వర్ణించుచోఁ జీకునుం
జెవుడు న్మూఁగయునై చరించు మహి నీ
శీలుండు సర్వేశ్వరా!

మ. సతి వేడ్కం దనప్రాణవల్లభునితో
సంయోగ మర్థించుఁగా
కతనిం బ్రార్థనసేసి సొమ్ముఁ గొనిపో
నఱ్ఱాడునే భక్తుఁడీ
క్షితి నీభక్తియ వేఁడుఁగాక మఱి నీ
శ్రీపాదముల్గొల్చి కు
త్సితకామ్యార్థము నొందు వేఁడఁడొనునే
చింతింప సర్వేశ్వరా!

# పదమటిసీమ కవుల కతలు

## ౧

## కుందవరపు చౌడప్పకవి

ఈ చౌడప్ప రమారమి రెండువందలయేండ్లకు ముందటివాఁడు.

శాఖ: నందవరీకి * యనియు, ములికినాఁడనియు రెండు అభిప్రాయములుగలవు. 'కుందవరము' ఇంటిపేరుగా ములికినాటికుటుంబ మొకటి నేఁటికిని కడపజిల్లా రాజంపేట తాలూకాలో నొకగ్రామమున నున్నది. ఈ కుటుంబము చౌడప్పకవి పరంపరలోనిదని, ఇది యాఱవ తరమని చెప్పికొనుటగలదు. ఈ ములికినాఁటి 'కుందవరము' వారిది శ్రీవత్సగోత్రము; పంచార్షేయము: భార్గవ చ్యవన ఆప్నవాన ఔర్వ జామదగ్న్యులు.

చౌడప్పశాఖ యేదయినను కులమున బ్రాహ్మణుఁడు. ఈతని వర్తమానము కడపమండలమనుటకుఁ గల దృష్టాంతములు గొన్ని:

కవిచౌడప్ప తన శతకమున 'శ్రీపతి పుల్లూరిపట్టన గోపాలుఁడు' అని ఇష్టదేవతాస్తుతి చేసినాడు. ఈ పుల్లూరు కడపతాలూకాలోనిది. ఇందు గోపాలస్వామి గుడియు నున్నది. ఇప్పటి విభాగముప్రకారము, కడపమండలము రాచవీడుతాలూకాలో 'మల్లె' అని తెలుఁగురాచవారి యేల్బడిక్రిందిసంస్థాన మొకఁడుండెడిది. ఇది పూర్వము ఐతిహాసికప్రసిద్ధిఁగన్నది. నేఁడు 'మల్లె' గ్రామము నామమాత్రముగానున్నది. తత్సంస్థానపాలకుల పరంపరలోని రాచకుటుంబములు అటఁ గొన్నియున్నవి. ఈ రాచవారి రాచఱికమునకు లోఁబడియుండిన 'మల్లె' సంస్థానముగల ప్రాంతమును 'రాచవారిసీమ' అందురు. ఈ రాచవారిసీమ కడపమండలములోని రాచవీడు పుల్లంపేటతాలూకాలదాఁటి తిరుపతివఱకు వ్యాపించినది—'నగిరిసీమ' పొలిమేరవఱకు అన్నమాట.

ప్రస్తావనచుందలి 'మల్లె' సంస్థానాధీశుఁడగు అనంతభూపాలునకు ఈ మనచౌడప్ప ఆశ్రితుఁడని, మిత్రుఁడని తెలుపుటకుఁ దత్కవికృతముల నుద్ధరింతును:

"లేరా రాజులు భూమిని!
వారల నెవఁడెఱుఁగు? సకలవైభవముల నీ
వే రాజవు; నీతికి, విను
మా, రాజను కవిని నేన! మల్లెయనంతా!"

"అన్నిట నుంచివారు, విమలాత్ములు,
హాస్యకళాధురంధరుల్,
సన్నుతనీతిపారగులు, జాణలు,
సాధులు నెవ్వరంటివా:
పన్నుగ మాయనంతనరపాలునిఁ
గొల్చి మహానుభావులై

---

* నందవరీకి శాఖలో 'కుందవరము' ఇంటిపేరుగాఁ గలవారగపడరు. అట్లుండినచో వారిగోత్ర—సూత్రాదులును పరంపరయు మొదలుగా వివరములందించినఁ గృతజ్ఞుఁడను.

బ్రాహ్మణశాఖ లన్నిటిలో చౌడేశ్వరినిఁ గులదేవతగాఁ గొల్చువారు నందవరీకులేయని, వైశ్యాది—శూద్రులలో—సాలె వడ్రంగి లోనగాఁగొన్ని కార్మికజాతులలో—చౌడేశ్వరి కొలువుగలదనియు, చౌడేశ్వరి కులదేవతగాఁగల సంఘములు కడపమండలమున నెక్కుడనియు నెఱుంగునది చౌడప్ప చౌడమ్మపేర్లు నందవరీకిబ్రాహ్మణులలోఁగాక బళిగనాడు కాసలనాడు వార్లలోను గాన్పించుచున్నవి. ఇఁక సాలె వడ్రంగి వగయరా సంఘములలోని వారిలో నీపేర్లుగలవారున్నారు.

కడపమండలములో నట నట ఏఁడాదికొకమాఱు చౌడేశ్వరి కొలుపు జరుపుటయు, శక్తినిగూర్చిన వీరరసాప్లుతములగు దండకములు (ఖడ్గములు) చదువుచు కొలుపుగాండ్రు తమ యొడళ్ళను సలాకలతో, పిడిబాకులతో రక్తము గార్చుటయు, ఆనెత్తురుగలిపినకూడు దేవతకు నివేదించుటయుఁ బరిపాటిగ సాగుచున్నది.

వన్నెకు నెక్కు కుందవరవంశ్యులె
నున్నుర చౌడసత్కవీ!"

"మల్లె కుమారానంతుని
పట్లను వినయంబు లేని ప్రభువులు మహి నే
పట్లను జెడిపోదురు చే
కట్లంబడి కుందవరపు గవిచౌడప్పా!"

"మీరిన పగతుర మల్లెకు
మారానంతుండు విక్రమార్క నిరీతిక్
మారుకొనినఁ బోనీయఁడు
గా రణమునఁ! గుందవరపుగవిచౌడప్పా!"

ఇతని కవిత :

కందమున నితని నడపని నడక లేదు.

"ముందుగఁ జనుదినములలోఁ
గందమునకుసోమయాజి ఘనుఁడందురు; నేఁ
డందఱు నిను ఘనుఁ డందురు
గందములకు : కుందవరపు.........."

అనుట అతిశయోక్తి కాదు. ఈతని శతకమున, అచ్చున నున్నదాన, నెన్నియోపద్దెములు ప్రక్షిప్తము లయినవి; ఈశతకమునఁ గందములవెంట గీతములు వృత్తములు దొరలినవి. వేమన తన్నుఁదాన సంబోధించుకొనినట్లు ఈచౌడప్పయుఁ దన్నే సంబోధించుకొన్నాఁడు. పెద్దగాఁ జదివికొనినవాఁడు గాకున్నను, వ్యాకరణమర్యాదలకుఁ గట్టువడనివాఁ డయినను తన తలంపును చక్కని తెలుఁగున మాటిగఁ జెప్పినాఁడు. జాణతనమున్నది. నుడికార మితని కవితకు జీవాతువు. నుడికారము సొగసున్నది. నడకలో ఒయ్యారమున్నది. ధారలో ఉండేలివిస రున్నది. సంఘమునను వ్యక్తుల లోను గల వక్రగతులను వేళాకోళముచేసి వెక్కిరించు టయు ఇతని ప్రయోజనము. బూతులలో నీతులను బోధివినాఁడు. వంకరచేతలకు ఇతనిమాఁత వాతవంటిది. తెలుఁగునందలి మేలురకపు శతకములలో నొకఁడుగా ఈచౌడప్పశతకము ఉగ్గడింపఁదగినది.

ఇతఁడు మల్లెసంస్థానచరిత్రము పద్యగ్రంథరూపమున రచించెనని, అది మల్లెదొరల యుట్టాలయింటనెచటనో కలదని నారాచవీడుపర్యటనమున వింటిని. ఆచుట్ట మెవరో ఆయన ఊరేదియో తెలియమి, నాకును తత్సేకరణార్థము ఎక్కుడుకాలము వినియోగింప ననువువడమి ఆజతనము విరమించితిని. మాండలికకవుల యెడఁ గనికరముగలవా రెవరేని అట్టిగ్రంథముం గని పట్టఁ గడంగుదురుగాక !

౨

బెడుదూరు

# కందాళ రామాచార్యుఁడు

ఈ కందాళ రామాచార్యుఁడు గండికోట శ్రీవైష్ణవ శాఖీయుఁడు. తల్లి లక్ష్మమ్మ; తండ్రి శేషాచార్యుఁడు. వాధూలసగోత్రుడు. కడపమండలమందలి జమ్మలమడుగుతాలూకా బెడుదూరుగ్రామము వాసము. తన అఱువదియవయేట కాలగతిచెందినాఁడు; సుమారు 20 సంవత్సరము లయినది.

ఈయనకుఁ దనమామ శ్రీరంగము కృష్ణమాచార్యుఁడు విద్యాగురుఁడు. ఈ రామాచార్యుఁడు పెద్దగాఁ జదివినట్లు తోఁపదు. పూర్వపద్ధతి ననుసరించి సంస్కృతాంధ్రములలో నించుక ప్రవేశ మబ్బినట్లున్నది. తన పూర్వవయసువనే కవనధోరణిలోఁ బడినాఁడు. ఈయన రచించినవానిలో మొదటిది 'ద్రౌపదీవస్త్రాపహరణము'. వరుసగా 'హరిశ్చంద్ర,' 'కళాపూర్ణోదయము' పూర్వభాగము, 'విరాటపర్వము' రచించెనని తెలియుచున్నది. ఇవన్నియు నాటకములు. కడపటిదగు 'విరాటపర్వము' తక్క తక్కినవన్నియు, 'ద్రౌపదీవస్త్రాపహరణము' మొదలుగా నచ్చుపడినవి. ఇవన్నియు నాటకములపేరివి.

ఈ నాటకములు యక్షగానములకును, నేటి నాగరకనాటకము లనఁబడువానికిని నడిమిదారి నున్నవి. పద్య - గద్యములతో, పాటలతో గూడినవి. చాలవఱకు వీధినాటకములం బోలినవి. సంవిధానచాతుర్యము లేదు. సంభాషణాకౌశలములేదు పాత్రపోషణములేదు. పరప్రయోజనాదికములేదు. రసానుగుణమగు భావము

గాని, భావమున కనుకూలమగు పదముల పద్దెముల కూర్పుగాని కనుపడదు. ధార నిరర్గళనిర్ఝరిణీవేగము గలది. రాజును సేవకుఁడు పలుకరించునపుడు, రాణి చెలులతో మాటాడునపుడును ఒకటే ఎత్తుగడ! ఒకటే ధోరణి! మరియాదలేదు! మార్పులేదు! దుశ్శాసనుఁడు ద్రోవదివలువలు సభనొల్చునపుడు, పాంచాలి తనగతికి విలపించునపుడు, కరువలిపట్టి నలిరేగి కౌరవుల నధిక్షేపించునపుడు, ధార్తరాష్ట్రులు కౌంతేయులు పాలికలనిం దలపడునపుడును—రౌద్రమే తలకొనుచుండునుగాని రసభేదములు చూపడవు.

ఈయన ద్రౌపదీవస్త్రాపహరణనాటకము ఆడని యూరు కడపమండలమునఁ గడమపడియుండదు. కడపమండలమున నంతట పట్నములు మొదలుగా పల్లెపట్టుల వఱకుఁ బాతికసంవత్సరముల క్రితము బెడుదూరు రామాచార్యులపేరు, ఆయన నాటకములు విస్తారముగఁ బ్రశస్తిగాంచినవి. కర్నూలు అనంతపురము బళ్లారి నెల్లూరు మండలములలోగూడ ఈయన నాటకములు ప్రయోగింపఁబడిన గ్రామములు కొన్నియేనిగలవు. ఆకాలమున కడమటిసీమయందు పెద్దగఁ జెప్పికొనఁబడు పౌరాణికులలో ఈ రామాచార్యుఁ డొకఁడుగా గణింపఁబడినాడు.

ఈయనరచనకు మచ్చు: ద్రౌపదీవస్త్రాపహరణము నుండి:

కృష్ణుఁడు నాట్యముతో రంగమునఁ బ్రవేశించి, ద్వారపాలకుని నెఱుఁగ నడుగుట—

"ఒరీ, అదభ్రశుభ్రశారదభ్రవిభ్రమభ్రమణివిభ్రాజమానధ్వజపటాంచితబంధురద్వారసమ్మదగంధసింధురమ్ము చందమ్మునకంధరంబెత్తి దంధణవాక్యసందోహంబులుచ్చరించెడి మందమనుజా, నీవెవ్వఁడవు?"

ద్వారపాలకుని ప్రశ్నమునకు కృష్ణుఁడు తనపేరు పెంపులఁ దెలుపుట—

"ఒరీ, మదీయనామాంకితాక్షరంబు లెఱుంగవా? వినుము, అక్షీణబలపరాక్రమ విక్షేపితరాజ్యసాధ్యక్షశిక్షావిచక్షణదక్షుండనై, ముదితలక్ష్మీవక్షస్థలకౌస్తుభమణిఘృణిజాలవిరాజితుండనై, పదునాల్గు భువనములు ఉదరమున కదలనీయక పదిలముగ గుదురుపఱచుకొని, మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన రామ రామాద్యవతారంబులం బ్రఖ్యాతింగాంచి, జగదుత్పత్తి స్థితిలయకారణహేతుభూతుండనై, ...... కపటనాటకసూత్రధారుండనై జనియించిన బాలకృష్ణుని నెఱుంగవా సుగుణపుంగవా?"

పద్దెములలో గద్దెములలో పాటలలో ఆయన అవలంబించిన నడకయిది.

## 3

# కైప శేషశాస్త్రి

ఈ శేషశాస్త్రి మలికినాటి వైదికుండు. కౌండిన్యసగోత్రుఁడు. తల్లి శేషమ్మ; తండ్రి నారాయణయ్య. కడపమండలమందలి కమలాపురము పుట్టినయూరు. 48 సంవత్సరములు ఐహికరంగమున నటించినాఁడు. 1931 ఫిబ్రవరి నెలలో కడప ఆసుపత్రిలో కాయమును వదలినాఁడు.

చిన్నటినుండియు చిదాభాసకళలు చూపడుచుండెడివి. మెట్రిక్యులేషన్ తరగతివఱకు చదువు సాగించినాఁడు. వ్యవసాయదీక్షకన్న వ్యర్థకాలక్షేపమే ఎక్కువ. ఒపలిరితేని పటిమ నుడులఁ జొప్పడినది. కర్మశీలతయందు లేని చులుకదనము గ్రహణశక్తియందు గన్పడినది. ప్రతిభావిశేషము పాండిత్యముం దరిజేరనీయదు. భౌతికశరీరమున కబ్బని సౌష్ఠవము భావప్రపంచమునఁ బొందినాఁడు. వర్తనమువలెనే వాక్కును వెంకెనడకల నడచెడిది. తలఁపు తేనెపాకము; పలుకు పాషాణపాకము. సిగరెటు పొగకెరటములలో చిదానందము ననుభవించువాఁడు. ప్రాకృతికలంపటత్వముతో పరమార్థపథము జూచువాఁడు. రక్తిభావములన్నియు

విరక్తికి సోపానములని నమ్మినాఁడు. అనుభూతి యందు అల్లెదాటుటయే ఆత్మశాంతి యనుకున్నాఁడు. విషయవిలాసప్రకరణము కడముట్టింపక విశ్వరహస్యము బోధకాదను మతమువాఁడు శుచిత్వము మనసునకే కాని తనువునఁ బాటింపఁడు. పరసహన మనుస్థానమునకు లోబడదు నియతికి నిలుకడ కుదురలేదు. సమభావము సాధనకు రాలేదు. వాక్పారుష్య మొకచోట స్థాయిపడనీయలేదు. వాక్పారుష్య మొకచోట స్థాయి పడనీయలేదు. ఆశకు దాసుఁడయినాఁడు! కడప హైస్కూలు పండితుఁడై కొన్నినెలలు గడపినాఁడు. కర్నూలు "కోల్సు మెమోరియల్ హైస్కూలు" పండితపదవిలో గొన్ని నెలలు జరిగినవి. కమలాపురము మిడిల్‌స్కూలు ఉపాధ్యాయత్వము కొలఁదికాలము సాగినది.

కడపమండలములో నటనట రెడ్డియువకులను వైశ్యులను అనుయాయిత్వమునకు సంపాదించినాఁడు. తన ఉచ్చులఁ దగులుకొన్నవాఁడు తన్నినను తన్నువదలఁడు! సారస్వతము మొదలుగా శాస్త్రాదివిచారములవఱకు తనవాదమే నెగ్గించుకొన్నాఁడు. వక్తృత్వము వాదచతురతను వలగొని మెలఁగినది. కమలాపురము కడ "బ్రహ్మానందాశ్రమము" నొకదానిని నెలకొల్పించినాఁడు. సాగించినాఁడు కొన్నాళ్ళు!

తెలుఁగు వలచికొలిచినది. సంస్కృతము మొలిచి పొలిచినది. ఆంగ్లము వెలసిఎలసినది. మాసములతరబడి చదివి సాధింపవలయు విషయము దినములలో సంగ్రహింపఁగల తీవ్రమగుబుద్ధి. కష్టించిగడించిన విద్యకన్న కాన్పుమాత్రమున ఊహించినదే ఈతనియం దెక్కుడు. పద్యము నొకదానిని జదివి ప్రబంధరసము దెలిసికొనఁగల సునిశితమయినచూపు. పడమటిసీమకేకాదు— తెలుఁగుసీమకు మొత్తముగా విద్యుత్తారవలె వెలుఁగవలసినబ్రదుకు మొలిచినచోటనే మకమకలాడి మలిగిపోయినది!

పేసకుప్పమీఁది మణివలె, మురుగుగుంటయందలి రాజహంసివలె ఆతని కృశీభూతమలినశల్యపంజరమున ఆతని యప్రతిమానమగుబుద్ధి పెడదారిఁబట్టి పేరయిన లేక కాలప్రవాహమునఁ గలసినది!

ఆతని రచించినగ్రంథములు: ముద్రితములు:

'శ్రీ వేంకటేశశతకము', 'ధనలక్ష్మీస్తవము';

అముద్రితములు: "కవిత్వతత్త్వనిరూపణము," "శ్రీనివాసభాగవతము" - 2 ఆశ్వాసములు - అసంపూర్తి.

ముద్రితములనుండి మచ్చులు:

"ఆకీటబ్రహ్మము నీ
యేకాకృతిఁబొల్పు నన్యమేదియు లే: దే
లోకమునం దెవఁడయినను
నీకృపకుం దప్పనొప్పునే ధనలక్ష్మీ!"

—(ధనలక్ష్మీస్తవము.)

"తల్లిఁ జాగొట్టు దుస్తనుజాధముండెల్లఁ
దండ్రిసేవకు జామదగ్న్యుఁడౌనె!
తండ్రితో వికటించు తనుజాధముండెల్ల
హరిదాస్యమునకుఁ బ్రహ్లాదుఁడగునె!
గురుపై విజృంభించు క్రూరాధముండెల్ల
వీరవ్రతమునల్వ విజయుఁడగునె!
నిన్ను విద్వేషించు నీచాధముండెల్ల
వ్యతిరిక్తభక్తివ్యవస్థ గనునె!
వాతలిడుకొన్నవఱడెల్ల వ్యాఘ్రమగునె!
పాపచేష్టుఁడు నీధర్మపథ మెఱుఁగునె!
కలిహరానంద, ఘనచిదేకప్రకాశ,
విశ్వలక్ష్మీశ, శ్రీపద వేంకటేశ."

—(శ్రీ వేంకటేశ్వరశతకము.)

ఈ మచ్చులంబట్టి ఈకర్త ఒకవిధముగా కవియని చెప్పఁదగినాఁడు. కవితాకళ సాక్షాత్కరింపలేదనరాదు గాని స్వాధీనము పూర్తిగ నయినదనరాదు. కవితాకళకు జీవమయిన ఆవేశము, రసము ఈయన వ్రాఁతలయందుఁ జాలినంతలేదు.

—మున్నంగి శర్మ.

# నిర్వేదగర్జనము

[స్థూలదృష్టితో ఈ వ్యాసమును రెండుభాగములుగా విభజింపవచ్చును. ప్రథమభాగమున కవితాప్రస్తావన; ద్వితీయభాగమున కవులప్రస్తావన. కవితాప్రస్తావననుండి విషయమును కవులప్రస్తావనలోనికి జార్చుపట్టున కవి తన్నుగూర్చి చెప్పికొన్నాడు. కావ్యశ్రీకి నిత్యము సాధువాదమిడుచు అతనికలకేలు జీవన్ముక్త రససంపన్నము గావించును. ఆతడు పవలును రేలును కావ్యరసమాధుర్యము సేవించుచు తృటిపాటిగా గడుపును. గొప్పకవీశ్వరు గ్రంథమన్న గుండెలుగ్రుమ్మరించు ఈకవి ఈకావ్యమున తిక్కన, శ్రీనాథ, పెద్దన, కృష్ణదేవరాయలను ప్రస్తావించుచున్నాడు. తిక్కన అడిదముగొన్నవాడో? కలమందినవాడో?—శ్రీనాథునకు సానుభూతినమస్కారము—పెద్దనఅదృష్టము కుళ్ళినదట! గుర్నాథుడు గీకినాడట! ('పోవగనిమ్ము నీకలము పోయినమట్టుకు' అనవలెగదా!). కృష్ణరాయలనుగూర్చిన తుదిరెండుపద్యములును మనోజ్ఞములు. పృథుచక్రవర్తి భూమిని గోవుగాచేసి ఓషధులు పిండినాడట. పృథువదాన్యుడు, కవితాప్రావీణ్యఫణీశుడు అగు కృష్ణరాయలు పితికినయావు భారతి. కృష్ణరాయలను స్తుతించు ఈ తుదిపద్యములను పఠించిన గ్రుక్కలోడనే మొదటిపద్యమునందలి 'ఎత్తునకెత్తు పద్దెమున కింత సుమారగు పైడిముద్ద మే, మిత్తుమటన్న స్వర్ణయుగ మేమయిపోయెనొ కానరాదురా' అను రెండుపాదములను పఠింపవలసియుండును. —సంపాదకుడు.]

౧

ఎత్తున కెత్తు పద్దెమున కింతసుమారగు పైడిముద్ద మే
మిత్తుమటన్న స్వర్ణయుగ మేమయిపోయెనొ కానరాదురా?
చిత్తముగద్దుగాని విరచింపగ మాటకు నొక్కకావ్యముం
బత్తెము లేదికే మొనరుపంగలనయ్య రసప్రబంధముల్.

౨

నెత్తురుబొట్టులో ఉబికి నీరయి చిందెడి భావవేదనా
వృత్తము లాలకించి పలవించెడు నానిరుపేదగుండె రే
కెత్తక నిద్రపోవునొ మఱెన్నటికేనియు మేలుకాంచునో
కుత్తుకనుత్తరించి తలకుంగడచన్నవి జీవితాశలుం.

౩

ఒక్కొకనాడిమండలమునుండి స్రవించెడు రక్తబిందువుల్
పుక్కిటజిందివచ్చు వలపుల్విరజిమ్మెడు భావవాసనల్
చెక్కిటదాండవించు దనసృష్టికి గన్నఱమోడ్చి ఒంటిగా
జక్కనిపద్యమల్లగల సత్కవి కార్ద్రితగల్గెనేనియుం,

౪

మఱియుటగాదురా? కవిత మోహనరూపము దాల్చినిల్చినం
గరుగనివాడు లేడు గుణగౌరవ మారసి ముద్దుపోకడల్
గఱువనివాడు లేడు కృతికర్తకు వేనకువేలు గాళ్ళపై
గురువనివాడు లేడు రసగుంఫనమై చెవి సోకెనేనియుం,

౫

జిలుగుంగూరుపు టూణిముత్తైపుసరుల్ చిక్కార్చి శయ్యావరిఁ
అలరుంబుప్పొడి పల్కు కప్పురము విన్నాణించి భావాదులన్
వలపెక్కించుచు జీవనమ్ము రససంపన్నంబుగావించి
నావలకేల్నిత్యము సాధువాదమిడు గావ్యశ్రీకి నభ్యర్థినై.

౬

ప్రసవదంతర్మధునిర్ఝరాంబువుల ద్రాక్షామంజరీగర్భరే
ణువులందాగిన సూక్ష్మజీవి పరమాణుప్రాయమై జీవితం
తువుసాగించినభంగి గావ్యరసమాధుర్యంబు సేవించుచున్
బవలున్ రేల్ త్రుటిపాటిగా గడపి దివ్యత్వంబు శాసింపనా ?

౭

భావము జోడుగుఱ్ఱములపైన సవారియొనర్చు భాషయా
దేవకురంగిపై గొలువుదీర్చు రసంబన చూతఖర్జుర
స్రావమరందబిందువుల స్నానమొనర్చును, సిద్ధహస్తమా !
పోవగనిమ్ము నీకలము పోయినమట్టుకు మారులేదికన్.

౮

గుండెలు గుస్సురించితిని గొప్పకవీశ్వరుగ్రంథమన్న బ్ర
హ్మాండముగా బరించి విజయధ్వజమెత్తుదు పచ్చిరక్తమున్
బిండుదు జీవరేణువులు బిక్కటిలన్ బ్రతిపద్యమందు ది
జ్మండలి మోసులెత్త నసమానరసప్లుతి ముంచి తేల్చెదన్.

౯

కాలముపక్వమై భరతఖండము కైతకు దోసిలొగ్గగా
ప్రాలినదాక్క దివ్యవిభవప్రసవంబు తదీయవాసనా
మూలకమై విదగ్ధజనమోహకమై రససంవిపాకమై
పాలొలికించెరా : తెలుఁగుభారత మంత్రధరాతలంబునన్.

౧౦

కడివెడుకంటి కశ్రువులు కండకు నొక్కక త్రివ్రేటు పై
నెడదకు ఱిచ్చపాటు తనువెల్లను బుల్కలుగా రచించెరా
అడిదముగొన్నవాడో, కలమందినవాడో మహామహుండు ద్రెం
పుడువడ రక్తవాహినులు బొంగె రసాంబుధి నింగిముట్టగన్.

౧౧

గడెకుం డెబ్బదిగంటముల్ విరుగ గీకంజాలు గుర్నాథుడున్
మెడద్రిప్పన్ గనకంబు గుప్పగలహామీ మన్నసిద్ధీశుడున్

తడ వొక్కింతయు లేక నిల్చినగదా తాతా! ఝుమాయించుచున్
మదమం ద్రిప్పకకై తలల్లితివిసుమ్మా! భాగ్య మిప్పాటిదే.

౧౨

గిరిగర్భం బొకవెన్నముద్దటు గఱింగెన్ బచ్చిబాలెంతనా
ధర పల్మారులు పుల్కరించినది నిద్రాముద్రయందైన బొ
బ్బరవెట్టన్ బులికూన ముత్తెపుజడిన్ వర్షించె బల్నబ్బ నీ
చెఱకుంబాలొలికించు నైజకవితాసృష్టిం ద్రవీభూతమై.

౧౩

కరుగదు వెన్నముద్దవలె గండలుచెండు ఫిరంగిగుండుకున్
వెఱువనిగుండెగాన పురవీధిని ఆ యెదురెండ నక్కవీ
శ్వరు నొకబండకొయ్యనిడి సంతసనుందిన కాలమెంత దు
ర్భరదురితోగ్రదుస్తరదురంతదురాగ్రహదుఃఖపాత్రమో?

౧౪

విడువక షడ్రసాన్నములు విస్సనపంక్తిని హేమపాత్రలో
గుడిచినభోగి, డిండిముని గుండెలుప్రీలగ గంచుఢక్క బో
నడచిన వాగ్మి, బంగరుటుయాలల దూగుచు గొండవీటిలో
గడపిన భాగ్యశాలి, తుది గష్టముపాలయి బండకొయ్యతో
మడసిన జోగిరా ఒకనమస్కృతి సల్పుము సానుభూతికై.

౧౫

ఎదురగుచోట దా మదకరీంద్రము డిగ్గి కరంబు సాచుచో
బదుగురు చూచిరా కృతికి బల్లకి మూపునెత్తిపట్టుచో
మదిమది నిల్చెనా భువనమాన్యుడు పెండెరముం దగుల్చుచో
హృదయము పొంగెనా భవదదృష్టము కుళ్ళినదోయి? పెద్దనా!

౧౬

పితుకంబూనిన యావు భారతి సదాప్రేమించి సేవించు శ్రీ
మతి యాంధ్రావని. గేహమా? భరతభూభాగంబు వల్లింప భా
రతమా? ముద్దుల బాలశిష్టు సరివారా? రాజరాజాదు లే
గతి దీవింతురు కృష్ణరాయధరణీకాంతున్ క్షమావంతుగాన్.
తెలుగున జీవకావ్యకళ దిద్దిన నీరతనాల చేతిలో
మొలచిన పద్దెముల్ జిలుగు ముత్తెపుగూర్పుల ముద్దులొల్కు నీ
పలుకులు చంద్రఖండములు భావము లచ్చపుదేనె తేటలన్
మలచినయట్టులున్న వసమానకళావిభవాభిరామమై.

—ఉభయభాషాప్రవీణ, ఏటుకూరి వేంకటనరసయ్య.

# గురుకులబృందావనము

## (ఆర్యసమాజికులు నిర్వహించుచున్న గొప్పజాతీయవిద్యాలయము.)

బృందావనము భారతవర్షమునందు విశేషముగ ప్రసిద్ధిగాంచిన స్థానములలో నొకటి. ప్రతి సంవత్సరము లక్షలకొలది యాత్రికులు, ముఖ్యముగ శ్రద్ధాళువులగు బంగాలీలు, ఈపుణ్యక్షేత్రమును దర్శించి స్నానాదికములు నిర్వర్తించుకొనుటకయి యేతెంతురు. ఈ గ్రామము యమునానదీతీరమునందుగల యొక్క సాధారణపు టూరేయయినను పురాతనకాలమునుండియు హైందవమతపురాణాదులలో నెక్కుడు మహత్త్వము గల పవిత్రస్థలముగ పరిగణింపబడుచుండెను. ఈ గ్రామమునందు పదునాల్గువేలకు మించిన జనసంఖ్య యుండదు: కాని గ్రామమంతయు చక్కని మందిరములతో శోభిల్లుచుండును. ఆ కట్టడములన్నియు కళాకౌశల్యమునుబట్టి విచారించినయెడల దర్శనీయములేయని వేఱె చెప్పనక్కరలేదు. వాని యన్నిటిలో రెండు విద్యాసంస్థలు మిక్కిలి ప్రశంసనీయములని వచింపదగును. ఈ రెండు సంస్థలును ఆదర్శప్రాయములై దేశసేవాపరాయణములై యున్నవి. వీనిలో మొదటిది 'ప్రేమమహా విద్యాలయము': రెండవది, 'గురుకులబృందావనము.' ఇచ్చట 'గురుకులబృందావనము'ను గుఱించిమాత్రమే సంక్షేపముగ వివరింపబడును.

"గురుకులబృందావనము" విఖ్యాతివడసిన యార్యసామాజికుల విద్యాసంస్థ. దాని కార్యనిర్వాహణము సంయుక్తప్రాంతములోని "ఆర్యప్రతినిధి"సభాయాజమాన్యమున జరుగుచున్నది. ఈ విద్యాలయము బృందావనమునందు 1911 సంవత్సరము డిసంబరు నెల 16 తేదిని స్థాపింపబడెను. కాని యంతకుపూర్వమే యీ విద్యాసంస్థ 'ఫరూఖాబాదు' 'సికంద్రాబాదు' పురములలో నార్యసామాజికులే నడుపుచుండిరి. సికింద్రాబాదులో నుండు సమయమునం దీసంస్థయొక్క ఆర్థికదశ మిగుల శోచనీయముగనుండెను. విద్యార్థులేబదియేడుగురుండినను, కోశమునందు పైసయైనను నిలువలేదు. పైగా ఋణములు హెచ్చెను. ఇది 1904 లో నుండినస్థితి.

ఇంతలో సంయుక్తప్రాంతములందు 'ఆర్యప్రతినిధి' సభవా రొకగురుకులమును స్థాపించుటకు నిశ్చయించి యిరువదివేల రూపాయిలను మూలధనముగ గూర్చిరి. ఎంతయోశ్రమపడి యీనిధిని ప్రోగుచేసిన పుణ్యపురుషుడు శ్రీనారాయణస్వామి. ఈధనము ప్రోగువడిన పిదప, సికంద్రాబాదు గురుకులసమితివారు తమ గురుకులము నేవిధమగు షరతులు కోరకుండగనే ఆర్యప్రతినిధిసభవారి కొసంగెదమని నివేదించిరి. ఆ నివేదనమును గైకొని సంయుక్తప్రాంతముల సభానిర్వాహకులు వాదప్రతివాదములయినపిదప 1904-వ సం॥ నందే సికంద్రాబాదుగురుకులమును స్వాధీనపఱచుకొనిరి. ఇదే బృందావనగురుకులమునకు ప్రారంభరూపము.

అంతట దేశభక్తుడగు మహేంద్రప్రతాపుడు బృందావనములో 'ప్రేమవిద్యాలయమును' ప్రతిష్ఠించెను. ఆరాజునకు యమునానదీతీరమున రైలుస్టేషనుకు సుమారొకఅరమైలు దూరమునం దొకరమణీయమగుఉద్యానవనముగలదు. ఆస్థానమే గురుకులభవనమునకు శ్రేష్ఠమని సభాకార్యనిర్వాహకులు నిర్ణయించి రాజాసాహేబునకు తమ సంకల్పమును దెలియజేసిరి. ఆర్యసమాజికాదర్శములం దారాజున కభిమానము లేశమైన లేకపోయినను ఉదారభావముతో నతడు సుమారు పదునారువేల రూప్యముల విలువగల తన తోటను భూమినికూడ నీశుభకృత్యమునకై వారికుచితముగ నిచ్చివేసెను. ఆ వనమునందే 1911-వ సం॥ నందు స్థాపింపబడి 'గురుకులము' నేటి కనేకవందలయకరములను క్రమముగ సంపాదించి నిలిచియున్నది. లక్షరూపాయలు ఖరీదు చేయు భవనము లాస్థలమునందు నిర్మింపబడియున్నవి.

'ఫరూఖా' బాదునుండి గురుకులము 'బృందావనము' నకు మార్చబడునప్పటి కాసంస్థకు ముఖ్యాధిష్ఠాతపదవియందు 'శ్రీపండిత భగవాందీను' నియుక్తుడై తన ధర్మ

ము చక్కగ నెరవేర్చుచుండెను. కాని దురదృష్టవశమున బృందావనమునకు వచ్చిన ఆరునెలలో నతడు స్వర్గస్థుడాయెను. ఆతని తరువాత గురుకులకార్యభారమును వహించి సమస్తవ్యవహారములను జక్కబెట్టుటకు యోగ్యతగల పురుషు డొక డగత్యమయ్యెను. అప్పటికి మునిషీ నారాయణప్రసా దింకను సర్కారు నౌకరిలో నుండెను. పింఛనుతీసికొనుట కొక సంవత్సరము వ్యవధానముగలదు. అయినను గురుకులము పయిగల యభిమానముచే నతడు ప్రధానాధిష్ఠాపకుని పదవినిగైకొని తన యుద్యోగమునకు శెలవుదీసికొని గురుకుల వ్యవహారములను సవరింపసాగెను. శెలవు పూర్తియయిన పిదప నత డింకను శెలవుగోరెను. కాని సర్కారు నిరాకరించిరి. అందుచే నొకవిషమసమస్య యుదయించెను. ఒకవైపున గురుకులక్షేమవిషయము రెండవవైపున చిరకాలార్జితమగు పింఛను విషయము. సామాన్యు డెప్పుడైనను పింఛను ద్రవ్యమును గోల్పోవుట కిష్టపడకుండును. కాని నారాయణప్రసాదు ఉన్నతాశయుడగుటచే తన కర్తవ్యధర్మమును నిర్వర్తించుటకు దృఢనిశ్చయుడై వెంటనే యుద్యోగమునకు రాజీనామా నొసంగెను. అటుల ప్రభుత్వసేవాబంధనమును ద్రెంచివైచుకొని యతడు మనోవాక్కాయకర్మములచే గురుకులమునకై శ్రమపడ నొడంగెను. శ్రేయుం బగు నీసంస్థవిషయమై యతడు తనయావచ్ఛక్తిని ధారబోసి దాని యౌన్నత్యమునకు గారకుడయ్యెను.

నారాయణప్రసాదున కేబదవ సంవత్సరమునందు ధర్మపత్ని వియోగము దటస్థించెను. ఇక లౌకికబంధనములను త్యజించి యాత్మోపలబ్ధియై యేకాంతవాసమున కాలముగడపుట కనువగు సన్న్యాసాశ్రమస్వీకారము గావించుటే యుక్తమని యతనికి దోచెను. ఆతని సంకల్పమునకు గురుకులముపయిగల మమకారము సైతము ప్రతిబంధకముగ నిలువకపోయెను. 1920-వ సంవత్సరమునందు జరిగిన విద్యాలయవార్షికోత్సవమే యతని యాజమాన్యమునందలి తుదిసారి యుత్సవము ఆ వీడుకోలు సమయమునందు స్నాతకులందఱును భక్తివిధేయతలతో నతనికి సన్మానపత్రము నర్పించిరి.

అతని తరువాత గురుకులవిషయమై శ్రద్ధవహించి పనిచేసినవారిలో పండిత గంగాప్రసాదుగారు ముఖ్యులు. ఈయన పెత్తనముబూని కార్యము నిర్వహించిన కాల మల్పమే యయినను ఆ విద్యాసంస్థయొక్క యితిహాసమునం దీయన ప్రధానపాత్రమని చెప్పదగును. ఆయన విరమింపబోవునపు డావిద్యాలయమును శివనారాయణశుక్లగారికి అప్పగించిరి. శుక్లగారు మహాప్రతిభాశాలురగు మేధావులు: ఆయన మూడుసంవత్సరములు 'గురుకుల' కార్యములను నిర్వహించెను. అనంతరము 1925 సంవత్సరమున మహాత్మ శ్రీరాములు బృందావన విద్యాసంస్థకు ముఖ్యాధిష్ఠాతలుగ నియమింపబడిరి.

ఆ గురుకులమునుండి శిక్షను సమగ్రముగబడసి యివతలికివచ్చిన విద్యార్థులు అధికసంఖ్యాకులు గాకపోయినను సాంఘికశ్రేయమునకై పాటుబడువారై శ్లాఘనీయ వర్తనము గలిగియున్నారు వారిలో గొందఱు వేర్వేరు విద్యాలయములందు భిన్నభిన్నవిషయములను బోధించెడి యుపాధ్యాయులుగను, మహోపాధ్యాయులుగను పనిచేయుచున్నారు. మఱికొందఱు ధర్మప్రచారకులయి ఆర్యసమాజసేవకులుగ కాలముగడపుచున్నారు. ఇంకను గొందఱు సాహిత్యసేవాపరాయణులై దేశభాషలందు గ్రంథములను రచించుచున్నారు. కొందఱు గురుకులమునం దాయుర్వేదము నభ్యసించి వారివైద్యమును ప్రజల రోగాపహరణమునకయి వినియోగించుచు సద్వైద్యజీవనమున కాలము బుచ్చుచున్నారు.

గురుకులములో చరిత్రనిర్మాణమే ప్రధానలక్ష్యముగ గణింపబడుచున్నది. బ్రహ్మచర్యమే యాసంస్థకు జీవనము: వైదికాదర్శములే దానికి దేహము: జాతీయత దాని కాయువుపట్టు. నేడు గురుకులమునందు సంస్కృతభాషయందే గాక ఆంగ్లేయభాషలో సైతము బి. ఏ. వఱకుకూడ విద్య గఱపబడుచున్నది. దానికి సాంవత్సరికవ్యయము రమారమి అరువదివేల రూపాయిలు: విద్యార్థుల కుచితముగనే శిక్షయొసంగబడును. అయినప్పటికిని ప్రభుత్వసహాయమును గురుకుల నిర్వాహకు లేమియు పొందుటలేదు: ఈసంస్థకు 1930 సంవత్సరమునందు రజతజయంతి బహుజయప్రదముగ జరుపబడినది.

—గో. సత్యనారాయణ, బి.ఏ.

# జీవనధ్వని

గీ. "అకట! యీమందిరంబు శూన్యంబుచేసి అక్కటికమేది దీపంబు నార్పివైచి
భవనమునునుండునట్టి యాపరమహంస యెచటకుంబోయెనో కనరా దిదేమి?"

—వేంకట పార్వతీశ్వర కవులు.

సాయంత్రం ఆరుగంటలకు ఆరంభించి ఊళ్లో ఉన్న ప్రతిడాక్టరింట్లో తిరిగితిరిగి పదకొండుగంటలకు స్వగృహం చేరుకున్నాడు.

సింహాచలం సహజంగా కృశశరీరుడైనా తగిన పోషణలేక కండలుకదలిన శరీరముతో లోతుపోయిన కళ్ళతో లొత్తపడిన దవడలతో చిందరవందరైన క్రాపింగులో చిరిగిపేలికలై మలినమైన గుడ్డలతో వెఱ్ఱివానివలె కనబడతాడు.

ఏడాక్టరునడిగినా పదిరూపాయిలమందులు కొనమనడమే. అతనివద్ద పదిరూపాయిలు కాదు పదిదమ్మిడీలుకూడా లేవు.

తిరిగితిరిగి యింటికివచ్చి గోనెకుట్టిన వాలుకుర్చీలో కూలబడ్డాడు. కుర్చీకి ఎదురుగా నులకమంచంమీద చింపిబొంతలో ఇరవైఅయిదేండ్ల వయస్సుగల స్త్రీ స్పృహతప్పి పండుకున్నది.

ఆమె శ్వాస కఠినమై, సన్నని విపరీతస్వరంతో, గురుకుతో గుండెకాయను తుళ్ళిస్తూ పైకివస్తూంది. కళ్ళు అరవిచ్చిఉన్నాయి, మొగము పాలిపోయి కళావిహీనమైపోయింది. ఆమెప్రక్క మూడుదినములు వయస్సుగల చంటిపాపఉంది. దిగువ చింకిచాపమీద పదకొండు, ఎనిమిది, మూడుసంవత్సరముల వయస్సుగల పిల్లలు గాఢనిద్రలో ఉన్నారు.

ఎనిమిదేళ్ళ వయస్సుకలది ఆడపిల్ల.

ఎదురుగా ఒక విరిగిపోయిన దేవదారుడొక్కుమీద పొగలుకక్కుతూ ఒక దీపంబుడ్డీ యెఱ్ఱగా వెలుగుతూంది. ఇల్లంతా విరజిమ్మబడిన గుడ్డపేలికలతోనూ, విరిగినపెట్టెలతోనూ, ఎండినఆకులతోనూ, బూజుతోనూ నిండిపోయింది.

సింహాచలం నుదుటిమీద చెయ్యిపెట్టుకొని కళ్ళు మూసుకొని కుర్చీలో అలాగే ఉండి ఉండి లేచి మెల్లిగా మంచందగ్గిరకివచ్చి "పిల్లా, పిల్లా" అని మెల్లిగాపిలిచేడు. ఆస్త్రీ పలకలేదు—చూడలేదు. ఆమె ప్రక్కనున్న చంటిపాపను అటూఇటూ కదిలించి చూచేడు. పిల్ల కఱ్ఱకట్టిపోయింది. సింహాచలందూరంగా ఒక చింకిగుడ్డపరిచి ఆపిల్ల నక్కడపడవేసి, మళ్లా మంచందగ్గిరికి వచ్చి "పిల్లా, పిల్లా" అని మెల్లిగాపిలిచి "చంటిపిల్ల చచ్చిపోయిందిలే, ఏడువు" అన్నాడు. ఆమె కదలలేదు—చూడలేదు. శ్వాసమాత్రం సముద్రపుహోరులాగ వినబడుతూంది. గుండె పెద్దకెరటంలాగ కొట్టుకుంటూంది. సింహాచలం అటూఇటూచూచేడు.

దీపం కాంతివిహీనమై ఆరిపోవడానికి సిద్ధంగా ఉంది. గభీమనిలేచి మూడేళ్ళబాలునికోసం జాగ్రత్త పెట్టిన పాలగళాసు తొందరలో తన్నివేసినాడు. ఆ పాలు తుళ్ళి నిద్దరపోతూన్న ఎనిమిదేండ్లపిల్లపై బడినవి. ఆపిల్లలేచి ఏడుస్తూ కడమపిల్లల్ని లేపినది. ఇంతలో దీపం ఆరిపోయింది. ఇల్లంతాచీకటి, ఒక్కపెట్టున పిల్లలంతా గొల్లుమని లేచారు. సింహాచలం గుడ్డివానివలె అటూఇటూ తిరుగుతూ జేబులోవున్న అగ్గిపెట్టెతీసి దీపం వెలిగించేడు. కిరసనూనెకోసం ఇల్లంతా వెతికేడు. సీసాలో నూనెలేదు. మూడేళ్ళపిల్లడు గుక్కతిప్పకుండా ఏడుస్తున్నాడు. సింహాచలంబాలుణ్ణి ఊరుకోపెట్టడానికి ప్రయత్నించేడు. ఆకలిబాధచేత పిల్లడు ఏడుపుమానడు. రమారమి ఒంటిగంటకావచ్చింది. బాలుడు మరిఏడవలేక పండుకున్నాడు.

సింహాచలం మళ్ళా మంచందగ్గిరకివచ్చి "పిల్లా, పిల్లా పలకవూ, ఇటుచూడు" అన్నాడు. అతని ఎఱ్ఱ

నివిశాలనేత్రాలనుండి మూడు బాష్పబిందువులు రాలినవి. ఆమె పలకలేదు—చూడలేదు. శ్వాస మునపటికన్న ఎక్కువగా లోచింది.

సింహాచలం మళ్ళా కుర్చీలో కూలబడి డాక్టర్ల జవాబులు తలంచుకుంటున్నాడు. ఆర్తులపట్ల వాళ్ళ ప్రవర్తన పాపభూయిష్టమైన దనుకున్నాడు. ఆతురతతో వచ్చిన నిరుపేదపట్ల వారు చూపించే అనాదరం దౌర్జన్యంగా భావించేడు. తనభార్య బ్రదుకదని నిరాశ చేసుకున్నాడు. పిల్లల్ని తలచుకొని కొంతసేపు ఏడిచాడు. —అనేకవిధాల విచారిస్తూ కళ్ళుమూసేడు.

తెల్లవారింది. అయిదుగంటలు కావచ్చింది, పిల్లలంతా లేచి తల్లిమంచంచుట్టూ చేరి "అమ్మా, అమ్మా" అని పిలిచేరు

ఆమె తెలివితెచ్చుకొని నీళ్ళిమ్మనిఅడిగింది. మంచం కింద గ్లాసులో నీళ్ళుతీసి నేనంటే నేనని పిల్లలందరూ పోయబోయింది. ఆనీరు కొంత ఆమెనోటిలోనూ కొంత ఆమె మొగంమీద పోసినారు.

ఆస్త్రీ హీనస్వరంతో కుర్చీలోపడివున్న సింహాచలాన్ని అర్థనిమీలితములైన దృష్టులతో చూస్తూ "ఏమండీ! పక్కలో చంటిపిల్ల ఏదీ? ఔనా—ఏమండీ!"

సింహాచలం పలకలేదు—చూడలేదు.

ఆమె పెద్దవానినిపిలిచి "నాయనా నాన్నగారిని లేపు" అంది. ఆబాలుడు కుర్చీదగ్గరకువెళ్ళి తండ్రిగెడ్డాం పట్టుకొని "నాన్నా! నాన్నా! లేలే—పొద్దెక్కింది. చద్దిఅన్నంపెట్టూ."

అతడు కదలలేదు—చూడలేదు.

మళ్ళా బాలుడు "నాన్నా! అమ్మలెమ్మంటూంది. లేలే."

కదలలేదు—చూడలేదు.

"ఏమండీ! పలకరు." మంచంమీదనుండి స్త్రీ వికృతమైన కంఠస్వరంతో ఆరినపెదవులనుండి "ఏమండీ! పలకరు—పిల్లలు, పిల్లలు—లెండి—లెండి." అన్నది.

సింహాచలం చూడలేదు—కదలలేదు.

—మల్లాది వేంకటకృష్ణశర్మ.

# నేటి డిక్టేటర్ల అలవాటులు

నేడు లోకమున డిక్టేటర్ల సంఖ్య పెరుగుచున్నది. వారిచరిత్రలు అద్భుతములు వారిఅలవాట్లు విచిత్రములు. రష్యా డిక్టేటరు స్టాలిన్ జోళ్ళుతొడుక్కొని ఉండియే నిద్రపోవును. మాతృభాషలోనే మాటలాడును. అయితే పదములను నొక్కినొక్కి ఉచ్చరించును. నల్లటిరొట్టె అనిన చెవికోసికొనును. బాగుగా ఉడకపెట్టబడిన గ్రుడ్లతోను, పలుచగా వండబడిన కోడిపిల్లలమాంసపు పులుసుకూరతోను పచ్చిఉల్లిపాయల ముక్కలు నంజుకొని భుజించును. టురుష్క ప్రజాస్వామిక ప్రభుత్వనియంత యగు కెమాల్ పాషా తాను బదులువ్రాయు ఉత్తరములన్నియు ఆంగ్లభాషలోనే వ్రాయును. వేచిన గోధుమాంకురమును ఇతర పదార్థములను కడుపు నిండుగా తినినపిమ్మట అతడు ఒకకప్పు టర్కిష్ కాఫీని త్రాగును. చక్కగ నాట్యముచేయును. జాజ్ సంగీతమనిన చాల ప్రియముపడును. గృహమున కుటుంబ వ్యక్తులనడుమ నున్నప్పుడే ఇటలీ దేశపు నిరంకుశప్రభువు మందహాసమైన చేయును. అట్టి సమయములందే అతడు సంగీతముకూడ పాడును. అదివినినవారికి అతడు పుట్టుకతోడనే సంగీతపాఠకుడయ్యేనా అనునంతటి హాయిని, ఆనందమును కలిగించును. పులుసుకూరలమీద అతనికి మనస్సు హెచ్చు. పారశీక దేశపునిరంకుశప్రభువు రిజా పహ్లావీ మాంసముముట్టడు. శాకాహారములనే భుజించును. ఆటవస్తువులలో యుద్ధభటులను ఏర్పఱచుకొని వానితో తీఱికసమయములందెల్ల క్రీడావినోదముల జరుపుచుండును. జర్మనుదేశపుడిక్టేటరు హిట్లరుకు పంది మాంసము చాలఇష్టము. అందులో కనుబొమలదగ్గఱ ఉండే మెత్తటిమాంసము అనిన చెవికోసికొనును. మనము మామిడికాయలతో పచ్చడిపెట్టుకొనునట్లు జర్మను దేశస్థులు కాబేజీలో పచ్చడి పెట్టుకుందురు. దానికి జర్మనుభాషలో శౌర్ క్రాంట్ అని పేరు. పందిమాంసములో ఈ పచ్చడి నంజుకొనుట హిట్లరుకు పంచభక్ష్యపరమాన్నభోజనము. డ్రాయింగురూము డ్రస్సులో చాలసేపు ఉండుట హిట్లరుకు కిట్టదు.

# వైద్యమహాశయుఁడు

డాక్టరు సుదర్శనరావుగారి తలిదండ్రులు సూక్ష్మబుద్ధి గలవారని యూహింపదగియున్నది. లేకున్న డాక్టరుగారిబుద్ధి రోగములపై (రోగులపైగాదు) సుదర్శనచక్రమువలె బనిచేయునని జననకాలమందే కనిపెట్టి సార్థకనామధేయము నుంచుట వారికెట్లు సాధ్యపడును? డాక్టరుగారు మహోన్నతకాయుడు. చిన్నపుడు బాగుగా కసరత్తుచేసి పెంచిన దేహముగుటచే రోగిమంచముప్రక్కను డాక్టరుగారు నిలువఁబడినపుడు "యమభటులతో పోరాడియైన వారిబారినుండి నన్నీయన రక్షింపఁగలడు" అను ధైర్యము రోగికి కలిగితీరును.

దేహబలమేకాక బుద్ధిబలముకూడ మా వైద్యమహాశయున కపారమే. ఆతనికున్న యెత్తులు మాయూరి నింకెవ్వరికిని లేవు. ఇంతవరకు డాక్టరుగారు పొందినడిగ్రీ (ప్యాసయిన పరీక్ష) యేదో కనుగొనఁజాలినవారు మాయూర నొక్కరును లేరు. జనసమాజములో కొందరాతడు యం.బి.బి.యస్. అనియు, మరికొందరు యల్.ఆర్.సి.పి. అనియు, యింకను కొందరు మరికొన్నియక్షరములను వేనినో సంపుటరీకరించియు స్వకపోలకల్పితములగు డిగ్రీలు యిచ్చుచున్నారేకాని యొక్కరును వాస్తవము నెఱుంగరు. జ్యోతిశ్శాస్త్రసాహాయ్యముననైన డాక్టరుగారిడిగ్రీయేదో తేలకుండనున్నది. గతపుష్కరమునుండియు ఆయన మాయూర ప్రాక్టీసు చేయుచున్నను ఆయన స్వగ్రామమిదియని నిశ్చయించి పలుకఁగలవారిప్పటికొక్కరును మాయూర లేరు. ఆయన యేయూరివాడైన మనకెందులకుగాని క్రొత్తగావృత్తిలోనికిఁ బ్రవేశింపదలచుకొన్న యువకులు ఆయనయొద్ద నేర్చుకొనవలసిన యంశము లసంఖ్యాకములుగనుండుటచే లోకోపకారార్థము అందు నాకు ముఖ్యమనితోచిన లక్షణముల నిందు వర్ణించుచున్నాను.

మొదటిది వారిమందహాసము. వారిమందహాసము సోకినరోగి మరలవారిని విడిచిపెట్టదు. ఎప్పుడు నవ్వవలెనో ఏతీరును నవ్వవలెనో ఎంతవరకు నవ్వవలెనో వారికి తెలసినట్లు యింకొకరికి తెలియదు. ఆ మందహాసము సంపెంగపువ్వు పరిమళమువలె మొగము మొత్తదు గులాబీపుష్పసౌరభ్యమువలె మెల్లమెల్లగ హృదయాకర్షణ మొనర్చును. "నీ వైద్యము నాకొంపదీసినది" అని తిట్టుటకు వచ్చినవారినిసైతము చేతులు జోడించి నమస్కరింపఁజేయు సమ్మోహనశక్తి దానిలోనున్నది. ఆ మందహాసమునకు రోగులయినుపపెట్టెలు తమంతతాముగ విడిపోవును. ఆతనిహృదయము ఆపరేషను కత్తికంటెను నిశితమైనది. కాని ఎంతటిక్రౌర్యమునైనను ఎంతటికౌటిల్యమునైనను ఆతడు మందహాసము చాటున మాటుపఱచఁగలఁడు. ఆపరేషనుటేబిలుమీఁది చంద్రహాసము కంటె మాడాక్టరుగారి మందహాసమే ప్రయోజనకారియని తజ్ఞులకు తెలియనివిషయముకాదు.

మాడాక్టరుగారి రెండవలక్షణము గాంభీర్యము. ఎవరెస్టుపర్వతము ఎత్తు కనుగొనఁజాలిన ధీరులున్నారు. పసిఫిక్ సముద్రము లోతు కనుగొనఁజాలిన శాస్త్రజ్ఞులున్నారు. కాని మావైద్యమహాశయుని మనస్తత్త్వము గనుగొనఁజాలిన ధీమంతు డిప్పటికి

పుట్టలేదు. ఆత డడుగని వారిది పాపము ధన మిచ్చును. కాని ఎవ్వరికి మనస్సుమాత్ర మీయడు. లోకమందరు నాతనికి స్నేహితులే ఆతనియింట టీపార్టీ జరుగని పూట లేదు. నిరతాన్నదాత. స్నేహితులుకాదు పర దేశబ్రాహ్మణులుకాదు ఎవరైనను వచ్చి తిని పోవచ్చును. ఎన్నిదినములున్నను "నీవెందుకు వచ్చినావు. ఇంకను ఎన్నిదినము లుండఁదల చుకొన్నావు?" అని యడుగువారు లేరు. ఈ అన్నదానమున నాతనికి జాతిమతభేద మతలేదు. క్రిష్టియనులుకాదు ముసల్మానులు కాదు ఎవ్వరైననుసరే ఆతని యాదరణకు, స్నేహమునకు పాత్రులే. గోపికలలో ఎవరిమట్టుకు వారే శ్రీకృష్ణునికి తక్కినవారియందు కంటె తనయందు ప్రేమాతిశయమని అనుకొనువారట. ఆతీరుననే అతనిస్నేహితులుకూడ ఎవరిమట్టుకువారే తన్నాతడు తక్కినవారి కంటె నెక్కుడుగ ప్రేమించునని అనుకొందురు. కాని ఒక్కరికిని ఆతనిగుట్టు తెలియదు.

మావైద్యమహాశయుని మూడవలక్షణము సర్వవ్యాపకత్వము. ఆతడు గాయకులలో గాయకుడు. నటకులలో నటకుడు. శ్రోత్రియులలో శ్రోత్రియుడు. సంఘసంస్కర్తలలో సంస్కర్త. ఈదినము కాస్మోపాలిటను డిన్నరు. రేపు పంచగవ్యప్రాయశ్చిత్తముతో రామాయణపారాయణ. శ్రీమహావిష్ణువునవతారములనైన లెక్కపెట్టవచ్చును గాని మావైద్యమహాశయుని వేషములను గణింప నలవికాదు. వేషముచేతనే గాక బాషచేగూడ మాడాక్టరుగారు జనాదరణమును సంపాదించుకొనగలరు. కన్యాశుల్కము, కంఠాభరణము మున్నగు నాటకములలోని హాస్యముచే రోగులను నవ్వించి వారి యనురాగమునకు పాత్రుడగుచుండును. "సాహసాద్భజతే లక్ష్మి" అను నార్యోక్తికి మాడాక్టరుగారు ప్రబలనిదర్శనము. ఎంతటి దుస్సాధ్యమైన రోగమునైనను సరియే "నేను కుదుర్చలేను" అనియాతడు చెప్పడు. కన్నుగాదు కాలుగాదు చెవికాదు ముక్కుగాదు ఏదైననుసరే నిరాఘాటముగ చెక్కివేయును. వైద్యసాహాయ్యము నిమిత్తము వచ్చినవారితో ముందుగ ఫీజు నిర్ణయించుకొనడము పద్ధతి యెన్నడును లేదు ఆపద్బాంధవుడగు రోగి కంటబడినది తడవుగ నడుమున కంగవస్త్రముకట్టుకొని నడిసముద్రములో నురుకు మన్నను ఉరుకును. ఈగకాలంత చోటిచ్చిన చో ఏనుగదేహమునకు సరిపోవు నావకాశమును సంపాదింపఁగలఁడు. అయిదురూపాయలు రావలసినచోట అరువదిరూపాయలు పుచ్చుకొనఁగల సామర్థ్యమున్నది. ఆసేతుహిమాచలమునను డాక్టరులలో ఎవరిని గూర్చి యడిగిననుసరే వైద్యవిషయమున వారికేమి తెలియదని మనలను నమ్మించఁగల వాక్చాతుర్య మాతనికడ నున్నది. "ఇంత సుప్రసిద్ధునిగూర్చి యింతనిరసనభావముతో ముచ్చటింపవచ్చునా" యని యెన్నడు నాతడు వెనుకకు జంకడు. మరియు మాయూర నేక్రొత్తయుద్యమము వచ్చినను ఆతడు ముందంజవేయును. క్రొత్తగా నాటకము వచ్చినచో పిట్టులో నాతడు ప్రత్యక్షము. క్రొత్తగా సర్కసుగాని సినిమాగాని వచ్చినచో రాజపోషకులలో నాత డొకడు. ఒకపత్రికకాదు క్లబ్బుకాదు కాన్ఫరెన్సుగాదు ఏదిమొదలు పెట్టినను చందాలువేయుటలో తక్కినయూరివారందరు నొకయెత్తు. తానొక్కడు నొక్కయెత్తు. అట్లుచేసినగాని ప్రాక్టీసు సంపాదింపలేమనియు సంపాదించినప్రాక్టీసును నిలువఁబెట్టుకొలేమనియు నాతని నమ్మకము. ఎవరినమ్మకములు వారివి. వానితో మన కేమిగాని యాతని యీనమ్మకమువలన లో

కోపకార సుఖితముగ జరుగుచున్నది.

ఇంత విచ్చలవిడిగా సాహసించుచున్నాడు గదాయని మా డాక్టరుగారి కాత్మక్షేమముపై ప్రాలుమాలికయని మీరు భ్రాంతిపడవలదు క్షీరసాగరమున హాలాహలమువలె నాత్మక్షేమపరాయణత్వ మాతనిమనస్సున నతిని గూఢముగ నిక్షిప్తమైయున్నది. పైకెంత పరోపకారపారీణుడో లోపలనంత స్వలాభపరాయణుడు. నడచే నడకయందు మాట్లాడే మాటయందు నవ్వే నవ్వునందు - అంతయు స్వలాభమే. అయిదారుసుఖరోగముల కేసులను సంపాదించే అవకాశము లేకుండ నయిదుఃరూయలు పెట్టి నాటకములో టిక్కట్టు నెన్నడు నాతడుకొనడు. మీకాసందేహమేల? ఈదినము హరికథయని రేపు పాటకచ్చేరీయని యేదో యొకతీరున క్రొత్తక్రొత్త వినోదములను కల్పించి నలుగురను తమయింటికి రప్పించు సూత్ర మాలోచించుచునే యుండును. ఈదినముకర్చుపెట్టినాడో రేపు వడ్డీతోసహా పుచ్చుకొన్నాడో!

ఆత్మక్షేమపరాయణుడని మా వైద్యమహాశయుని మీరు నిరసింపనక్కరలేదు. ఆత్మక్షేమములో విశ్వహితమునుకూడ నాతడు జోడించి ఉభయతారకముగ తన వైద్యమును సాగించుచున్నాడు. మా వైద్యుడొక కేసు పట్టినా దానివలన ననంతముగ భూతసంతృప్తి జరగుచున్నది. శవముపై నాధారపడిన క్రిమికీటకములు రాబొందులు మొదలుకొని "ఎప్పైనను గోదానమే" యని దీక్షవహించిన బ్రాహ్మణోత్తములవరకు నందరు మా వైద్యమహాశయుని హస్తవిశేషమును కొనియాడవలసినదే. మా వైద్యమహాశయు డిల్లు బయలుదేరినది మొదలుకొని ఎక్కడ చూచినను ఆతని యనుచరుల నమస్కారబాణములే మందహాసముల మంగళహారతులే.

విశ్వకల్యాణనిమిత్తము మా వైద్యమహాశయునకుంగల దీక్షను ఇంతంతయని వర్ణింపనలవికాదు. ఇప్పటికి నలువదియేండ్లు దాటినను లోకసంగ్రహార్థ మస్ఖలితబ్రహ్మచర్యదీక్షనవలంబించి పనిచేయుచున్నాండు. ఆతని పరస్త్రీపరాఙ్ముఖత్వమునకు పురుషులందరును నిస్సందేహముగ సాక్ష్యమీయగలరు. అట్లని యాతనికి కల్యాణముమీద దృష్టిలేదని కాని పాణిగ్రహణపారీణుడు కాదనిగాని యూహింపకుందురుగాక. అనాథలగు వేశ్యలకును, బాలవితంతువులకును అనివార్యములగు యాపదలు తటస్థించినపుడు చక్రమడ్డువైవగల మహానుభావుడు సుదర్శనరావుగారొక్కరేయని మాయూరివారు ఘంటాపథముగ జెప్పుచుందురు. అర్థశాస్త్రమున గడనయెంతప్రధానమో కర్చుపెట్టుటకూడ అంతియే ప్రధానమని గ్రహించిన వేత్తయగుటచే నాతడు ఎంతశీఘ్రముగ గడించునో అంత శీఘ్రముగ కర్చుపెట్టుచున్నాడు.

ఇట్టి వైద్యమహాశయులవలన కలుగు లోకోపద్రవమును తొలగించుటకై ఋగ్వేదమునందు పెక్కు ఋక్కులు రచింపంబడినవి. అందొకదాని యనువాదము నీక్రింద బొందుపఱచుచు నీవ్యాసమును ముగించుచున్నాను. "ఓపురుషుడా! వైద్యులబారినుండియు వన్యమృగముల బారినుండియు మమ్ము రక్షింపుము. విషవాయువులకంటెను ప్రమాదకరమైన చిరునవ్వులతో హాలాహలముకంటెను నపాయకరమగు తృష్ణతో అశనిపాతముకంటెను తీవ్రములగు దృష్టులతో లోకమును క్షయింపజేయుచున్న యీ వైద్యమహాభూతములనుండి మాతల్లులకడుపుచలువయు, నీ యనుగ్రహమును మాకు నిత్యము అంగరక్షలై పనిచేయుగాక!" తథాస్తు.

—నండూరి బంగారయ్య

# పాపారాయఁడు

"ప్రభుని శాత్రవు హేతికి బలియొసంగి
బ్రతుకె నశియింప నొకరాజభక్తుఁ డగుచు
శౌర్యవాసన లాంధ్రదేశమునఁ జిమ్మి
తాండ్రపాపయ కీర్తి నిస్తంద్రుఁ డయ్యె."

—ఓలేటి సీతారామమూర్తి.

రెండువందల సంవత్సరములకుఁ బూర్వము బొబ్బిలిసంస్థానమును వెలమవీరుఁడు రావు గోపాలకృష్ణ రంగారావును, విజయనగర సంస్థానమును క్షత్రియవీరుఁడు పూసపాటి విజయరామరాజును పాలించుచుండిరి. ఇరుగుపొరుగు సంస్థానాధీశ్వరులగు రంగారావునకును, రామరాజునకును మనసులో రవరవలుపుట్టెను. తుదకవి ప్రబల శత్రుత్వముగాఁ బరిణమించెను.

ఆకాలమున నీదేశము విజాతీయులగు ఫరాసువారి యధికారముక్రిందకు వచ్చెను. కావున నిందలి జమీందారు లీయవలసిన పేష్కషు వసూలుచేయుటకు ఫరాసువారి గవర్నరు బుస్సీదొర యేతెంచెను. ఏతెంచి యాతఁడు రాజమహేంద్రవరమున కోటిలింగాలవద్ద డేరాలు వేయించుకొని మకాముచేసెను ఈ వర్తమానము విని విజయరామరాజు బుస్సీదొర నెదిరించుటకుఁ దనకు మద్దతురావలసినదని బొబ్బిలి రంగారావువారిని కోరెను. దానికి రంగారావు "మాకు, మీకు నిదివఱకు సయోధ్య లేదు. కావున మేము మీకు మద్దతురాము. బుస్సీదొర మాయింటిమీఁదికి వచ్చినప్పుడు మేము చూచికొందుము" అని బదులుచెప్పెను. ఆమాటలకు విజయరామరాజున కెక్కడలేని కోపమువచ్చెను. "ఈ సంవత్సరము బుస్సీదొరసాయమున నేలాగునైన బొబ్బిలికోట సాధించితీరెదను" అని ఆరాజు కుడిమీసముదువ్వి ప్రతిజ్ఞ చేసెను.

ఇట్లు ప్రతిజ్ఞచేసి విజయరామరాజు రాజమహేంద్రవరమువచ్చి బుస్సీదొరను కలిసికొనెను. అచ్చట రామరాజు బుస్సీతో బొబ్బిలివారిమీఁద లేనిపోని కొండెములుచెప్పెను. బుస్సీదొర యాకొండెములు నిజములని నమ్మెను. కావున బొబ్బిలికోటను ముట్టడించి బొబ్బిలివారిని శిక్షించుట కాతఁ డొప్పుకొనెను. అప్పుడు విజయరామరాజు బుస్సీదొరకు వెలలేనినజర్లు సమర్పించి బొబ్బిలికోట తనకుఁ బట్టముకట్టునట్లు మాట కరారుచేయించుకొనెను. ఫరాసుసేనలును, విజయనగరము సేనలు కలిసి బొబ్బిలికోటమీఁదికి బయలుదేరెను.

ఈసంగతి చారులవలన బొబ్బిలి రంగారావు తెలిసికొనెను. ఆతఁడు తన రాజ్యమును రక్షించుకొనుప్రయత్నములలో నాహారనిద్రలు మఱచెను. తాను నమ్మిన బంటు 'తాండ్ర పాపారాయని' పిలిచి రంగారావిట్లు చెప్పెను: "దేశమెఱుఁగని ఫరాసువారిని మద్దతుతీసికొని విజయరామరాజు మనమీఁదికి వచ్చుచున్నాఁడు. కావున నీవు కొంతసేనను తీసికొనిపోయి మన రాజ్యమునకు ముఖద్వారమున నున్న 'రాజాముకోట'లో వేచియుండవలెను. అనుకున్నంతత్వరలో విజయరామరాజు మన బొబ్బిలిమీఁదకు రాకుండ నీవక్కడ వారిని అటకాయించవలెను. ఈలోపున మేమిక్కడ బొబ్బిలిలో రక్షణప్రయత్నములు పూర్తిచేసికొందుము. ఈ పనికిఁ జాలినవాఁడు లోకాధివీరుఁడవు నీవుతప్ప మఱియొకఁడు బొబ్బిలిలోలేడు." పాపారాయఁడు రంగారావు చెప్పినదాని కంగీకరించి సేననుతీసికొని రాజాముకోటకుఁ బోయెను.

పాపారాయఁడు రాజాముకోటలోఁ దనకొఱకెదురుచూచుచున్నసంగతి విజయరామరాజు తెలిసికొనెను. కావున నతఁడు రాజాముకోట మార్గమునువిడిచి యడవిమార్గముపట్టెను. అతఁ డాయడవిదారినే పోయి ఫరాసుసేనలతోడను, తనసేనలతోడను బొబ్బిలికోట ముత్తిగవేసెను.

హఠాత్తుగ నెత్తివచ్చిన వీరితో సంధిచేసికొనిన మంచిదని రంగారావాలోచించెను. కావున నాతఁడు పరాసుగవర్నరు బుస్సీదొరతో రాయబారములు నడిపెను. కాని యవి కార్యకారికాలేదు. అప్పుడు రంగారావు "ఇఁక బొబ్బిలియాశ, ప్రాణములయాశ లేదు. ముందటిజాగ్రత విచారించుకొనుట మంచిది. ఇప్పుడు ప్రాణములకాశపడిన కలకాల మపకీర్తిపాలగుదుము. కావున నన్యచింతలుమాని యుద్ధసన్నద్ధులమై శత్రుబలముమీఁదనడిచి శౌర్యము ప్రకాశమానము చేయవలెను." అని ఆలోచించెను. తోడనే యాతఁడు "మీ మీ ఆయుధములతో యుద్ధమునకు సన్నద్ధులైరండు." అని తన సరదారులకాజ్ఞాపించెను.

ముట్టడి ప్రారంభమాయెను. బొబ్బిలి వెలమవీరు లతిచేతికిఁ బండ్లువచ్చినట్లు యుద్ధముచేసిరి. కాని విజయరామరాజుసేన, పరాసుసేన కలసి వారిసేనకు రెట్టింపుపైగా నుండుటచే బొబ్బిలివారు తుద కోడిపోవఁ జొచ్చిరి. శత్రువులచేతులలోఁబడి మానము పోగొట్టుకొనకుండ రంగారావుభార్య మల్లమ్మదేవి యప్పుడు కత్తితోఁ బొడుచుకొని చనిపోయెను. ఇదిచూచి మిగిలిన వెలమ స్త్రీలును కత్తులతోఁబొడుచుకొనియో, చిచ్చున దుమికియో యుసురులుపాసిరి. రాణివాసపుస్త్రీ లందఱును లయముపొందిన పిమ్మట వెలమవీరులు రంగారావు నడపగా శత్రుబలముమీఁద నడిచి చేతులుపొక్కినదాఁక యుద్ధముచేసిరి. పోరిపోరి తుదకు రంగారావును, వెలయవీరులును వీరశయనములంకరించిరి. అప్పుడు బుస్సీదొర, విజయరామరాజు బొబ్బిలికోట స్వాధీనముచేసికొనిరి; కోటలో డేరాలువేయించుకొని యందు విడిసిరి.

రంగారావునమ్మినబంటు తాండ్ర పాపారాయఁడు అప్పటికింకను రాజాముకోటలోనేయుండెను. బొబ్బిలిరాజు రంగారావు బంధుమిత్రులతో యుద్ధభూమిని కూలినసంగతి, బొబ్బిలిరాణి మల్లమ్మ రాణివాస స్త్రీలతో లయముపొందినసంగతి చెవినిపడినతోడనే పాపారాయనికిఁ బైప్రాణములు పైనేపోయెను. అతఁడు నిలువున నీరైపోయెను. కాని కొంచముసేపటికి సముదాయించుకొనెను. వెంటనే యాతఁడు ధైర్య మవలంబించెను.

అప్పుడు పాపారాయని మనము రోషపరీతమాయెను. "ప్రభువు రంగారావుగారికి తాండ్ర పాపారాయఁడను సేవకుఁడుండియు లేనట్లైయైనది కదా!" అని యాతఁడు చింతించెను. అప్పు డాతనికేదో మెఱుపుదెబ్బ తగిలి నట్లాయెను. తోడనే యాతఁడిట్లాలోచించెను: "తాండ్ర పాపారాయఁ డుండియు లేనట్లుకాఁగూడదు. విజయరామరాజు నన్నేలినస్వామిని చంపి యాతనికోటలోనే తాణ్యము వేసికొనియున్నాఁడు. నాస్వామి గర్భశత్రువైన విజయరామరాజిట్లుండగా నూరకుండిన నేనుండియు లేనట్లే యగును. కావున నారాజునుచంపిన విజయరామరాజును చంపి నేను మిగిలియున్నఫలము చూపెదను. కాని రామరాజును చంపుట యనిన మాటలతోనగునదికాదు. చుట్టునుబలిసి సేనలు కొలువగా రామరాజు సురక్షితుడైయున్నాఁడు. అధికబలుఁడగునట్టివాని నెదిర్చిపోరి చంపుటదుస్తరము. కావున యుక్తిబలముచేత, రాముఁడు వాలినిచంపినట్లు, చంపెదను."

తాండ్ర పాపారాయఁ డిట్లు నిశ్చయించుకొనెను. విజయరామరాజు బొబ్బిలిమీఁద దండెత్తివచ్చినపిమ్మట విజయనగరమున రాజకార్యములను అతని అన్నకొడుకు ఆనందరాజు నిర్వహించుచుండెను. పాపారాయఁడిది తెలిసికొనెను. దేవులపల్లి పెద్దరాజు, బుద్ధరాజు వెంకయ్య యను నిద్దఱుమిత్రులను వెంటఁబెట్టుకొని యాతఁడు రాజాముకోటనుండి బయలుదేఱెను. తెల్లకాగితములను ఉత్తరములుగా మడచి, వానిపైన విజయరామరాజు బిరుదావళిఁ వ్రాసి, లకోటాముద్రలువేసి రాత్రి జామున్నర ప్రొద్దువేళ పాపారాయఁడు మిత్రులతో మారువేషమున బొబ్బిలిచేరెను.

పాపారాయఁడు మిత్రులతోఁ బాంచాకీల దగ్గఱకుఁ బోయెను. అక్కడకావలియున్నవారు వారిని లోనికిఁ బోనీయరైరి. అందుమీఁద పాపారాయఁడు "మేము విజయనగరమునుండి ఆనందరాజుగారు పంపగా వచ్చుచున్నాము. రాజముద్రలుగల ఈ యుత్తరములు వెంటనే విజయరామరాజుగారి కందజేయవలెను. ఏమాత్ర మాలస్యమైనను ప్రాణములమీఁదికి

వచ్చును.'' అని చెప్పెను. ఆమాటలునమ్మి పారా కటాయించుచున్న జవాను లతనిని, అతనితోడవచ్చిన వారిని లోనికిఁబోనిచ్చిరి. వారట్లుపోయి విజయరామ రాజు విడిదిడేరాను సమీపించిరి.

యుద్ధముతీరి యప్పటికి మూఁడుదినములైనది. ఎట్లయిన బొబ్బిలికోట సాధించితీరెదనని కుడిమీసము దువ్వి ప్రతిజ్ఞచేసి యది నెఱవేర్చుకొన్న సంతోషమున విజయరామరా జాడేరాలో గుండెలపైఁ జేయిపెట్టుకొని హాయిగా నిద్రించుచుండెను. అక్కడ నొక జవాను పారాయిచ్చుచుండెను. వాఁడు పాపారాయని, ఆతని మిత్రులను ముందుకుఁ బోనీయక అటకాయించెను.

అప్పుడు పాపారాయఁడు ''మేము ఆనందరాజుగారివద్దనుండి హుజూరున కుత్తరములు తీసికొని వచ్చినాము. తక్షణమే ఈయుత్తరములు విజయరామరాజుగారి కీయవలెను. ఏమాత్ర మాలస్యమైనను తల కొట్టించివేయుదుమని ఆనందరాజుగారు మాకాజ్ఞాపించియున్నారు. కాఁబట్టి మీరీసంగతి త్వరగా విజయరామరాజుగారికిఁ దెలిపి మమ్ము వారిదర్శనమునకుఁ దీసికొనిపోవలెను. కించిత్తు జాగుచేసినను మీరు దివాణమువారికి నేరస్థులు కావలసివచ్చును.'' అని నిర్భయముగఁ జెప్పెను.

దానికిఁ బారాసిఫాయి యిట్లు బదులుపలికెను: ''మహారాజావారు మంచినిద్రలోనున్నారు. యుద్ధప్రశంసవల్లను వారికి మూడుదినములనుండి తిన్నగా నిద్రలేదు. ఈ గాఢనిద్రలో ఇప్పుడులేపిన రాజావారి కాగ్రహమువచ్చి నన్ను శిక్షింతురు. వారికిఁ గొంచము మెలకువవచ్చినతోడనే సమయముకనిపెట్టి మిమ్ము వారి వద్దకుఁ దీసికొనిపోవుదును. అంతవఱకు మీరు వేచియుండవలెను.''

ఇట్లు పారాసిఫాయి చెప్పగా విని పాపారాయఁడు లేనికోపము తెచ్చుకొని ''ఈ యుత్తరము లిప్పుడే హుజూరునకు నివేదించవలెను. లేనియెడల నక్కడ ఆనందరాజుగారు మా తలకొట్టివేయుదురు. ఏమాత్రము జాగుచేయుటకును వీలులేదు. కావున మమ్మిప్పుడే రాజావారివద్దకుఁ దీసికొనిపొమ్ము.'' అని గద్దించి పలికెను.

ఆమాటలకుఁ బారాజమాదారుఁడు గడగడలాడెను. ''అయ్యా! ఇప్పుడుగనుక నేను రాజావారికి నిద్రాభంగముచేసితినా నాకు చావుతప్పదు. కావున నా యందు దయయుంచి నాలుగుగడియ లోపిక పట్టుఁడు. అంతపర్యంతము మీ రీడేరాదగ్గఱ విశ్రమించి బడలిక తీర్చుకొనుఁడు. రాజుగారు లేచినతోడనే మీకు వారిదర్శనముచేయించెదను.'' అని పారాజవాను సముదాయించి పలికెను. పాపారాయఁడును, ఆతని మిత్రులును ఇందు కంగీకరించి యాడేరాయందునఁ బండుకొనిరి.

ఆరాత్రి రెండుజాములవఱకు పుచ్చపువ్వు వెన్నెల కాసి పిమ్మట రాజభక్తుఁడగు పాపారాయని చేతలకుఁ దోడుపడుటకో యనునట్లు చంద్రుఁ డస్తమించెను. అప్పుడు కన్నుపొడుచుకొనినను కనుపించని కటికిచీఁకటి లోకమును క్రమ్మెను.

ప్రభువు ఋణము తీర్చుకొనుటకు సమయ మనుకూలమైనదని పాపారాయఁడు లోలోన సంతోషించెను. మెల్లగ లేచికూర్చుండెను; తాను రహస్యముగఁదెచ్చిన బొగ్గునలుపు కంబళి ముసుఁగు వేసికొనెను. చీమచిటుకుమనకుండ నతఁడు డేరాకనాతుకట్టు తన కరాచూరి చేతఁజించి మార్గముచేసెను. ఆమార్గమున నేలమాటుగ దొర్లిపోయి పాపారాయఁడు విజయరామరాజు పడకున్న తల్పమును సమీపించెను.

ప్రతిజ్ఞ నెఱవేర్చుకొన్న గర్వమున, బొబ్బిలి పట్టాభిషేకలాభమొనగూడునన్న సంతోషమున రామరాజ ఒళ్ళు తెలియక నిద్రపోవుచుండెను. పాపారాయఁ డతనిని కొట్టిలేపెను. తత్తరిల్లి రాజులేచి ''ఎవరునీవు?'' అని రాజసమునఁ బ్రశ్నించెను. ''రంగారావు నమ్మిన బంటును; బొబ్బిలివారి పులిని; తాండ్ర పాపారాయని నన్నెఱుఁగవా?'' అని పాపారాయఁడు తన రొమ్ము తట్టుకొనుచుఁ బలికెను. దానితో రామరాజున కత డెవరో, యెందునిమిత్తము వచ్చెనో తెలిసిపోయెను. తోడనే యతఁడు పక్కలోఁ గత్తులకొఱకు వెదకెను. కాని రాజులేవకముందే పాపారాయఁడు వానినితీ

దాచివేసెను. కావునఁ గత్తులు కనపడలేదు. అప్పుడు రాజు నాలుగుమూలలఁ జూచెను. అతనికేమియుఁ గనుపించలేదు. ఈటెయూడిపోయిన 'ఉత్తకఱ్ఱ' మాత్రమొకటి దొరికినది. తన్నుకొట్ట నుంకించుచున్న పాపారాయని వంగఁదీసి విజయరామరాజాయీటెకఱ్ఱతో నాతని మెడమీఁదఁ బొడిచెను. ఆపోటు కాకఱ్ఱ పాపారాయని కంఠము దిగివచ్చెను.

మఱియొకఁడైన రాజాపొడిచిన ఆపోటుకు వెంటనే చచ్చియుండును. కాని రాజభక్తిచేత నావేశింపఁబడిన పాపారాయఁ డాదెబ్బను లెక్కచేయక తాను వంగి యుండినప్పుడే వాఁడివాలున విజయరామరాజు కడుపు చీరెను. తన యేలికయగు రంగారావునకు గర్భశత్రువైన విజయరామరాజు గర్భముచీరి ప్రభువుఋణము దీర్చికొంటినని పాపారాయఁడు సంతోషమున మిన్నందెను. రామరాజును, పాపారాయఁడును నేలకొరగి ప్రాణములు విడిచిరి.

ఈ సవ్వడి పారావారువిని రాణువవారికిఁ జెప్పిరి. వారువచ్చిచూచి నిర్ఘాంతపోయి ఈ ఘోరముచేసిన ఇతఁడెవరాయని విచారించుచుండిరి. పాపారాయనితో వచ్చిన వారిరువురు నప్పుడు "బొబ్బిలివారిపులి ప్రభువు ఋణము తీర్చికొన్నది." అని రభసముచేసిరి. అంతమీఁద రాణువవారు పాపారాయని మిత్రులనుచుట్టుముట్టిరి. చేతికిఁజిక్కినంతమందిని చెండి వారిరువురును తుదకు మరణించిరి.

మఱియొకప్రక్క డేరాలో విడిదిదిగియున్న బుస్సీ దొర కీవృత్తాంతము మఱి కొంతసేపటికిఁ దెలిసెను. "ఈ బొబ్బిలిపాటిమీఁద పాపారాయనివంటి రాజభక్తులెందరున్నారో? ఇఁక నిక్కడయుండుట మాకు క్షేమముకాదు." అనిభయపడి పరాసుగవర్నరు తక్షణమే యక్కడనుండి సేనలనుకదలించుకొని పోయెను. రాజునుకోల్పోయి రామరాజుసేనలు విజయనగరమునకుఁ బోయెను. ఏరాజ్యమున నేలినవారికొఱకు ప్రాణములను సమర్పించు పాపారాయనివంటి బంట్లుందురో యారాజ్యముమీఁదికి శత్రువు లెత్తివెళ్ళలేరు; ఎత్తి వెళ్ళినను దానిని గెలువలేరు; గెలిచినను ఆరాజ్యమునఁ జిరకాలము నిలువలేరు.

పాపారాయని రాజభక్తి సాటిలేనిదే కాని యతఁడు చేసినపని హింసాకళంకితమని కొందఱందురు. బాగుగాఁ బరిశీలించితిమేని యట్లనుటకు వీలులేదు. రంగారావునకు విజయరామరాజు గర్భశత్రువు. పాపారాయఁడు రంగారావునకు గుండెలిచ్చినబంటు. స్త్రీలతోడను, సేనతోడను రంగారావు చనిపోవుటకుఁ గారణభూతుఁడైన విజయరామరాజు బొబ్బిలికోటలో రాజ్యమువేసికొని సుఖానఉండుట రాజభక్తుఁడగు పాపారాయనికిఁ దెవులులేని వేదనపుట్టించెను. తనప్రభువు బ్రతికియుండగా నతని మాటప్రకారము విజయరామరాజును రాజాముకోటదగ్గఱ అటకాయించుటకు పాపారాయనికి వీలులేకపోయినది. "ప్రభువువారు బ్రతికియుండగా వారి కోరిక నెఱవేర్పలేకపోయితిని; ఇప్పుడు వారి శత్రువగు విజయరామరాజునుచంపి వారియాత్మకు శాంతిచేకూర్తును." అని ఆరాజభక్తుఁడు తలఁచి యింతపనిచేసెను. తనయేలిక విరోధి ప్రాణములుకొనుట ఆ రాజభక్తుని పరమార్థము. కావున నతఁ డిది నెఱవేర్చెను.

"పోయినరంగారావు పోనేపోయెను. ఇఁక నతని ప్రసక్తి మనకేల?" అని పాపారాయఁ డనుకొనలేదు. డబ్బుకొఱకుఁగాక నిష్కామబుద్ధితో రాజసేవకుఁ గుదిరిన అతఁడట్లేల యనుకొనును? తాను బ్రతికియుండగాఁ దనప్రభువు గర్భశత్రువు బొబ్బిలికోటలో సుఖాన నిలువకూడదని యారాజభక్తుని నిశ్చయము. రాజశత్రువును చంపుటకు, రాజసేవలోఁ జచ్చుటకు నాతఁడు రాజాముకోటనుండి బయలుదేఱిపోయెను. అట్లే యారాజభక్తుఁడు రాజశత్రువును చంపెను; రాజసేవలోఁ జచ్చెను.

"కాయమొసంగియైన రిపు
ఖండనముం బొనరించి కంటికెం
జాయల చాలుతో, హృదయ
సంభృతశౌర్యమరీచితోడ స్వీ
యాయత రాజభక్తియె జ
యమ్మిడ పాపయ చూపు పౌరుషా
ప్యాయనకృత్య మాంధ్ర జను
లౌ దలలూచుచు మెచ్చకుందురా?"

—ఓలేటి సీతారామమూర్తి.

# సుప్తసౌందర్యము

హాయిగ నిద్దురింపు మబలా! యటులే యొకకొంతసే పెవో
తీయనివౌ కలల్ గనుము! దీనులు మర్త్యులు చేరరాని స్వ
ర్గీయపథమ్ములందు విహరింపుము! నందనవృక్షశీతల
చ్ఛాయలఁ బారిజాతసుమసౌరభ మానుచు విశ్రమింపుమా!

జవ్వని! నీదు నేత్రములు సాంద్రముగా ముకుళించుఁగాని, క్రొం
బువ్వులు పూచినట్టు లెఱుపుల్ గల నీచివురాకు వాతెఱల్
నవ్వులు మందమందముగ నవ్వుచు, వచ్చుచుఁ బోవునట్టి యా
మవ్వపుటూర్పుగాలులకు మంజుగతిం జలియించు నియ్యెడన్.

అలసముగాఁ గనుల్ మొగుడ నంటిన ఱెప్పల యంతరమ్ములన్
వెలువడకుండ నిష్టు శయనించుచునున్నవి స్వప్నకేళికా
పులకితమూర్తి! నీ మధురముగ్ధవినీలవిలోకనైక శ్రీ
తలరుచిరత్రపావిలసితప్రణయామృతవీచికావళుల్.

చెదరిన ముంగురుల్ తళుకుఁజెక్కులరాగము లందగించు నీ
వదనము వాల్చుకొంటి వొకవంకకు స్నిగ్ధగళమ్ముఁజూపి; ప
య్యెదఁ దొలఁగించుకొంటి వొకయించుక పేరురమ్ముఁజూపి; చ
క్కఁదనములెల్ల నగ్నములుగాఁ గమనీయముగా స్ఫురింపఁగన్.

కాటుక దిద్దలేదు, తిలకమ్ము రచింపఁగలేదు, పెన్నెఱుల్
పాటనసేయలేదు, సదలంకృతులన్ ధరియింపలే; దెదన్
నాటిన విప్రయోగకఠినవ్యథ నేగతి నింతకాలమున్
గాటపువెల్గుఁజీఁకటులు క్రమ్మినరాత్రుల వెళ్ళఁబుచ్చితో!

విరహకృశాంగి! నీకలలవృత్తము లేవొ కదా! భవన్మనో
హరునకు బాహుబంధనసుఖానుభవమ్ములు కానుకవెట్టెదో,
సరసవచఃప్రసంగములు సల్పుచుఁ గోమలపల్లవారుణా
ధరపరిదత్తచుంబనసుధారసధారలు చూఱలిచ్చెదో!

మూసిన నేత్రముల్ తెఱవఁబోకుము, విశ్రమమొందు నంగముల్
తీసి కదల్పఁబోకు, మతిదీర్ఘముగా విడువంగఁబోకు మీ
శ్వాసము; లీనిశీథమున స్వర్గసుఖప్రదముల్ మనోహరో
ల్లాసకరంబులైన కలలం గను మింపుగ సుప్తసుందరీ!

—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి. ఏ.

# జార్జి లాన్సుబరీ జీవితారంభపు దినములు

"క్రీస్తుశకము 1880-వ ప్రాంతమున లండనుమహానగరమునందు ఆస్ట్రేలియాదేశమునకు వలసపోవుట అతిగా చర్చింపబడుచుండెను. కాలనీలు స్వర్గముల ట్లు ప్రజలు భావించసాగిరి. నే నాదినములలో వైట్ ఛేపల్ నందలి ఒక కాఫీభవనమున మేనేజరుగా నుంటిని. జీతము నాకుటుంబవ్యయములకు సరిపోవునంతటిదే. కాని ఏలనో అప్పటికి నాజీవితవిధానము నాకు అసంతృప్తికూర్చునదిగా ఉండునది. నాభార్యకుకూడ ఆనాటి జీవన స్థితితో సంతృప్తి లేకుండెను. ఆస్ట్రేలియాఖండముయొక్క వైభవమునుగూర్చి మేము చాలగ చదివితిమి. అచ్చటకు వలసపోవలయునని మాకు అభిలాష పొడమెను. అప్పటికి నాకు పాతికేండ్లు. ఆ వయస్సున నాకు ఆస్ట్రేలియాలో కలిగిన విచిత్రానుభవములు నేను ఇప్పటికికూడ మఱచి పోలేదు. అవి నాకెంతయో లోకానుభవమునిచ్చినవి.

అది 1884-వ సంవత్సరము. మాకుఉన్న సామానులో ముఖ్యముగా కావలసినదానిని పాక్ చేసుకొని, మిగిలిన దానిని అమ్మివైచి ఓడఎక్కితిమి. ఆ ఓడపేరు యస్.యస్.డ్యూక్ ఆఫ్ డివన్ షైర్ అని. ఆస్ట్రేలియా ఖండమునందలి క్వీన్సులాండులోని బ్రిజ్బానీ మాగమ్యస్థానము. ఇంకను ఆ ఓడమీద అయిదువందల మంది వలసప్రయాణికులుండిరి. క్రొత్త ప్రదేశమునకు పోవుట, అది ఒక సాహసకార్యమే. అప్పటి నాభార్యవయస్సు ఇరువదిమూడేండ్లు. నాలుగేండ్లలోపువారు మా బిడ్డలు ముగ్గురు; నాచిన్నసోదరుడు—పదునొకండు ఏండ్లవాడు. మాకడ నూటఇరువదిపౌనులుండెను. మా సామానునకంతటికిని విలువయైనది ఒక హార్మోనియము. నేటి ప్రయాణపు నౌకలపైనుండెడి సౌకర్యములు నాడు లేకుండెను. పండుకొనుటకుగాని ఉండుటకుగాని మంచి స్థలములేదు. కోడిగ్రుడ్ల పాకేజీపెట్టెలపై మా ఉనికి. మా భోజ్యపదార్థములలో ముఖ్యమైనవి బిస్కత్తులు, అంబలి, తేనీరు. అగుగాక! మాకు కష్టమనిపించలేదు. క్రొత్తప్రదేశమున క్రొత్తజీవితము ప్రారంభింపవలయునను అభిలాషలో మే మీకష్టముల లెక్కింపలేదు.

ఆ ప్రయాణమున నాకు ఎక్కువగ అలజడినికలిగించినది నాభార్య ఓకిరింతలు. ప్రయాణమున ప్రతిదినమును ఆమెకు కడుపుద్రిప్పు కలుగుచుండెను. ఆ దినములలో పసివాండ్లకు నేనే తల్లిని, తండ్రిని కావలసివచ్చుచుండెను. ఒడలుతోమి వారికి నేనే నీళ్లుపోయువాడను. ఓడడెక్కు కడుగుటకు ఓడపనివారు నీళ్లునిలువయుంచు తొట్లలోనినీరు వారికి పోయువాడను. మేము బిడ్డలకుపోసిననీటిని తరువాత ఓడపనివారు డెక్కు కడుగుటకు ఉపయోగించువారు. ఓడలోని ఉద్యోగస్థులు నన్ను చాలదయతో చూచువారు. బాయలరు మేకరును, సెకండు ఇంజనీరును నేననిన ప్రాణములిచ్చువారు. నాభార్య ఓకిరింతలుచూచి ఓడలోని సాధారణమైన ఆహారము ఆమెకు సరిపడకుండుటచూచి వారు ఉద్యోగధర్మమునపొందెడు మంచిఆహారపదార్థములలో నాభార్యకు పాలు పంచి ఇచ్చెడివారు. పలువత్సరములకు పిమ్మట 1908-వ సంవత్సరమున నేను పార్లమెంటు ఎన్నికలలో వ్రూల్ వుచ్ స్థానమునకు అభ్యర్థిగా నిలచినపుడు ఈ బాయలరుమేకరును, సెకండు ఇంజనీరును—అప్పుడు ఆయుధాగారమున పనిచేయుచుండిరి—లేఖ వ్రాయుచు ఆ 1884 వ నాటియాత్రను నాకు జ్ఞాపకముచేసిరి. ఓడప్రయాణము ఇతరవిషయములలో కులాసగ నేజరిగెను. క్రొత్తప్రదేశమున గొప్పగా జీవింపగలుగుదుమను గంపెడాశతోనుంటిమి గావున ఆ ఓడప్రయాణము మాకు ఒకసుఖస్వప్నమువలె గడచెను.

ఎనిమిదివారముల ప్రయాణానంతరము ఓడ ఆస్ట్రేలియాఖండమునకు వచ్చెను. బ్రిజ్బానీనదీముఖద్వారముగుండ ఓడప్రయాణము చేయుచున్నప్పటి మాకుకలిగిన ఆనందము అధికతరమయ్యెను.

కాని బ్రిజ్బానీలో కాలుపెట్టుటతోడనే మాకు కష్టములు ప్రారంభమయ్యెను. వలసవచ్చువారి మందిరమునకు మేము గొంపోవబడితిమి. ఆ మందిరమున వాససౌకర్యములులేవు. నిద్రపోవుటకుపయోగించు మంచములు వగైరా ఏమియులేవు. ఎల్లరును నేలమీదనే పండుకొన

వలసియుండెను. నాభార్యను, పిల్లలను తీసికొని వసతిగలబస నేర్పాటుచేసికొనుటకు ఊరంతయు గాలించితిని. తగినబాడుగ ఈయజాలుస్థితిలోనున్నను మమ్ములను హోటలులందు జేర్చుకొనరైరి, బోర్డింగుహౌసులందు తావులేకుండెను. చేయునదిలేక తిరిగివచ్చితిమి. ఆనాటిరాత్రి అంతయు నాకు కంటిమీద కునుకులేకుండెను. ఎలుకలుచేసిన గల్లంతుకు లెక్కలేదు. రాత్రి అంతయు వానిని బెదరించుటతోడనే నాకు సరిపోయినది. నా జీవితకాలమున నేను నివసించిన ఇండ్లకన్నిటిలోనికిని అదియే కనాకష్టపుది. తరువాత నేనెట్లో కష్టపడి వారమునకు పదిషిల్లింగులు అద్దెగల భాగము సంపాదించితిని. ఆయింటిలో అడుగుపెట్టుటకు వీలులేని బొద్దింకలు—దోమలు మనుష్యులను సాయముపట్టునవి. ప్యాకింగుపెట్టెలకు ఇనుపతీగెలుకట్టి ఎట్లో ఒకమంచమును తయారుచేసి దానిమీద చిన్నబిడ్డలను పండుకొనబెట్టువారము. మిగిలినవార మందరమును ఒట్టి నేలమీదనే పండుకొనువారము. ఎనిమిదివారములవఱకు నేను ఎట్టిపనిని సంపాదింపలేకపోయితిని. కూడతెచ్చినధనము క్రమముగా తరిగిపోవుచుండెను. స్వర్గముగా భావింపబడినచోట ఆహారసంపాదనమే అతికష్టమయ్యెను.

చివరకు ఒకపని దొరికినది. అదిఎట్టిది? రాళ్లు పగలగొట్టుట. జీతము చాలతక్కువ. నడుమునొప్పి యెత్తించు—గుండెను పగల్చు పని. నాచేతులు నెత్తురుచిమ్మినవి; నాఒడలు సలుపునది; ఈపని చాలకాలము చేయలేకపోయితిని. తిరిగి పనికొఱకు అన్వేషణ. ఒక కసాయి దుకాణమున పనిదొఱకెను. నాపని ఆ దుకాణమునుండి బ్రిజ్బానీకి మాంసముకొనిపోవుట. ఒకవారము పనిచేసితిని. ఆదివారముకూడ పనిచేయవలసియుండుట నాకు అప్పుడు తెలియవచ్చినది. ఆదినములలో నేను ఆదివారమెట్టిపనియు చేయరాదను సిద్ధాంతమును శిరసావహించుటలో అతిదీక్షగలవాడనై యుంటిని. కావున ఎటుపోయి ఎటువచ్చినను ఆదివారమునాడు పనిచేయకుండుటకే నిశ్చయించితిని. నాయజమాని రోమనుకాథలిక్ మతస్థుడు. మంచిమనస్సుగలవాడు. దయార్ద్రహృదయుడు. వారమునందలి ప్రతిఒక్క దినమువలెనే ఆదివారముకూడ మార్కెట్టునకు మాంసము కొనిపోవలసిన అవశ్యకతనుగూర్చి నాకు నచ్చచెప్పుటకు అతడు విశేష ప్రయత్నము గావించెను. కాని అతనిప్రయత్నము నెఱవేఱలేదు. ఆదివారము పనిచేయుటకు నేను ఏమాత్రము ఒప్పుకొనలేదు. అది కారణముగా నాకు పనిపోయినది. తిరిగి ఉద్యోగాన్వేషణము. కొన్నిసుళ్లోర్టులు చదును చేయు పని దొరికెను. ఎనిమిదిగంటలుపని, ఎనిమిది గంటలునిద్ర, ఇతరపనులకు మిగిలినఎనిమిదిగంటలు అనునది ఆస్ట్రేలియాలో ఆదినములలో కార్మికుల కార్యక్రముగా నుండెను. నేను ఒక్కొక్కప్పుడు ఈ ఎనిమిది గంటలనుకూడ మీరి పనిచేయువాడను. ఇందుకుగాను తోడిపనివారు నన్ను కంటగించుకొనువారు. కార్మికుల పనిచేయు గంటలను సాధ్యమైనంతవఱకు తగ్గించుటకు నేను విశేషమైన కృషిసలుపుచున్న నన్ను చూచి ఆనాటి నాచర్యకు నాత్రేడుయూనియను స్నేహితులందఱును ఇపుడు నవ్వవచ్చును. కాని నిజ మట్టిది. నా స్వభావము అట్టిది. నేనేపని చేకొనినను దానికొఱకు నా యావచ్ఛక్తిని వినియోగించినగాని నాకు తృప్తియుండదు. కాని సంఘముగాకలసి పనిచేయుచున్నప్పుడు రివాజుకంటె ఎక్కువకాలము పనిచేయుట మంచి పద్ధతికాదని నేను అచిరకాలముననే గ్రహించితిని.

బ్రిజ్బానీ పట్టణమునఉండి ఇట్టి నిలుకడలేని పనులలో తగులుకొని యుండుటకంటె వ్యవసాయపుబనిలో ప్రవేశింపతలంపు పొడమెను. వ్యవసాయదారులు తఱుచుగా వచ్చుచుపోవుచుండు మార్కెట్టు ప్రదేశమునకు ఒకనాడుపోయి నిలుచుంటిని. కర్షకుడొకడు నన్ను ఎగాదిగచూచెను. గుఱ్ఱమును కొనునపుడు దానిని పరిశీలించు మాదిరిగ నన్ను పరిశీలించెను. నా కండరములను పట్టిచూచెను. బ్రిజ్బానీపట్టణమునకు నూరుమైళ్ళదూరముననున్న హారిస్సువిల్లీ యనుతావున నాకు పని ఇచ్చెను. జీతము ఏడాదికి నలుబదిపౌనులు—ప్రతిదినమును రొట్టెలకై కొంతపిండి, కూరకు మాంసము, త్రాగుటకు తేనీరు ఇచ్చుటకు ఒడంబడిక. ఈ ఏర్పాటువలన నేను పల్లెటిపట్టునఉన్నను నాముగ్గురు చిన్నపిల్లలకును వెన్న, పాలు, గ్రుడ్లు నాడబ్బులోనుండియే కొనవలసివచ్చెను. పనిలోచేరిన కొద్దికాలమునకే నేను నారైతునకు ఋణపడుటకు ప్రారంభించితిని. మేము ఉండుటకుగాను

ఒక సటీరమిచ్చుటకు ఆతడు ఒప్పుకొనెను. కాని ఆ గుడిసె అతిజీర్ణస్థితిలోనుండెను. ముంజూరులన్నియు ఊడిపోయినవి. ఉన్నకప్పు అయినను సరియైనస్థితిలో లేదు. కాబట్టి గుడిసెలోనుండియే మేము రాత్రుల యందు నక్షత్రములను చక్కగా చూడగలిగియుండు వారము. జలాధార మొకకొండవాగు. అందలి జలము సాధారణముగా పసువులుత్రొక్కి పాడుచేయు ప్రదేశమునుండి ప్రవహించివచ్చునది. అగుటచే కాచకుండగ ఒకపుడిసెడుజలమేని ఉపయోగించుటకు వీలులేకుండెను. కానిలేపన్ అనునది ఏరీతిదికాని అచ్చటలేకుండెను. అంతకుపూర్వము నేనెప్పుడును వ్యయసాయపు పనులను చేసినవాడనుకాను. అయినను నేను వెళ్ళిన మొదటి ఉదయముననే నలుబదిఆవులకు పాలుపితుక వలసినవాడనైతిని. ఎటులైననేమి ఒక అరగంట తంటాలుపడి ఒకఆవుపొదుగునుండి కొన్ని పాలుపితుక గలిగితిని. ఈమాత్రముచేయుటకే నేను అచట రివాజుగ పనిచేయుచుండెడు ఒక ఆడమనిషి ఉపదేశముపొందితిని. కాని ఒకవారము జరుగుసరికి పాలుపితుకుటలో నాకు మంచినేర్పు అలవడ్డది. నాగలిపట్టితిని. లోతుగ దున్నితిని. పాపటము తోలితిని. గుఱ్ఱములకు పిల్లలుపుట్టునపుడు మంత్రసానితనము చేసితిని. అవసరమైన అశ్వవైద్యముకూడ కొంతనేర్చితిని. చిన్నచిన్న ఆపరేషనులు చేసి అనుభవము గడించితిని. ఆవసరమగుచో వానికి వాతలుపెట్టుటకూడ నేర్చుకొంటిని. వేయేల? విశేషానుభవముగల కర్షకునకుండు నేర్పు అంతయు నాకును అలవడ్డది. అందులో నాకు ఒకడు పట్టణముననేపెరిగి పెద్దయగుగాక పల్లెటిపట్టులకుపోయి అచటి పనులలో ప్రవేశించియు రాణింపగలుగుట అనుభవపూర్వకమైనది.

అచట మూడేండ్లుఉండుటకు ఆ కర్షకునకు కరారునామా వ్రాసియిచ్చితిని. కాని ప్రవేశించిన కొద్దిమాసములకే నేనాపనిని వదలివేసితిని. ఏమన ఉన్నకొలదియు నేను ఆతనికి అప్పుపడిపోవుచుంటిని. అచట నివసించుచున్న శాసనసభ్యునిమధ్యవర్తిత్వమువలన కర్షకుడు తనడబ్బు వదలుకొని నన్ను వదలిపెట్టుటకు అంగీకరించెను. కుటుంబముతో తిరిగి బ్రిజ్బానీవచ్చితిని. అప్పటి నా పరిస్థితులనుగూర్చి ఒకవిషయముచెప్పిన చాలును. పఱుపుకొనుటకు డబ్బులేకపోయినది. హార్మోనియము అమ్మివైచితిని. అనంతరము బ్రిజ్బానీలో పార్సెళ్ళు బట్వాడాచేయు ఘరములో ఉద్యోగము సంపాదించితిని. ఆఘరము యజమానికి నాయందు మంచిఅభిమానము కుదిరెను. నన్నాఘరములో భాగస్వామిగ చేకొను అభిమతము నాతడు సూచించెను. కాని నాదృష్టములు తిరుగు మొగము పట్టినవి. మాతృదేశమునకై తహతహపడమెను. ఆస్ట్రేలియా వచ్చినప్పటినుండియు నాబిడ్డల ఆరోగ్యము సరిగ లేదు. వారికి అచ్చటినీళ్ళు సరిపడలేదు. సర్వవిషయములందును నాకు చేదోడువాదోడుగనుండిన నాభార్య ఆరోగ్యముకూడ బొత్తిగ చెడిపోయెను. స్వర్గమనుకొనిన ఆదేశమున సుఖముకంటె కష్టమే యెక్కువగా మాకు ఎదురైనది. కాని నాజీవితములో ఆకాలమే నాకు విచిత్రమైన లోకానుభవమును ఇచ్చినదని చెప్పగలను. శారీరకకష్టములకు ఓర్చుకొనగలద్రఢిమ, సోదరమానవుల స్వభావాదుల నెఱుంగగల సదవకాశము కలిగించి ధైర్యమునిచ్చి ఆత్మవిశ్వాసమును అది పెంపొందించినది. ఆనాటి నాఆగుణములు నేడును నాయందు నిలిచియున్నవి. మానవత్వములోగల దివ్యత్వమును నే నాదినములలోనే చూచితిని. నన్ను కష్టములు చుట్టుముట్టుగాక ఆసమయముననే నేను ఇతరులదయకు పాత్రుడనైతిని. దయ అనుగుణముచేతనే సాధారణులగు పురుషులును, స్త్రీలును దివ్యులగుచున్నారు. ధనము, జాతిఅను కృత్రిమకుడ్యములను గూడ నతిక్రమించి దయ ప్రసరింపగలదు.

బ్రిజ్బానిలోని ఒకపోస్టుమాన్ భార్య—లాంకషైరునకు చెందినది—ఆదినములలో నాభార్యకు స్నేహితురాలుగానుండెను. మాకష్టములలో ఆమె మమ్ము ఎంతయో ఆదుకొనెను. వారియింట మాకుబసయిచ్చెను. పార్సెళ్ళబట్వాడాఆఫీసులో నాకు ఉద్యోగముదొరకుటకు చాలసాయముచేసెను. ఆమెను నేను ఎన్నడును మఱచిపోవజాలను."

—వి. జగన్నాథస్వామి, బి.ఏ.

# గ్రంథాలయోద్యమము

## చీనాదేశపు పెద్ద గ్రంథాలయము

జాతీయ పునర్నిర్మాణప్రయత్నఫలముగ చీనాదేశమున జననమునొందిన ముఖ్యములగు విద్యాసంస్థలలో పీపింగు పట్టణమునందలి జాతీయగ్రంథాలయము అగ్రగణ్యమైనది. ఆ గ్రంథాలయము తెఱవబడి నేటికి అనగా 1931 జూను 25-వ తేదినాటికి సరిగా రెండువత్సరములైనది. చీనారాజ్యాంగమునందలి గొప్ప ఉద్యోగస్థులెల్లరు పరివేష్టించియుండ చీనాదేశముననున్న అమెరికను రాజ్యప్రతినిధి నెల్సన్ టి. జాన్సన్ అనువానిచే ఇది తెఱువబడెను. మొన్నటి భూకంపమున కనంతరమున జపానురాజధానీనగరమగు టోకియోయందు క్రొత్తగ నిర్మింపబడిన ఇంపీరియలుయూనివర్సిటీలైబ్రరీని మినహాయించినచో దూరప్రాచ్యదేశములందుగల భాండాగారములకన్నిటికిని ఈ గ్రంథాలయము తలమానికమనదగినది.

కేంద్రమందిరముగాక ఈ గ్రంథాలయమునకు అనుబంధములుగా రెండు శాఖామందిరములుగలవు. అందు ఒకటి జాన్ హే అనువానిపేర బరగుచున్నది. జాన్ హే చీనాదేశీయుడు కాడు, అమెరికాకుచెందినవాడు. అయినను ఆతడు చీనాదేశమును జపానువారును, యూరపియనులును పంచుకొనకుండ ప్రతిఘటించినవాడగుట ఆతనిపేర ఆశాఖ కృతజ్ఞతాపూర్వకముగ పిలువబడుచున్నది. రెండవది చీనావిద్వాంసుడగు డాక్టరు లియాంగుచీచో అనువానిపేర బరగుచున్నది. ఈతడు పూర్వచీనాదేశపు ఆర్థికశాఖామాత్యుడుగ, ప్రాక్తనజాతీయ గ్రంథాలయపాలకుడుగ ఉండి మాతృదేశమును గొల్పిన మాననీయుడు.

గ్రంథాలయమునకు కావలసిన వేడివెలుతురుల నుత్పత్తిచేయుటకు గ్రంథాలయమువారు స్వయముగ ఎలక్ట్రిక్ ప్లాంటును కలిగియున్నారు. పాశ్చాత్యదేశపు గ్రంథాలయముల విషయమున ఈసంగతి అశ్రుతపూర్వమైనదని ఒప్పుకొనక తీరదు.

ఈ గ్రంథాలయమున చీనాభాషకు చెందినవి 250,000 సంపుటములు గలవు. చీనా చక్రవర్తి చీన్‌ల్యాంగు ఇంపీరియల్ పుస్తక భాండాగారములోని అమూల్యగ్రంథసముచ్చయముకూడ ఈ సంపుటముల సంఖ్యలో చేరియున్నది. అముద్రితములు-అనగా వ్రాతవి—పుస్తకములు ఈ గ్రంథాలయమున ముప్పదిఆరువేలు గలవు. మిగిలిన పుస్తకములన్నియు ముద్రితములైనవే. ఈ ముద్రితములైనవానిలో కొన్ని క్రీస్తుశకము పదియవ శతాబ్దమునకు చెందినవికూడ కలవనుటవాని అమూల్యతను సులభముగ ఊహింపవచ్చును. డాక్టరు లియాంగుచోచో ఈ నడుమ చనిపోవుచు ఆరువేల చైనాపుస్తకములుగల తన సొంతగ్రంథసముచ్చయమును ఈసంస్థకు ఒసంగినాడు. గ్రంథాలయమువారు ఈ పుస్తకములను ఒక ప్రత్యేకమైనగదియందు భద్రపఱచి పరిరక్షించుచున్నారు. ప్రపంచమునందలి ఏగ్రంథాలయమునందును లేనన్నివిశేష సంఖ్య చీనాగ్రంథము లీబ్రైబరి యందున్నవి.

చీనాగ్రంథములుగాక ఈ గ్రంథాలయమున ఏబదివేల పరభాషాగ్రంథములుగలవు.

ఈ పుస్తకములన్నియు ఐదుఏండ్ల ఈనడుమను కొనబడినవే. నవలలు మొదలు శాస్త్రగ్రంథములవరకుగల అన్ని శాఖలకుచెందినవి ఇందు గలవు. అయితే ఇందు పెక్కుగ్రంథములు చీనాదేశపుసమస్యలకు సంబంధించినవి. నింగ్పోయందు కష్టముల కమీషనరుగనున్న పాలుజార్జి మోలెన్‌డార్ఫు అనువాడు చీనాభాషయందు ప్రత్యేకపాండిత్యము గలవాడు. చీనాదేశపు భాషాతత్త్వమునకు, ఛందమునకుచెందిన ఐదువేల పుస్తకములను ఆతడీలైబ్రెరీకి ఇచ్చియున్నాడు. రెండునందల శాస్త్రవిషయక మాసపత్రికల పూర్తిసంపుటములు ఈ గ్రంథాలయముల నలంకరించుచున్నవి. ప్రపంచప్రఖ్యాతపరిశోధకుడగు సర్ ఎయిర్‌స్టీన్ అనువాడు 'కాన్సురాష్ట్ర పు గుహాలనుండి తవ్విఎత్తిన ఎనిమిదివేల బౌద్ధసూత్రములనుగలిగి ఈ లైబ్రెరి అమూల్యమైన దగుచున్నది.

చీనాదేశపు ఈపెద్దగ్రంథాలయము అమెరికాదేశపు లైబ్రెరీలపద్ధతిని నిర్వహింపబడుచున్నది. చీనాదేశస్థులుకూడ దీనిని ఉపయోగించుకొనవచ్చును. భాండాగారమున పరిశోధకులకును, రిసెర్చివిద్యార్థులకును గదులు కేటాయింపుగా ఉన్నవి. ఆ గదులలోనికి వారు తమ టైపురైటరులనుగాని స్టినోగ్రాఫరులనుగాని నిరభ్యంతరముగా తోడుకొని రావచ్చును. గ్రంథాలయమందిరములో నొకభాగమున ఉపాహారమందిరముగలదు. దానిలోనికి ఎల్లరును పోవచ్చును. ప్రస్తుతము గ్రంథాలయమున రెండులక్షల ఏబదివేల పుస్తకములు కలవని చెప్పియుంటిమి కదా. ఇంకను అందు లక్షఏబదివేల పుస్తకములుంచుటకు తావుగలదు. అనగా మొత్తమున ఆ గ్రంథాలయమున నాలుగులక్షల సంపుటములుంచుటకు తావుగలదన్నమాట. బీరువాఅరలనుండి పుస్తకములు కొనివచ్చుటమొదలగు కార్యములను అన్నిటిని అచ్చట యంత్రములే నిర్వహించుచుండును.

ఉక్కు, కాంక్రీటుతో కట్టబడి ఆగ్రంథాలయమందిరము చీనాపద్ధతిని ఒప్పుచున్నది. ఒక్కొక్కటి ముప్పదియైదు టన్నుల తూకముగల రెండుస్తంభములు పూర్వరాజుల వేసవిభవనమునుండి గ్రంథాలయమునకు తేబడినవి. ఒక్కొక్కస్తంభమును కదుపుటకు ముప్పదియైదు గుఱ్ఱములు ఉపయోగింపబడినవి. సింహద్వారమున చెరియొకప్రక్క రెండు రాతిసింహములు గలవు. అవి ఒక్కొక్కటి ఇరువదిటన్నుల తూకముగలవి. ఆ సింహములుగూడ పూర్వరాజుల వేసవి భవనములనుండి తెచ్చినవే. ఈ గ్రంథాలయ భవనము కట్టునవసరమున ఎందఱో సిద్ధహస్తులగు చీనాదేశపు శిల్పులు పనిచేసియుండిరి.

ప్రభుత్వమువారి కేంద్రకార్యనిర్వాహక సంఘసభ్యుడు డాక్టరు ట్సియా యుయాన్‌పీ దీనికి నామమాత్రాధ్యక్షుడు. పని అంతయు ఆక్టింగుడైరెక్టరగు టి. యల్. యుయాన్ నిర్వహించును. ఈతడు న్యూయార్కునందలి కొలంబియా మహా విశ్వవిద్యాలయమున పట్టభద్రుడైనవాడు. కొలంబియాకు పోవక పూర్వము ఈతడు ట్సింగు హుయాయందు గ్రంథాలయపాలకుడుగా నుండెను. పట్టభద్రుడైన పదపడి లైబ్రేరియనుల తరిఫియతు నిచ్చుటలో అమెరికాయందు అతిఖ్యాతి గాంచిన న్యూయార్కుస్టేటులైబ్రెరీస్కూలునందు ఈతడు ప్రత్యేకశిక్షణమును పొందియుండెను.

గ్రంథాలయనిర్వహణమును ఎట్టి రాజ

కీయములును పోసగకుండ మంచిజాగ్రత్త తీసికొనబడినది. మ్యాపులు, ఛార్టులు ప్రదర్శించుటకు ప్రత్యేకశాఖలు గలవు. అమూల్యగ్రంథములు మొదలగునవి ప్రదర్శించుటకు మందిరములు ప్రత్యేకింపబడియున్నవి. ఈ గ్రంథాలయమున ఉపయోగింపబడిన ఉక్కు అరలన్నియు చీనాదేశమునందలి టీన్‌ట్సీనందే చేయబడినవి. ఇంతకు పూర్వము ఇట్టి వస్తువులన్నియు విదేశములనుండియే దిగుమతి చేయవలసియుండెను. కాని ఇపుడు చీనాదేశమునందే చేయుటకు అవకాశములు కల్గినవి. అచట ఉక్కుఅరలు చేయుటకైన ఆర్డరులకన్నిటికిని ఈ గ్రంథాలయమువారిచ్చిన ఆర్డరే మిక్కిలిగొప్పది అని చెప్పవలసియున్నది.

గ్రంథాలయనిర్మాణము తొలుత 1928 లో ప్రారంభింపబడినది. రెండు శీతకాలములయందు నాలుగేసిమాసముల చొప్పున పని మానివేయబడియుండెను. ఎంచింగు యూనివర్సిటివారి భవననిర్మాణశాఖలో ఎంజనీరింగు ఉద్యోగియు, డేనిష్‌జాతికి చెందినవాడును అగు వి. లేత్ మోలర్ ఈ భవననిర్మాత. కట్టనున్న గ్రంథాలయము యొక్క భవనచిత్రమునకై ఏర్పాటుపబడిన పోటీలో మోలర్ జయమందెను. ఆ కారణమున భవననిర్మాణమునకుకూడ ఆతడు అధ్యక్షుడుగా నియమింపబడెను.

నల్లమందుభాయీలదేశమని మనము ఈసడించు చీనాదేశమునగల ఈగ్రంథాలయముతో దొరయుపాటి గ్రంథాలయము భారతదేశమున ఒక్కటికూడ లేదనుట భారతీయులు జ్ఞప్తియందుంచుకొనవలసియున్నదనిమనవి.

—ఆర్. శ్రీరామమూర్తి, బి.ఏ.,

# తెన్గునాటి తూర్పుపడమరలు

ఆంధ్రరాష్ట్రమునకు తూర్పునాడు మస్తకము, పడమటసీమ హృదయము ఈ రెంటికలయిక ఆవశ్యకము. నల్లమలదుర్గమువలన గాబోలు రెంటికిని కలయిక కుదురలేదు. తెలివితేటలు మావంతు; దయాధర్మములు మీవంతు. మాకు తల బలసినది. మీకు హృదయము బలసినది. యుక్తిరక్తి మాపాలు; శక్తిభక్తి మీపాలు. బుద్ధిబలము మాది; భుజవిక్రమము మీది. వివాదపుపేచీలకు అందివేసినచేయి మాతూర్పునాడు. వీరత్వమున పేరొక్కినది మీపడమటిసీమ. లౌకికమున పెత్తనము మాది; లడాయిలో పెత్తనము మీది. మావలె మంత్రాంగములో పగ సాధించుట మీకు తెలియదు. మీవలె మారణహోమము సేయుట మాకు తెలియదు. సివిల్ కోర్టులు మాకు జిరాయితీహక్కు, క్రిమినల్ కోర్టులు మీకు ఇనామతిదఖల్ పట్టా. మిత్రునకు ప్రాణమీయను, శత్రునకు ప్రాణముతీయను మీకు ఉగ్గుపాలతో బెట్టిన విద్య. మిత్రునితోడను, శత్రునితోడను హృదయమీయక మెలకువగలిగి మెలగుట మాకు బారసాలనాడు ఉపదేశించిన బ్రహ్మవిద్య. త్యాగమున కన్న భోగమే మమ్మేలుకొన్నది. భోగమున కన్న త్యాగమే మిమ్మేలుచున్నది. గాలిజీవులము మేము, కష్టజీవులరు మీరు. మా వరియన్నము మీయాకలి వార్పదు, మీ జొన్నబువ్వ మాకు అఱుగుదలకాదు. కావున, తూర్పు—పడమర పరస్పరసహకారముతో మెలగుచుండవలయునని, బుద్ధియు హృదయము ఒక్కటిగా వర్తించునేని ఎట్టి దుస్సాధ్యములైనను సుసాధ్యములే యగునని మనవి చేయుచున్నాను. నాడు గ్రహగతి కడ్డువడి అగస్త్యుని దక్షిణయాత్ర మొదలు ఆతనికి క్రుంగ్గతిలబడిన వింధ్యశైలమువలె, నేడు మనకు అడ్డుగా నుండిన నల్లమల మన రాకపోకల కారణమున, క్రమక్రమముగా సమయనారంభించెనని, ఇక మనకు రాచబాట యేర్పడునని సూచనలగపడుచున్నవి. (ఆర్యవైశ్య ప్రథమ కవిపండిత సభాధ్యక్షోపన్యాసము నుండి.)

—నాళము కృష్ణారావు.

# తెనుగు కవులతొలికోళ్లు

## ౧

### ఉపోద్ఘాతము

తెనుగుకవులకు - చచ్చి స్వర్గంలో ఉన్నవారికి సుమండి - పడతులతరువాత పక్షులమీదనే ఎక్కువ వలపక్షం. బ్రహ్మలనిపించుకున్న ఆకవులసృష్టిలో మనకు కోకిలలు, చకోరములు, చక్రవాకములు, చిలుకలు, హంసలు, నెమిళ్ళు, పావురములు, కాకులు, కోళ్ళు మొదలైన పక్షుల జనాభా మనుష్యులజనాభా కంటె కూడా హెచ్చుగాఉందని చెప్పకతీరదు. పక్షుల జనాభా హెచ్చుగాఉండటమేకాదు అసలు ఒక్కొక్కచోట కావ్యకథానిర్వహణమునకు ఆపక్షులే ప్రధానమైన ఆధారములైనవి. చేమకూరవాని సారంగధరచరిత్రలో పావురములు; శ్రీనాథుని శృంగారనైషధములో సారంభరుడను హంస; పింగళివారి ప్రభావతీప్రద్యుమ్నంలో శుచిముఖిఅను హంసి; జక్కన విక్రమార్కచరిత్రలోను, మంచనకవి కేయూరబాహుచరిత్రలోను, సూరన్న కళాపూర్ణోదయంలోను, ప్రభావతీప్రద్యుమ్నంలోను చిలుకలు - నిర్వహించిన పార్టు చాల ముఖ్యమైంది. కొందరు కవులు అసలు తమ గ్రంథాలకు పక్షులపేళ్ళే వెలయించారు: హంసవింశతి, శుకసప్తతి మొదలైనవి.

చిలుకలవలె, హంసలవలె రాయబారములు నడుపకపోయినా తొలికోళ్ళుకూడా కావ్యప్రపంచములో తెనుగుకవులకు చాలా ఉపయోగించినవి. 'దేవనిలయప్రాంచన్మహామర్దలధ్వనిచే వేగుటెటింగిన' తెనుగుకవులు చాలాతక్కువ. మనకవులు కోడికూతచేతనే ప్రాయకముగా తెల్లవాఱుటను తెలిసికొనువారు. 'నిద్రచాలింపుము, నెలఁతల కౌఁగిళ్ళు మెల్లన వదలుండు' అనుచు మనకవులకు వైతాళికులైనవి తొలికోళ్ళే. కోడికూత వలన మనకవులకు మఱిఒక ఉపయోగముకూడాఉండేది. వారినాయికలు ప్రణయకోపాలకి పెట్టింది పేరు. ఆప్రణయకోపాలకు టైమ్‌లిమిట్ గా మనకవులకు తొలికోడికూత బాగా ఉపయోగించేది.

## ౨

శా. ఆయెంబోయె నిఁకేల ? నావలనఁ ద
  ప్పౌ ? మాట సైరింపవా ?
 ఆయో కానము నీమనంబు ; దయ మీ
  అంబల్క వింతైన ; నీ
 ప్రాయంబేటికి నిన్నుఁ బాసిన దృణ
  ప్రాయంబయో "కొక్కరో
 కో"యంచుం దొలికోడి కూయుదనుకం
  గోపంబె ? బింబాధరా !

అని ప్రణయకోపానికి కాలావధిగా చెప్పుకొనగలిగే ప్రయోజనమేగాక కథయొక్క ప్లాటుకూడ నిర్వహింపబడడానికి కోడికూత మనకవులకు ఒకటిరెండుచోట్ల సాయపడింది. ఇంద్రుడు 'గౌతమునియింటఁ జేసిన కారుగోష్ఠి'కి కోడికూతయేగదా కారణము. కోడియై కొక్కరోకోయని రొలుగించి అహల్యనుగలసిన అమరనాయకునివలెనే శ్రీకృష్ణమూర్తివారుకూడ తన వ్యభిచారానికి కోడికూతను ఊతగా కొన్నాడట. చూడండి:

మ. పొలుపొందన్ నడిరేయిఁగుక్కుటరవం
  బున్ సూపి గోపాలకా
 వళి విభ్రాంతులఁ జేసి మందలకునై
  వారేఁగఁ దత్కామినీ
 కలనాయత్నము తామ్రచూడగతులన్
  గావించి నీకీర్తి ర
 చ్చలకెక్కెం గదఁ గొంటె దేవరవు కృ
  ష్ణా ! దేవకీనందనా !

ఈ పద్ధతికి కృష్ణుడే మొదలిటివాడో ఇంద్రుడే మొదలిటివాడో తెలియదు కాని ఇది కవులకు కథనడపడానికిమాత్రం బాగాపనికివచ్చింది. ఇన్నిరీతుల ఉపయోగించేది కాబట్టే తెనుగుకవులు—సాధారణంగా బ్రాహ్మలే అయినా—ప్రతివాడూ ఒక్కొక్క తొలికోడిని కలిగి ఉండేవాడు. కోకిలకూతతో సమానంగా కోడికూతతోకూడా తమ కావ్యాలని ప్రతిధ్వనింపజేశేవారు. కాబట్టే

శా. రంతుల్ మానుము కుక్కుటాధమ! దరి
ద్రక్షుద్రశూద్రాంగణ
ప్రాంతోలూఖల మూలతండుల కణ
గ్రాసంబుచేఁ గ్రొవ్వి దు
ర్దాంతాభీలవిశేషణభీషణఫణాం
తర్నాంసనంతోషిత
స్వాంతుండైన ఖగేంద్రు కబ్బెదుర నీ
జంజాటములు సాగునే?

అని కోడిని తిరస్కరింపగలిగినకవి తెనుగుసారస్వతానికంతటికీ ఒక్కడే—ఒంటిపిల్లి రాకాసిలాగ—ఉన్నాడు. మిగిలిన కవులంతా అంతోఇంతో కోడికూత మాయలో పడినవాళ్ళే.

అయితే మనిషికోరుచి, పుఱ్ఱెకోబుద్ధి అని ఉన్నది కాబట్టి అసలు బ్రహ్మసృష్టిలో ఒకటేమోస్తరుగా ఉన్న కోడికూతలు ఈకవిబ్రహ్మలసృష్టిలో అనేకమైన మోస్తర్లుగా తయారయాయి. తెలుగుకవుల తొలికోడి పద్యాలను ఒకచోటపెట్టుకుని పరీక్షిస్తే వానిని అయిదు విధాలగా విభజింపవచ్చునట తెలియవస్తుంది. కొందఱు కవులు—వస్తువే ప్రధానమనేవారు—కూసేటప్పటి కోడినిమాత్రం వర్ణించి ఊరుకున్నారు. మఱికొందఱు—ధ్వనిప్రధానులు—కూతకోడి ఊసుఎత్తుకోక కోడికూతనుమాత్రం వర్ణించారు. మఱికొందఱు కైతగాంద్రు—కావ్యతన్మయత్వంలోమునిగి బాహ్యాన్ని మఱచిపోయేవారు—కోడికూతవలన కావ్యంలో తాత్కాలిక ప్రయోజనాన్ని సంఘటించుకున్నారు. వార్తలేని కవిత్వము వాసనలేనిపువ్వు అనుకునే సారమతులగు కవీశ్వరులు కొందఱు తమతమ కుక్కుటముల కూతలలో గొప్పగొప్ప సందేశాలను ఇమిడ్చారు. విశ్వశ్రేయమే కావ్యముయొక్క పరమప్రయోజన మనుకునే తెగకు చెందిన కవిసత్తములు కొందఱు కూతకోడిని వర్ణించక, కోడికూతను ప్రస్తావించక, ఆకూతతో తాత్కాలిక ప్రయోజనాన్నిఅయినా సంఘటించుకోనక, కూతలో సందేశాన్ని కల్పించక ఆకూతవలన లోకంలోకలిగిన మార్పులనుమాత్రము చిత్రించారు. ఈ అయిదువిధాలను క్రమంగా నిదర్శనా లిస్తాను.

౨

కూత కోడి వర్ణన

తెనుగుసారస్వతములోనికంతటికీ మనోహరమైన కూతకోడివర్ణన పండితారాధ్యచరిత్రలో ఉంది.

తొలికోడి కనువిచ్చి నిలిచి మైవెంచి
జలజల ఱెక్కలు సడలించి నీల్గి
గ్రక్కునకాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీకెలు జక్కొల్పి కడుపు
వెక్కించి మెడసాఁచి నిక్కి మిన్నూచి
కుక్కుటో కుఱ్ఱని కూయకమున్న....

సురాభాండేశ్వరము, శుకసప్తతిరచయితలు దీన్ని అనుకరించారు శ్రీనాధుడు శృంగారనైషధంలో 'కోమల తామ్రచూళికల క్రొవ్వెఱ సంజసుఁ బ్రోదిపెట్టి' ఇత్యాదిగా వర్ణించాడుగాని పైపద్యంయొక్క అందంరాలేదు.

౩

కోడి కూత వర్ణన

చాలమంది కవీశ్వరులు కుక్కుటారవము మన్మథుడిబాకాగా వర్ణించారు. పింగళివారితామ్రచూడం కళాపూర్ణోదయంలో వధూమానధనం దోచు మన్మథుడు తప్పటగొట్టి ఆర్చినట్లుగా తపతప ఱెక్కలుకొట్టుకొనుచు కూసింది. సుభద్రాపరిణయకర్తకు కోడికూత 'విరహిణీ పాంథజనులపై వేటలాడి గెల్చుఁగొనియేగుచో మీనకేతనుండు వాళిఁబుట్టించు వీరకాహళి.' సాంబోపాఖ్యానములో 'తలిరాకుఁబోఁడులం బురుషులఁ జొక్కఁజేసి జయోదయంబుతో కుక్కుటకంఠ కాహళిస్వరము లిగుర్ప మారుడు నిజాలయంబునకు మరలె'. కోడికూతను బాకాగా వర్ణించిన పద్యములలో క్రింది క్రీడాభిరామ పద్యము మఱువరానిది:

ఉ. మంచన! వింటివో? వినవొ? మన్మథుఁ
డేకశిలాపురంబులోఁ
జంచలనేత్రలం బతుల శయ్యల
పై రతికేళి రాత్రి పో
రించి ప్రభాతకాలము పరిస్ఫుట
మైనను దమ్ము దార వ
ట్టించుచునున్నవాఁడదె కుటీగత
కుక్కుటకంఠకాహళిన్.

అనిరుద్ధచరిత్రకర్తకు కోడికూత నిశాప్రత్యర్థివీరుని పరాభూతునిచేసిన ప్రాతఃకాలమహాబలాధ్వని జయతూర్యము. అన్నిటికంటె విచిత్రము: కవిజనరంజనకర్తకు కోడికూత ఓంకారమంత్రమైనది. చూడండి : 'అసమశరతంత్రవేదపాఠావసానసముచితోంకారమంత్రరాజంబు లొక్కొక్కయనగఁ జెలువొందెఁ దామ్రచూడారవమ్ములు'. ఊయెలలో ఊఁగుచు తెనాలి రామకృష్ణునిచే పరాభూతుడైన పారిజాతాపహరణకర్తకు కోడికూత ఊయెలపాటయైనది. ఉదయకాలమున ముకుళించు కలువపువ్వులనెడు బిడ్డలను నిద్రపుచ్చుటకై పాటలఁబాడునెడఁ జేయఁబడిన 'ళుళుహాయి' అను తాలురవములో అన్నట్లు కోడికూత లొప్పినవట. ఆంధ్రవాఙ్మయములోని కోడికూతవర్ణనములకంతటికిని ఈ ముసలి-ముక్కుతిమ్మన్నగారివర్ణన చాలముద్దుగా ఉన్నదని నాఅభిప్రాయము.

## ౪
## కోడికూత తాత్కాలికప్రయోజనవర్ణన

ఆంధ్రవాఙ్మయంలో ప్రకరణశుద్ధిగల తొలికోళ్ళు కూడా ఒకటి రెండు ఉన్నవి. కంకంటివారి ఉత్తరరామాయణంలో తొలికోళ్ళు ఒకప్పుడు తమ కోడిజాతివాడైన ఇంద్రుణ్ణి జయించడానికి రావణాసురుడు స్వర్గలోకముపై దండెత్తుచున్నప్పుడు ఆవార్త వెంటనే ఇంద్రునికి తెల్పుదామని బెట్టుగా కూసినవి. రేడియోయంత్రధర్మము వహించిన ఈకోడిగాక ప్రకరణశుద్ధిగల మఱియొకకోడి ఆంధ్రసారస్వతంలో ఉన్నది. ఐతే అది ఏష్య మెఱిగినపెద్దలా ప్రవర్తించింది. శివపార్వతుల కలయిక తారకాసురసంహారకుడగు కుమారస్వామిసముద్భవమునకేగదా ! కాబట్టె పార్వతీపరిణయంలో

గీ. అటుల వాగలుగలయ నాద్యకూరాల
కొడుకొకఁడుగల్గు నతనికిఁ గోపనాద్వ
యంబనుచుఁ దెల్పెఁ గాలజ్ఞతాప్తిననఁగఁ
గూసెఁ గోడులు వడిఁగొక్కొకోయటంచు.

అని వర్ణించడం ఎంతో సముచితంగా ఉంది.

## ౫
## కోడికూతలోని సందేశవర్ణన

ప్రస్తుతయుగంలో జైలుకు వెళ్ళేటప్పుడు ప్రతీ కాంగ్రెసునాయకుడూ సందేశం ఇవ్వడం వాటిని మనం వినడం పరిపాటి అయిఉన్నది. సందేశం ఇవ్వడంలో ఇప్పటి కాంగ్రెసుప్రముఖులు ఎంత ఉబలాటపడతారో అప్పటి తొలికోళ్ళుకూడా అంతటి ఉబలాటమూపడేవి. అల్లసాని పెద్దన్నగారికోడి చోరులకు, కాముకులకు, యోగులకుకూడా సందేశమీయజాలింది. భట్టుమూర్తిగారి వసుచరిత్రలోని, శేషము వెంకటపతిగారి తారాశశాంకములోని తామ్రచూడములు సందేశమిచ్చుటలో స్వప్రతిష్ఠలమీదనే ఎక్కువదృష్టులను నిలిపినవి. చూడండి :

మ. ఒకనాఁ డింద్రునియంత వేలుపు మదీ
యోక్తిన్ విడంబించి తా
నొకకాలం బెఱిఁగింప వచ్చి మునిశా
పోద్వృత్తిపాలయ్యె మా
మకశబ్దం బది యల్పమే త్రిమునిసం
భావ్యత్రికాలీవిబో
ధక............

మ. తొలిదేవేంద్రుడు మాకులంబు చొరలే
దో ? మేము నారోణ్ణము రా
యల యంకస్థితిఁ గాంచలేదా ? స్వరవి
ద్యల్మున్ను మావారి శి
ఖులచేఁ బాణిని నేర్వఁడో ? ...

ఇట్లు తమ కులస్థానప్రతిష్ఠలను గూర్చిమాత్రమే ఆలోచించు స్వార్థపరములైన కుక్కుటములతో మనం పెట్టుకొనికూర్చుండి లాభంలేదు. పరోపకారపారీణములైన వాటినిగురించి విచారిద్దాము. జనకోటికి బ్రహ్మీముహూర్తమునుగూర్చి సందేశమిచ్చిన చంద్రభానుచరిత్రలోని చరణాయుధము మనమన్ననకు తప్పక తగినది. పక్షిజాతిది అనే అభిమానముచేత 'ఇక్కువగతిపతిపాలికి జక్కవజవరాలు చేర సంకేతరవం బొక్కటి యొసగిన' రామాభ్యుదయపుఁగోడి పరోపకారపారీణతకలదియేకాని మన జాతీయులగు మానవులకు ఉపయోగింపకుండినదగుట దీనిని మనము అంతగా మెచ్చుకొనజాలము—ప్రత్యేకం మానవులకు ఇట్టి సంకేతరవం ఇచ్చి ఉపయోగించిన వాటినిఎంచి మనం ప్రశంసింపవలసిఉంది. సుమనోమనోభిరంజనములోని కృకవాకువు

సంఘం తోసిపారవేసే కులటలనుగూర్చి ఎంతశ్రద్ధ వహించిందో చూడండి :

మ. తమి సంకేతగృహంబులన్ విటులు మో
దంబొప్పఁగాఁ గూడి కా
సుమబాణాసనకేళిఁ దేలు కులటా
స్తోమంబుతో నయ్యెనా
గమమాసన్నతఁ జెందె నింక నిలువం
గర్జంబు గాదంచుఁ గూ
రిమి ముమ్మాటికిఁ దెల్పె....

దీనిని చదివినమీదట సదాచారసంపన్నులు కొందఱు మన తెనుగుకవుల తొలికోళ్ళు కులటలను గూర్చియే గాని కులస్త్రీలనుగూర్చి విచారింపలేదాయని తప్పక ప్రశ్నవైచితీరుదురు. పక్షులయినా పక్షపాతము లేకుండ పాపము అవి కులస్త్రీలనుగూర్చికూడ యోజించినవి. చూడండి :

ఉ. మాయపుఁ దుంటవిల్తు వెడమాయల
'మానినులార! ప్రాణముల్
వోయెడు నాఁడునాఁటి కిఁకఁబోవిడు
డీయలుకల్ నిజేశులన్
బాయకుఁడీ యటంచుఁ బరిభాషలఁ
జాటెడు భంగిఁ గొక్కొరో
కోయని కూఁత వేసెఁ దొలికోడి పు
రాంతరగేహదేహళిన్.

ఈ పద్యము తులసి బసవయ్య వ్రాసిన సావిత్రి కథలోనిది. ఆర్యమహిళలచేత దినదినము మ్రొక్కులు గొనే తులసిపేరు ఇంటిపేరుగాగలిగి; దక్షిణభారత దేశమున పుట్టువుగన్న మతోద్ధారకుడగు బసవేశ్వరుని పేరు పేరుగాగలిగి వెలసిన కవిగ్రామణి రచియించిన పతివ్రతాశిరోమణియగు సావిత్రిచరిత్రను ప్రస్తరించు కథలో ప్రసక్తమైన ఈ తొలికోడి కులస్త్రీలకు పరిభాషలలో చాటిన ఈ సందేశము ఎంతటిమహత్తరమైనదో, ఎంతటి అవశ్యాచరణీయమైనదో, ఎంతటి శిరోధార్యమైనదో చెప్పనక్కఱలేదు.

## ౬
## కోడికూతవలని మార్పుల వర్ణన

కుక్కుటరావమువలన లోకములో కలిగినకు మార్పుల వర్ణించే పద్యములను మూడునాలుగింటిని తడవిచూచి ఈ వ్యాసమును ముగింతును. ప్రభావతీప్రద్యుమ్నంలో పింగళి వారి కుక్కుటము '...వివిధచ్ఛంధస్క్రియామంతురంతిమయామో భగవాన్ఋషిః కుసుమధన్వీదేవతామానినీరమణాయాం' అని సంస్కృతములో మంత్రములుచ్చరింపగా వచ్చినమార్పు 'మానినుల్ రతికిఁదామై నాథులం బైకొనుట.' అలిగిన ఇంతులను వశపఱ్చుకొను మంత్రము నాలోచించువారింజూచి సమయమెఱిగినది కావున కుక్కుటము ఆమంత్రము నుపదేశింపదలచి దానియంగములగు ఋషిదేవతాచ్ఛందోవినియోగములదెల్పి యుపదేశించెనో యనునట్లుకూయగా సిద్ధమంత్రి ముపదేశించినతోడనే ఫలించును గావున వారికి ఫలము వెంటనేకలిగెను. అంతదనుక అలిగి మారోమిడియున్న ఇంతులు ఆకూతవిని అలుకను విడిచి పతుల కభిముఖులయిరి. పింగళి సూరన్న ఇట్లు కుక్కుటరవమువలన భార్యలలో వచ్చినమార్పును వర్ణించగా జక్కన కాముకులలోను,కోడళ్ళలోను వచ్చినమార్పును వర్ణించినాడు. చిత్తగించండి :

ఉ రాయిడికత్తెలైన పెనుఁబ్రాయిడి
యత్తలయిండ్లఁ గోడ్రముల్
సేయువిలాసినుల్ మునుకు సెందఁగ
వేశ్యల ప్రక్కదాపులం
బాయని కాముకుల్ వెలుకఁబాఱి క
లంగఁగ మ్రోసె కొక్కొరో
కోయని కుక్కుటస్ఫురదకుంఠిత
కంఠకఠోరనాదముల్.

కుక్కుటనాదమువలన అయ్యలరాజు నారాయణకవి లోకంలో కనిపెట్టినమార్పులు ఎట్టివో గమనించండి :

సీ. పిసవెట్టి కసరెత్తి యసరేగు ననగూఁటి
పూబోండ్లు తమయిండ్లపొంతకరుగఁ
బరసొమ్ములకు నిమ్ముపడఁగ్రమ్ము నెఱిహమ్ము
దస్కరుల్ దిగులొంది తావుఁజేరఁ
దనరారు సిరిసౌరు తనివారఁ గలవారు
కనుగూర్కు మదిఁగోరి కన్నుమూయ
రతిరూపు పసమాపు గతిచూపుగలకాఁపు
గుబ్బెత లెసటికై కుండలరయ

గీ. దూరదేశసమాగతధూర్తపాంథ
జనసమూహంబు పయనంబు సాఁగలేవ
ఱెక్కలలరించి కుత్తుక ల్నిక్కమించి
కొక్కరోకోయటంచును గోళ్లుగూసె.

ఈకవికి పాపము ఆకోడికూతవేళ ప్రాతఃకాల స్నానముచేయబోవు నిష్ఠాపరులు, అభ్యాసమునకు కడంగు గాయకులు మున్నగువారు కనపడలేదుగాని పాదిమొగములో ఎసటికై కుండలువెతకే కాపుగుబ్బెతలు కనిపించినారు. కోడికూతవలన లోకములో కలిగే మార్పులను వర్ణించు పద్యములలో అతిమనోజ్ఞమైనది శ్రీనాథుడు రచియించిన ఈక్రిందిది. అతడు అవసాన కాలమున 'దివజకవివరు గుండియల్ దిగ్గురనగ అరుగుచున్నాడు శ్రీనాథు డమరపురికి' అని చెప్పుకొన్నాడు. జరాకృశమైన ఆదినములలోనేగాక శ్రీనాథుడంతకు పూర్వము-బాగా ముసలితనంరానప్పుడు కూడ-ఒకసారి స్వర్గలోకమునకు పోయిఉన్నాడు.' అయితే అప్పుడు అతన్ని ఇంకా పడుచుతనపులక్షణాలు వదలలేదు. కాబట్టి అప్పుడు అతడు దివజకవివరువద్దకు వెళ్ళక దివ్యసుందరులదగ్గఱకు వెళ్ళినాడు. కోడికూతవేళ వాళ్లదర్శనముచేశాడు. మనకు చేయిస్తున్నాడు. చూడండి:

సీ. మాటుగాఁవైచిన మాంజిష్ఠ తెఱయెత్తి
పంజుమంచముడిగ్గె మంజుఘోష,
మొకరిమట్టెలమ్రోఁత ముద్దుసూపఁగ
రంభకనకంపుగోడుగుపాగాలుదోడిగె
నొకటివేనలిమడ్చి యొక్కకేల ఘృతాచి
గాజుఱెక్కలతెల్పు గడియవుచ్చె
నలసభావముతోడ నలవోక ప్రమ్లోచ
నిల్వుటద్దంబులో నీడచూచె
గీ. హరిణిగిలించె నలినపట్టాంశుకంబు
మేనకధరించెఁ బాలిండ్లమీఁదఱవికె
నప్పరస్త్రీనికేతనాభ్యంతరములఁ
గుక్కురోకోయటంచును గోళ్లుగూయ.

## ౭

## ఉపసంహారము

మొత్తముమీద తెనుగుకవుల తొలికోళ్ళు పురుషులనుగూర్చి కంటె స్త్రీలనుగూర్చియే ఎక్కువ శ్రద్ధ పెట్టినవని ఒప్పుకొనకతప్పదు. ఆస్త్రీలల్లోను కులస్త్రీల మీదకంటె—నేటి సాల్వేషన్ ఆర్మీవారివలె—కులటల మీదనే వాని దయాదృష్టి ఎక్కువగా ప్రసరించింది. అవి సకృతుగా అపుడపుడు పురుషులమీదకూడ ఒక చూపు విసిరేవి: అయితే ఆపురుషుల్లో కాముకుల మీదనే అవి కొద్దిపాటిదయఅయినా చూపేవి. కర్మిష్ఠులంటే వానికి బొత్తిగాకిట్టదు అని చెప్పవచ్చును. సుబ్రహ్మణ్యుడని పేరుపొందిన కుమారస్వామి వాహనములయ్యు, మంత్రదేవతాస్వాములయ్యు, కాలవిజ్ఞాన పాకకోవిదులయ్యు, భూతభుక్తికుంభార్థులయ్యు కుక్కుటములు కర్మిష్ఠుడగు గౌతమునకు హానిచేసి కాముకుడగు ఇంద్రునకు సాయపడి 'అహల్యాజారయభనహేతువులార!' అను సంబుద్ధినందినవి. న్యూటన్ మహాశయునకు రేగిపండుపతనము గ్రావిటీసిద్ధాంతము నిచ్చినట్లు పాణినికి హ్రస్వదీర్ఘప్లుతములను నిదర్శించుటలో తొలికోడికూత సాయపడింది అని చెప్పుతారు. ఇట్లు పాణినికి, ఇంద్రునకు సాయపడిన కుక్కుటనాదము గౌతమునితోబాటు ఈక్రిందిపద్యములోని నాయకునకును నష్టముకలిగించినది. చూడండి:

ఎట్టకేలకు నలుక రేయెల్ల దీర్చి
యువిదయధరామృతము గ్రోలుచున్ననాకుఁ
బానవిఘ్నంబుగా మ్రోసెఁ బాపజాతి
జాతిచండాలమైన వేసడపుఁగోడి.

పాపము శమించుగాక! గౌతమునివలన లేకపోయినను తొలికోళ్ళకు ఈ నాయకునివలన శాపనార్థములు వచ్చినవి. పైనచెప్పిన అయిదురకాలకూతలలోను ఇది ఎందులో చేరును? చండాలజాతి ప్రస్తావనగలదుగావున ఇది పంచమజాతిలోనే చేరును. కుక్కుటరవమువలన ఇక్కడ కలిగినమార్పు పానవిఘ్నమగుట. పానవిఘ్నము గావించినందులకు తామ్రచూడమును ప్రశంసించుచునో, నిందించుచునో — పానవిఘ్నమైనందులకు నాయకునకై సానుభూతిచూపుచునో, మంచిపనిజరిగినదని సంతోషించుచునో ఉన్న—వారివారి స్వభావములనుబట్టి ఉన్న—పాఠకమహాశయులనుండి నేను మెల్లగ సెలవుపుచ్చుకొనుచున్నాను.

# పట్టు పరిశ్రమ

పట్టుయొక్క విలువ పలువురకు తెలియును. అందమందేమి గట్టితనమునందేమి నూలుగుడ్డ పట్టుగుడ్డకు సాటిరాదు. పట్టునకు మైలలేదని శాస్త్రం. ఇంతటి గౌరవమునకు పాత్రమైన పట్టునకు మూలమేమిబంటే, పట్టుపురుగు. మూడురకముల పట్టుపురుగులు ఖనికిడిలోనున్నవి: మల్‌బరీపట్టుపురుగు, యీరీ పురుగు, టస్సార్ పురుగును. ఈ మూడింటిలో, మొదటి రెండును పెంపకమునకు తగియున్నవి. తుదిపురుగు స్వేచ్ఛావిహారి; మచ్చికకు పనికిరాదు. కావున మొదటి రెండు రకములే మనకు ముఖ్యముగ పట్టును ప్రసాదించుచున్నవని గ్రహింపనగును.

## పరిశ్రమ

కుటీరపరిశ్రమలలో ఈపరిశ్రమ యొకటిగా తలంచుటకుగల కారణమేమన, యీ పరిశ్రమ రైతుయొక్క సాధకబాధకములకు తగియుండి, అతనికి నాలుగు డబ్బులు గడించి పెట్టగలుగుటయే. గృహ పరిశ్రమల కుండవలసిన, అన్ని అనుకూలములు ఈపరిశ్రమకుగూడ కలవు.

౧. రైతునకు తనపొలమందు పనిలేనికాలమం దీపరిశ్రమయందు తనకాలమును సద్వినియోగ పరచుకొననగును.

౨. ఈపారిశ్రామికపదార్థము (పట్టు) గిరాకి గలిగి, యెక్కువధర కమ్ముడు పోవుటకు తగియున్నది.

౩. సామాన్యరైతు బీదవాడుగదా. ఇందు పెట్టుబడి తక్కువగనుండును. ప్రయాసము (శ్రమ) రైతు శక్తికిమించియుండదు. అనగా, రైతు తన ఆలుబిడ్డలతోడనే యీ పరిశ్రమను సాగింప వీలుగనున్నది.

౪. పెట్టుబడి ధనముపోగా, కూలి యంతమాత్రమైనను గిట్టింపు కాకపోదు.

కావున ఈ పరిశ్రమ రైతాంగమున కెంతయో లాభదాయకము.

## మల్బరీ పట్టు

అనాదిగ హిందూదేశమే దీనికి మూలస్థానమని నమ్మిక. కొందఱు చైనాదేశమని సిద్ధాంతీకరించెదరు. 6-వ శతాబ్దమునాటికే యీ పరిశ్రమ జపానునందు వృద్ధినందుచున్నదట. పిమ్మట పాశ్చాత్యదేశములకు వ్యాపించినదట. నేడీపరిశ్రమ దేశదేశముల వ్యాపించియున్నది. హిందూదేశమున ప్రప్రథమమున ఈ పట్టును పండించిన గౌరవము బంగాళమునకు దక్కినది. మైసూరునందున్నూ, కోయంబత్తూరు జిల్లాలోని కొల్లిగాల్ తాలూకాలోనున్నూ, జమీందారీ తాలూకాయగు బెరిగాయ్ (సేలంజిల్లా)-యందును, యీ పరిశ్రమ యిప్పటిలో ప్రచారమునందున్నది. సేలం పట్టు అనబడునది యీరకము పట్టే.

## టస్సార్ పట్టు

టస్సార్, టస్సర్, టుసోర్ అని అనేకవిధముల పిలువబడుచున్నది. ఇది 'త్రసారా' యను సంస్కృత పదమునుండి వచ్చినదని తలంచనగును. అనాదిగ ఇది యిండియా, చైనా, సిలోన్ దేశములకు చెందినదిగ తలంపబడుచున్నది. బర్మా మొదలు బొంబాయివఱకును, ట్రావన్కూరు మొదలు హిమాలయముల వఱకును గల అన్నిపర్వతప్రాంతములయందును నేడీపురుగు కానన గును. బంగాళము, మధ్యపరగణాలందు మాత్రము పెంపకము కొద్దిగ సాగుచున్నది. నల్లమద్ది, యేపి, జువ్వి, రావి, మర్రి, బూరుగ, బాదం, తుమ్మ మొదలగుచెట్ల ఆకులు దీనికాహారము. మద్రాసురాజధానిలో మాత్రము బాదం, వెలగ, రేగు, ములగ, తుమ్మ, ఆహార వృక్షములు. ముఖ్యముగ మధుర, తిరునెల్వేల్లి, పాండుచ్చేరి, బళ్లారి, గంజాము, ఉత్తరసర్కారులు, సైదాపేట, కోయంబత్తూరు, మైసూరు మొదలగు ప్రదేశములం దీపట్టు దొరకును. దీనిని దేశీయపరిశ్రమగా అవలంబించుటలో గల కష్టనిష్ఠురముల వేఱుగా నుడువవలసియున్నది.

స్థలాంభ్యంతరముచే ముఖ్యములగు మల్ బరీ, యారీ పరిశ్రమల రెంటినిగూర్చి తెలుపుటకు వీలులేకపోవుటచే, అభివృద్ధిలోనికి రానున్న యారీ సిల్కును గూర్చి మాత్రమే ఇచ్చట ముచ్చటింతును. మల్ బరీ (సేలంపట్టు) యారీ (అస్సాంపట్టు)లకు గల పారిశ్రామిక, పదార్థ, తారతమ్యముల నీక్రింది పట్టికవలన తెలియనగును.

మల్ బరీ

౧. లార్వాలు మల్ బరీ (తూతిక) చెట్టు ఆకులు తిని జీవించును. ఈ చెట్టు అన్నిచోట్లను పెరుగదు. ఈ పురుగు యీ చెట్ల ఆకులుతప్ప మరే ఆకులను ముట్టదు.

౨. చల్లని పొడి వాతావరణమునందు, అభివృద్ధినందును. సులభముగ రోగములకు లోబడును. అందుచే నష్టము మెండు.

3. పట్టు గూళ్ళలోని పురుగులను బయటకు రానీయక, లోపల ఉండగనే చంపివైతురు. అందుచే ఒక్కటేదారముగా తీయుటకును, సులభముగ కండెలు చుట్టుటకును వీలగును.

౪. పట్టు సన్నముగను, సున్నితముగను, ఇంపుగను ఉండును.

ఈరీ

౧. లార్వాలు ఆముదపు ఆకులుతిని జీవించును. ఆముదపుచెట్టు యిండియాడిలో పలుతావుల పెరుగును. ఈ పురుగును ఎద్దడికాలమందు, రబ్బరాకులపైనను లేక పెండలపు ఆకులపైనను పెంచవచ్చును.

౨. వెచ్చని, చెమ్మగల వాతావరణమునందు వృద్ధినందును. రోగములకంత సులువుగ లొంగదు అందుచే నష్టము తక్కువ.

3. రెక్కల పురుగు పట్టుగూటిని తొలచుకొని బయటకు రానిచ్చెదరు. అందుచే ఒక్కటేదారముగా తీయుటకును, కండెలు చుట్టుటకును సులభముగాదు.

౪. పట్టు నుందముగనుండి, అంత యింపుగా లేకపోయినను, ఉతికినకొలది చాయవచ్చి, చాలకాలము మన్నును.

ఇవిగాక యింకొక ముఖ్యవిషయము కలదు. ఎముకలబొగ్గుతో శుభ్రముచేయబడిన దనిన కారణమున, తెల్ల పంచదారనే, యీసడించు మనదేశపు ప్రజానసముదాయము, మల్ బరీ పరిశ్రమలో పురుగులను జంపు విషయమును సైత మీసడించుకొనుటలో అబ్బురము లేదు. అందులకని పల్వురు యారీ పట్టునే కృషి చేసెదరు.

ఈరీపట్టు

ఈపురుగుపేరు దానికి ఆహారమగు ఆముదపు మొక్క నుండి వచ్చినది అస్సాందేశభాషలో 'యీరీ' అనగా ఆముదపుచెట్టని యర్థము. ఇది సంస్కృతమునందలి 'ఏరండ' నుండి వచ్చెనేమోయని యూహింపనగును. తక్కినవానికి వలెనే, పట్టునిచ్చునది పూర్ణదశనందిన రెక్కల పురుగుకాదు. పరిణామావస్థలోనున్న రెక్కలులేని లార్వా. రెక్కలుండియు నెక్కువగ నెగురజాలని యీ పెద్దపురుగులకు తినుటకు సరియైన నోరు సైతము లేకపోవుట విచిత్రము. అవి తిండితినక, సంగమించి గ్రుడ్లను మాత్రము ఉంచుటకు కారణమై, తమ జీవితమును సమాప్తినొందించుకొనుచున్నవి. ఈరీ పట్టునే మనము అస్సాంపట్టని పిలుచుచున్నాము. ఈ పరిశ్రమనుగూర్చి పలువురు తృప్తిని గనపరచుచున్నారు.

ఈరీ పరిశ్రమకు అవకాశములు

మొదట 'యీరీ' అస్సామునందే వ్యాపించియున్నను, ఇప్పుడిప్పుడు ఇండియాయంతటను ప్రచారమునందుచున్నది. ఇది తక్కినవానివలె వాతావరణస్థితులకు సులువుగ లొంగక, సాలునకు 6 తరములు పెంచుటకు వీలుగనుండును. 70°-90° (ఫాహ్) లోపలను, ఎక్కువ చెమ్మగలిగిన వాతావరణమునందును, యీపట్టు పురుగు పెరుగగలదు. 60°.లకు తక్కువగాకను, 100°. లకు మించని తావులు మద్రాసురాజధానిలో పెక్కులు గలవు. అందునను, అధికోష్ణము, ఏరెండుమూడు నెలలలోనో ఉండును గావున, ఆరెండుమూడు నెలలను వదలి, తక్కినకాలమందు పరిశ్రమ సాగింపవచ్చును. సముద్రతీరములు ముఖ్యముగ తగియున్నవి. కర్ణాటక దత్తమండలములలో ఏప్రియల్, మే, జూన్ నెలలలో తప్ప తక్కిన మాసములందు పరిశ్రమ నిరాఘాట

ముగ సాగింపనగును. మొత్తముమీద, అధికోష్ణకాలము వలన గలుగు నష్టము, చలికాలమందు కలుగదు. ఉదకమండలములందు, కొడైకెనాల్‌నందు మాత్రము, చలి మిక్కుటమై, ఈపరిశ్రమకు అనుకూలముగ లేదు.

### పరికరములు

పరిశ్రమను స్థాపించదలచిన ప్రతిరైతునకు నీదిగువ జెప్పబడిన వస్తువులు కావలయును.

(1) ఆముదపు ఆకులు, (2) విశాలమైన కుటీరము, (3) పెంపకమునకు కావలసిన వెదురుబుట్టలు, చేటలు.

ఆహారమునకు కావలసిన ఆముదపుచెట్లను ప్రతి పారిశ్రామికుడును పెంచుకొనవలయును. కీటకములను పెంచుటకు రెండునెలలకు ముందుగానే ఆముదపుగింజలను నాటి పంటనుపెంచి యుంచవలయును. ముగ్గురకు తక్కువగాని ఒక కుటుంబము, తరమునకు 8000 పురుగుల చొప్పున, 5 తరములుగా సంవత్సరములోపల, అధమము 40,000 పురుగులను పెంచనగును. ఈమొత్తమునకు మూడింట ఒకభాగపు యెకరములోవేసిన ఆముదపుపంట సరిపోవునని నిర్ణయింపబడినది.

తరువాత కుటీరము విషయమై. రైతు తాను నివసించు గృహమునందొకభాగము నుపయోగించినను సరిపోవును కాని ఆభాగము ప్రత్యేకముగ పరిశ్రమకై వదలివేయుట మంచిది. వాయుప్రసారముగలిగి గదిగోడలు నేల దుమ్ముదుమారము లేక యుండునట్లు చూడవలయును.

పెంపకమునకు కావలయు చిల్లర పరికరము లంత వెలగలిగినవికావు. వెలగలవికానూ కూడదు. 3×2 (చదరపు అడుగులు) కొలతగల 20 చేటలు (దాగరలు) లార్వాలను పెంచుటకై కావలసియున్నవి. ఈచేటలు మామూలు చేటలవలెగాక, నాలుగు ప్రక్కలందును 2 అం. యెత్తుగలిగిన అంచుగలిగి యుండవలయును. వీలునుబట్టి యీవిధమగు చేటలను నిర్ణయించిరే కాని, అవే కావలయుననికాదు. ఇవిగాక, 2 అడుగులలోతు 2 అడుగుల వెడల్పుగల పండ్లబుట్టలవంటి బుట్టలు 20 కావలయును. వీనిలోనే లార్వాలు పట్టుగూండ్లను కట్టునది. మూడవముఖ్యమగు పరికరము గడమంచెలు. వెదురుకర్రలతో నిర్మించబడిన గడమంచెలు ప్రతివారును ఎరిగియేయుందురు. అంచె అంచెకును నిలువు ఒక అడుగునకు తక్కువగాకుండ నుండుట మంచిది. గడమంచెలపై, లార్వాలున్న చేటలనుపెట్టి, గడమంచెల కాళ్ళు నీటిపళ్లెరములలో పెట్టియుంచినచో చీమల వలని బాధ, నష్టము లార్వాలకు కలుగదు.

### పురుగు జీవితము

అనేకకీటకములకు వలెనే యీ పట్టుపురుగునకు గూడ నాల్గు పరిణామావస్థలున్నవి.

| అవస్థ | పరిమితికాలము. | |
|---|---|---|
| గ్రుడ్డు | 7- 9 | దినములు |
| లార్వా | 17-20 | ,, |
| పట్టుగూడు | 3- 4 | ,, |
| ముసుగుకాలము | 12-13 | ,, |

రెక్కలున్న పెద్దపురుగులు సంగమించును. ఆడపురుగులు 120-250 అతి-పసుపు పచ్చరంగుగల గ్రుడ్లను పెట్టును. 7 లేక 8 దినములపిమ్మట ఈ గ్రుడ్లనుండి పిల్లలు (లార్వాలు) బయటకువచ్చును. అవి అంగుళమున ఐదింట ఒకభాగము పరిమితికి మించియుండవు. ములగపురుగువంటి ఆకారముగలిగియుండుననిన కొంత యభిప్రాయము గలుగవచ్చును లార్వా, 3-4 దినములు ఆముదపు ఆకులను తిని జీవించును. పిమ్మట $1\text{-}1\frac{1}{2}$ దినములకాలము అది మందమతియై ఆహారమును విసర్జించి వైచును. అప్పుడే అది దాని పైచర్మమును విడచివైచును. వెంటనే అది దగ్గరదగ్గర అరంగుళము వఱకు పెరుగగలదు. మరిరెండుమూడు దినములు లార్వా ఆహారమును దినుచుండును. ఈలోపున వేరొక నూతన కవచము ఆవరించుకొనును. ఈవిధముగ 3 లేక 4. పర్యాయములు, ఆలార్వా తనకుబుసమును వదలిన పిమ్మట, అది దాని మూడవపరిణామావస్థలో జొరబడును. అనగా అది తనపట్టుగూటిని నిర్మించుటయందు నిమగ్నయగును. ఇప్పటికది 3-4 అం. పొడవుండి,

½ అం. నకు మించి లావుగనుండును.

సంపూర్ణముగ పెరిగిన యీ లార్వా క్రింది పెదవి లోనున్న రంధ్రమునుండి, ఒకానొక పలుచని పదార్థము వచ్చుచుండును. అది గాలిలోనికి రాగానే గట్టిపడి పోవును. అదియే పట్టు. ఈవిధముగ నిరంతరము 3 దినములు కృషిచేసి, ఆ లార్వా తనచుట్టును 1½ అం. పొడవున పట్టుగూటిని నిర్మించుకొనును. భగవంతుని సృష్టిలీలల నిట్టి కీటకమాత్రములే వేనోళ్ళ చాటుచున్నవి. ఒకే నాటకమున రెండుపాత్రల ధరించిన నటకుడు తన ప్రథమపాత్రను మార్చుకొనుటకు గ్రీన్ రూమ్‌నందు ప్రవేశించు విధమున యీ పట్టుపురుగు లార్వా, యికముందు తనకురానున్న రెక్కల పురుగు ఆకారమును సంపాదించుకొనుటకు, పట్టుగూడుఅనే తనగ్రీన్‌రూమ్‌నందు వేషమును మార్చుకొనుచున్నది. విచిత్రము! విచిత్రము! బాహ్యప్రపంచముతో సంబంధమునువీడి, ఆహారవిహారములవీడి, తపోనిష్ఠనున్న యోగీంద్రుని పోలిక నిలచిన పక్షరహితమగు లార్వా, 5-6 దినములు ముసుగు వైచుకొన్నపిదప, రంధ్రమును పొడుచుకొని, పక్షసహితాకారముతో పట్టుగూటి నుండి వెలువడుచున్నది. ఇది దాని అంత్యావస్థ. బయటకు వెడలిన దినమువనే స్త్రీపురుష కీటకములు సంగమించును. అటు పిమ్మట దేనిదారి దానిదే. ఆడపురుగులుమాత్రము తమ ధర్మము ననుసరించి, గ్రుడ్లుపెట్టి, వానిపై రెండుమూడు దినములు కూర్చుండి, వానిని పరిరక్షించుచు, ఆహారపానీయములకు నోచుకొనక, తమ జీవనములను వదలివేయుచున్నవి. వాని గ్రుడ్లు పిల్లలై లోకమున జీవించును. ఇది క్లుప్తముగ వాని జీవనచరిత్ర. తినుటకు నోరీయని భగవంతుడు, సంగమించుటకు శక్తినొసంగుటలోగల ఉద్దేశ్యమును గ్రహించుడు.

## పెంపకము

ఎండకాలము దాటిపోయిన వెంటనే పెంపకమును సాగించుట మంచిది. పెంపకమునకు గ్రుడ్లు అవసరము గదా! అవి యేజబ్బులేక కల్తీలేకయున్నవని గ్యారంటీ యీయగల సంస్థనుండియే తెచ్చుకొనుట మంచిది. గవర్నమెంటు వారి కీటకశాస్త్రజ్ఞుని వద్దనుండి గాని పట్టుపరిశ్రమలో చిరకాలానుభవము నందిన సంస్థనుండి గాని తెప్పించుకోవలయును. మంచి గ్రుడ్లేగదా మంచి పురుగుల నిచ్చునది! మంచి పురుగులేగదా మంచి పట్టు నిచ్చునది! అయితే, రైతు తన తాహతును బట్టి గ్రుడ్లు తెప్పించుకొనవలయును. మొదటి తేరములో 400 గ్రుడ్లుచాలును. అనుభవము లేకపూర్వమే అంతపెద్ద మొత్తమును పెంచుట కష్టమై, రైతు ఆదియందే నిరాశజెందు నవకాశములు తటస్థించును. కావున ఎప్పుడును కొద్దిసంఖ్యతో మొదలిడి, కాలక్రమమున అభివృద్ధి చేసుకొనుట మేలు.

పరికరముల సంతరించుకొన్న పిదప, గ్రుడ్లను ఒకటి రెండు చేటలలో విశాలముగ చల్లవలయును. చేటలను గడమంచెలపై పెట్టి యుంచవలయును. 7-8 దినములనాటికి, గ్రుడ్లు బూడిదవర్ణమునకు తిరుగును. అప్పుడు లేతనైన ఆముదపు ఆకులను చిన్నతుంపులుగా తరిగి, గ్రుడ్లపై పోయవలయును. గ్రుడ్లనుండి లార్వాలు బయటబడిన వెంటనే ఆముదపు ఆకును దిన నారంభించును. లార్వాలు బయట బడిన 2-3 గంటలలోపల, వానిని యెత్తి 20 మంచి చేటలలో సర్దవలయును. ఆ ప్పటినుండి వానికి, దినమునకు రెండు పర్యాయములు (అవసరమైన 3 పర్యాయములు) ఆహార మిడుచుండవలయును. చర్మమును వీడుకాలమందు, అనగా లార్వాలు ఆహారమును తిననికాలమందు ఆకుల వేయకుండుట మంచిది. మొదటి కుబుసమునకు పూర్వము రెండు తడవలు, పిమ్మట మూడు తడవలు; 2-వ. కుబుసమునకు పిమ్మట 3 తడవలు; 3-వ. దాని పిమ్మట నాల్గు, అయిదు, ఆరు తడవలుగూడ ఆహారము నీయవలసి యుండును. ఈ సమయములందలి లార్వాల తిండిపోతు తనము ఆశ్చర్యమును గలిగింపక పోదు. మొత్తముమీద దుమ్ముగాని, నీటి బిందువులుగాని, బూజుగాని, మరియేవచ్చుగాని లేకుండునట్లు ఆకులను శుభ్రముగ తుడిచి ఆహారమీయవలయును. లేనిచో లార్వాలు అనేకరోగములకు గురియగును. చిన్న లార్వాలకు తరిగిన లేతఆకులును, లార్వాలు పెద్దవియగు కొలది పెద్ద

ఆకులును (తరుగ నవసరములేకనే) యీయవలెను.

ప్రతి యుదయమునను పారిశ్రామికుడు చేటలను శుభ్రము చేయవలయును. లార్వాల మలమును పేరబెట్టి చేటలలోనే ఉంచరాదు. శుభ్రముచేయు సమయమున, లార్వాలను అతిజాగ్రత్తతో యెత్తిపెట్టవలయును పరిశ్రమయొక్క ఫలితమిట్టి చిన్నవిషయములపైననే ఆధారపడియుండును గావున వీనిని అలక్ష్యపెట్టరాదు.

సంపూర్ణముగ పెరిగిన లార్వాలు, గూండ్లను కట్టుకొనుటకు చీకటిచోటులకు ప్రాకనారంభించును. ఇది కనిపెట్టి పారిశ్రామికుడు వానిని బుట్టలలో పెట్టవలయును. బుట్టకు లోపలి అడుగున, కాగితపు తుంపులను (గుడ్డపేలికలు, చెత్తగూడ పెట్టవచ్చును) పరచి, కొన్ని లార్వాలను వానిమీద పండపెట్టవలయును. తదుపరి యింకొక కాగితముల పొర. దానిపై లార్వాలు. మరల కాగితముల పొర. పిమ్మట లార్వాలు. ఇటుల పది పది రెండు వరుసలువేసి, బుట్టలను మూయవలయును. 3-4 దినములలో పట్టుగూండ్లు తయారైపోవును. అంత వానిని జతపఱచి, రెండుమూడు చేటలలోపెట్టియుంచవలయును. 5,6 దినములలో రెక్కల పురుగులు గూండ్లను తొలచుకొని వెలువడును. నాడే, అవి సంగమించును కాబట్టి, వానిని రెండు చేటలలోవదలి, తక్కిన చేటలను, రెండవతరమునకు సిద్ధముగ శుభ్రముచేసి, యెండబెట్టి, ఉంచుకొనవలయును. వాని సంగమము పిమ్మట పెట్టిన గ్రుడ్లనే రెండవ పెంపకములో వాడనగును. ఈ విధముగ ప్రతితరమునందు వచ్చిన పట్టుగూండ్లను తిరుగ వేయు చేమరలచేత తిరుగవేసి, పట్టుగూండ్లను కడిగి, పట్టును కండెలకెక్కింతురు. ఇది క్లుప్తముగ పట్టును పండించు తీరు.

## పరిశ్రమకు వచ్చు నష్టములు

గ్రుడ్లు మంచివికాకపోయినను, లార్వాలకు నియమితకాలమున చాలినంత ఆహారము పెట్టకపోయినను, కుటీరము పరిశుభ్రముగ లేకపోయినను, పురుగులను ఎత్తిపెట్టువేళ ఒడుదొడుకుల గలిగించినను, లార్వాలు పెరుగవలసిన తీరున పెరుగకపోవుటయో, లేక రోగపీడితములగుటయో, అందువలన మరణించుటో జరుగును. ఇది పరిశ్రమకు తీరని నష్టము. ఇదిగాక. చీమలు, ఎలుకలు, పిల్లులు మొదలగు అరిష్టములనుండి, పురుగులను కాపాడుచుండవలయును.

## వ్యాపారము

ఎకరము ఆముదపుపంట 75 మొదలు 150 పౌనుల పట్టుగూళ్ళ నిచ్చును.

దీనికిదారము 50 మొ. 100 పౌనులవఱకు వచ్చును.

గుడ్డ 52 అం. పన్నాగలిగి 150 గజములు నేయనగును.

దానిఖరీదు రూ 300.

### ఖర్చులు

| | | |
|---|---|---|
| పంటకు | ... | 55 రూ. |
| వడుకుటకు | ... | 70 ,, |
| నేతకు | ... | 75 ,, |
| | | 200 రూ. |

కావున నిల్వాదాయము 100 రూ.

ఇదియునుంగాక, అసలు పరిశ్రమలో తీసిపేత పట్టును వృథగా పోనీక, దానికి రంగువేసి, పారుపట్టు 'పేట్టుసిల్కు' అను పేరున వ్యవహరించి, ధనముగడించుచున్నారు. ఇదిగాక, ఆముదపుపంటవలన వచ్చు 100000 పౌనుల గింజలు (ఎకరమునకు) అమ్మి ఆదాయము, పురుగులమలమువలన వచ్చు మంచి యెరువు, యీపరిశ్రమలో ఆదాయ సూత్రములు. కాని యీపరిశ్రమలోగల ఒక్క కష్టమునుమాత్రము చెప్పకతప్పదు. ప్రతిరైతు తానుపండించు పట్టుగూళ్ళను తానే అమ్ముకొనవలయునన్న కుదురదు. పట్టుఫ్యాక్టరీలవారు టోకున కొనుగోలు జరుపుదురు. అందుచే, పారిశ్రామికులు, కోఆపరేషన్ సంఘములుగను, సంస్థలుగను ఏర్పడి తమ పట్టును అమ్ముకొనుట శ్రేయోదాయకము. ఇట్టి విషయములలో పారిశ్రామికడైరక్టరు, రైతులకు తగిన అవకాశములను కల్పించుటలో సందియములేదు. కావున రైతు లీపరిశ్రమను గ్రహించి సాగించి తమ ఆదాయమును పెంపొందించుకొందురు గాక.

—జాగు గోపాలరావు.

# సుకారీ, లంబాడీ, మరాటీ

"సుకారీ, లంబాడీ, మరాటీ" ఈ తెగల్లో ఏ తెగవాళ్ళు వీళ్ళని చూస్తున్నాను— గుంపుగా కొందఱు గోదావరివంచే దిగి అవతలవొడ్డునున్న కొవ్వ్యూరుకు పడవల మీాద చేరుకుందామనుకుంటూ కాసర బీసరగా మాటలాడుకునే జనుల్ని చూచి. వాళ్ల తాలూకు వంద వందఏభై గాడిదలు గూడులేని పెద్దతొట్టిపడవలో కెక్కి నిలుచుండాయి ఓ గూడున్న తొట్టిపడవమీాద అటూఇటూ పదిపదిహేను బళ్ళు చక్రాలూడగొట్టినవి కొన్నీ, కాడి లాగివేసినవి కొన్నీ, చక్రాలు కుదేసినవికొన్నీ నదిదాటే విధంగా అమరింపు సూచిస్తున్నాయి. గూటిగుండా సామాను తొంగిచూస్తూవుంది. మనుష్యులుమాత్రం ఇంకా వొడ్డుపైనే వండుకొంటూ కొందఱు, వండుకొని కొందఱు, ఆడుకొంటూ కొందఱు, పాడుకొంటూ కొందఱు చెలరేగుతూ వున్నారు.

"మరాటీగుంపు" అన్నాడు గట్టేనడచి పొయ్యే పాంథుడు, "వాళ్ళదగ్గఱ డబ్బు నిలవవుంటుంది. కాని అది వాళ్ళదగ్గఱ వుంచుకోడానికి వీల్లేదు. ఏసాయంత్రానికాసాయంత్రం వాళ్ళను గొపలా గాచే రక్షకభటులికి అప్పజెప్పి వేయవలసిన దే— అదుగో రక్షకభటులు అని అక్కడే కూర్చుని దిగాల్ మొగంగావున్న పోలీసుల్ని చూపించేడు.

నే నారక్షకభటుల్ని చూస్తూ "అయితే యీాతండావాళ్ళకి స్వేచ్ఛ లేదు. ఆజనాన్ని ఎప్పుడూ ఈరక్షకభటులు ఎప్పుడూ కావలి కాస్తూ ఇటూఅటూ పోనివ్వరు. నేనింకా సుకారీ, లంబాడీ, మరాటీ అంటే స్వేచ్ఛాజీవనానికి ప్రతిబింబా లనుకుంటూండే వాణ్ణి." అంటూ మిక్కిలి జాలిగా గుంపుకేసి చూడసాగినాను.

అప్పుడింకా పాంథుడన్నాడు "అంత ఇది కాదులెండి. పగలు వాళ్ళిష్టమువచ్చినట్టూ తిరిగి ఊళ్లోయిళ్ళదగ్గిఱా కొట్లదగ్గిఱా దండోరాచేసి వాళ్లతవ్వేదుబియ్యం డబ్బూ పట్టుకుపోవచ్చును. సాయంకాలానికి మాత్రం హాజరుపట్టీయిచ్చి పోలీసుహావేలీలో వుండాలి" అన్నాడు.

"వీళ్ళకు ఇళ్లులేవు. వాకిళ్లులేవు. పగలల్లా తిరుగుతూవుంటారు. రాత్రిళ్ళు పోలీసు కాపలా. అటువంటి పరిస్థితిలో వీళ్ళకుటుంబా లింతవృద్ధికావడం, వీళ్ళకు పసిపాపలు నవ్వుకలిగిస్తూవుండడం, యువతులు గర్భిణీ స్త్రీలై గౌరవనీయంగా కనబడ్డం ఇదంతా ఎక్కడంటావు - ఎప్పుడంటావు - ఆశ్చర్యం కాలేదోయి నీకు?" అన్నానుపాంథునితో

పాంథుడు అన్నాడు "వెన్నెలే వాళ్లకు దుప్పటి, చీకటే వాళ్లకు బూర్నీసు-అనుకుంటాను" అన్నాడు పాంథుడు - అంటూ వెళ్లిపోయేడు చిరునవ్వునవ్వుతూ—

ఒక చిన్నకుఱ్ఱవాడు ఆదండులోంచి విడువడి గబుక్కున పాంథుని కడ్డుతగిలి తన కడుపు దీనంగా కొట్టుకొంటూ డబ్బుకావాలన్నట్టు సంజ్ఞచేసినాడు. వాని మొగం మంచి అందంగావుంది. జునపాలువున్నాయి. కళ్లల్లో తేజస్సు ఒలికిపోతూంది. ఒళ్లంతా కాసువన్నె పోతవిగ్రహంలాగ గనిపిస్తూంది. వాడలాదీనాలాపం ఆడుతూన్నాడు. సంధ్యకాంతి కేసి చూస్తూ తెప్పలాడిస్తూన్నాడు వినోదంగా.

"ఆబుడుతడి తల్లీ, దండ్రీ ఎవరో!" అని అనుకొన్నాను. రక్షకభటుల్లో ఒకడికి అనా అనుకోవడం వినబడినట్టుగావుంది. అతగాడు అన్నాడు "వాళ్లకు తండ్రి ఆకాశం, తల్లి భూలోకం, జగత్తంతా వాడే" నన్నాడు.

అలా అతగాడన్నాడు. కుఱ్ఱా డోడబ్బు పాంథుడిదగ్గఱ పుచ్చుకున్నాడు. శ్రద్ధానంద ఘాటుమెట్లమీాద ఇడ్డెనలమ్మే బ్రాహ్మడి దగ్గఱ ఓఇడ్డెన్న కొనుక్కున్నాడు. తిన్నాడు. వెంటనే మఱోడిదగ్గఱకు పఱుగెత్తుకెళ్లిమళ్లీ దీనంగా కడుపుకొట్టుకుంటూ మళ్లీ సంధ్య కాంతికేసి చూస్తున్నాడు.—రక్షకభటుడు "చూడండి అప్పుడే ఆకుఱ్ఱాడు ఎన్నిపోకిళ్లు పోయాడో" అన్నాడు—నేను ఆకుఱ్ఱవాని కేసి చూస్తున్నాను. వాడో అరటిపళ్ల దుకాణాదారు దగ్గఱకు వెళ్లి డబ్బివ్వకుండానే ఒక అరటిపండు గిల్లోంచి లాక్కున్నాడు. తింటూ పరుగెత్తుకు పోయిపోయి గుభాల్న గోదావరిలోపడి ఈతాలాడ్డం ప్రారంభించేడు. ఈతాలాడి వొడ్డుకెక్కి వళ్లుతుడుచుకోకుండానే ఓచిన్న పొట్టి నులకమంచం అక్కడవాల్చినదానిపైని దొర్లేడు. "వాళ్లకు తండ్రి ఆకాశం, తల్లి భూలోకం" అని రక్షకభటుడన్నమాట మళ్లీతట్టింది. వానికళ్లల్లో సంధ్యకాంతి తాండవిస్తూంది—నేను పరకాయిస్తున్నాను.

నాతోమాట్లాడిన రక్షకభటుని బీటు అయిపోయి అతడు గట్టెక్కిపోతూ నన్ను "ఏమిటి అలాపరకాయిస్తున్నారు" అన్నాడు. "ఏమీా లేదు. నీవన్నముక్కే ఆలోచిస్తున్నాను. ఆకాశంతండ్రి అంటే ఏమిటా, భూలోకంతల్లి అంటే ఏమిటా" అని అన్నాను. రక్షకభటుండు అన్నాడు "బాబూ! మేము ఏక్షణంవాళ్లను కాచుకున్కుంటూ వుంటాము. ఆడదానిమీాద ఆకాశం మగాడి క్రింద భూలోకం తప్ప మఱేమీా వుండడానికి వీల్లేదు. వాళ్లకు బిడ్డలుకలిగేరు అంటే ఏమనుకోము? ఆకాశం తండ్రి భూలోకం తల్లి అనుకుంటాము" అన్నాడు. "అంతబాగా కనిపెట్టేవాళ్లు కామట్టే మిమ్మల్ని రక్షకభటు"లన్నారు అని వాసితో సామాన్యంగా ఆడేసి వాణ్ణిపంపివేసి నేనూ ఇంటికి వెళ్లిపోయినాను.

మళ్లీ ఆతెగవాళ్ల పుట్టుపూర్వోత్తరం యోజించసాగినాను. "ఆకాశం తండ్రి, భూలోకం తల్లీ ఆరెండుకలిసేచోటున వాళ్లు ఉద్భవిల్లుతూ ఒకటేనడక ఒకటేనడక ఆ సూర్యచంద్రుల్లాగు ఒకటేనడక నడస్తూ పోతారు. వాళ్లకేమిటి స్వేచ్ఛ: వాళ్లప్రేమ చెట్టునీడ, నదీతీరాన్ని, వెన్నెట్లోను, చీకట్లోను విరిసి నృత్యచేస్తూవుంటుంది వాళ్లనొకళ్లు కనిపెట్టడానికి శక్యమా? పదివేలమంది రక్షకటులున్నాగానీ రక్షకభటులు లేనివాళ్లే" అని అలాఅనుకుంటూ స్వేచ్ఛగా నిద్రపోయినాను. నిద్రలో స్వేచ్ఛగా కలగన్నాను. నిద్రే రక్షకభటుడు. స్వేచ్ఛగాగన్న నాకలే "సుకారీ, లంబాడీ, మరాటీ"—

—కవికొండల వేంకటరావు, బి.ఏ, బి.ఎల్.


# ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౨౫-వ తేదిని ప్రచురింపబడును.

చందా వివరము.

| | | |
|---|---|---|
| సంవత్సరమునకు | .. | రు. 3-౦-౦. |
| అర్థసంవత్సరమునకు | ... | రు. ౧-౮-౦. |
| నాలుగు మాసములకు | ... | రు. ౧-౦-౦. |
| విడిసంచిక | ... | రు. ౦-౪-౦. |

# ఫ్రాంక్ విన్‌ఫీల్డు వూల్‌వర్తు

[ఎట్టి పలుకుబడికాని లేని పేదవాడు. అప్పుతెచ్చి కొట్టుపెట్టినాడు. లోకమునందలి స్టోరుకీపరులలో మొదటివాడైనాడు. వ్రేళ్ళపై లెక్కింపదగు ప్రపంచపు కుబేరులలో నొకడైనాడు. ఔన్నత్యమున సాటిమేటిలేని ఆకాశమంటు ఆతని మందిరగోపురము ఆత డార్జించిన ధనమునకు, యశోధనమునకు చెఱుపరాని చిహ్నమై విలసిల్లుచున్నది. వూల్వర్తుజీవితమున వ్యాపార మొకగారడీ.]

మదరాసు మౌంటురోడ్డులోని రెన్ బెనెట్ కంపెనీవారు ఏర్పఱచి నిర్వహించుచున్న అరహాపాయి విలువగల వస్తువుల షాపును పలువురు చూచియుందురు. చైనాబజారులో చిన్న త్రోపుడుబండ్లపై వస్తువులను ప్రదర్శించి 'ఏసామానుఅయినను ఒకటిన్నరణా, ఏసామానుఅయినను రెండున్నరఅణా' ఇత్యాదిగా కేకలు వేయుచు సరుకులమ్ము నడదుకాణములను ఒకసారియైన మదరాసువచ్చినవారు చూచియేయుందురు. అయితే అట్టిమాదిరి దుకాణములకు - కొన్నివేలసంఖ్యగలవానికే యగుగాక - స్వానుదారుడైనవాడు ప్రపంచమెఱిగిన వణిక్పుంగవులలో నొకడు - ప్రపంచమెఱిగిన కోటీశ్వరులలో నొకడు - ప్రపంచమెఱిగిన ఆకాశమంటుట వరునకు నిర్మాతయై విలసిల్లుచున్నాడనుట నమ్మరానిదిగ నుండును. నమ్మరాని ఆవిషయమును చేసిచూపి ఫ్రాంక్ విన్‌ఫీల్డు వూల్‌వర్తు లోకాతీతపురుషుడగుచున్నాడు.

'ఒక్కవస్తువుకూడ పదిసెంట్లకు మించిలేదు. అమెరికా సంయుక్తరాష్ట్రములందును, ఆంగ్లదేశమునందున గల ఒకమోస్తరుప్రతినగరమునందును - ఒక్కవస్తువుకూడ పదిసెంట్లకు మించిలేదు - అను సైన్‌బోర్డుగల దుకాణముగలదు. వాని అన్నిటికిని వూల్‌వర్తు స్వానుదారుడు. ఆస్టోరులలో కొనబడిన ఒకవస్తువైనను కలిగియుండని గృహము ఆయాపట్టణములందు కలికమునకైన కానరాదనుట స్వభావోక్తియే. ఆ స్టోరులలోనికి ఏటేట నూరులక్షల పౌనులకుమించి ధనము ప్రవహించి వచ్చును. ఈవిశేషధనప్రవాహ మంతయు నెట్లు వచ్చును? ఆరుపెన్నీలు, అంతకును తక్కువ వెలగల వస్తువుల విక్రయముచేతనే.

లోకమెఱిగిన వ్యాపారవిజయకావ్యములలో అనేకరీతులచే వూల్‌వర్తుకథ అతివిచిత్రమైనది. ఈ వూల్‌వర్తునకు నేడు అమెరికాదేశమున 1932 దుకాణములును, గ్రేటుబ్రిటనునందు 486 దుకాణములును గలవు. చేత పైసాలేనివాడు - స్నేహితులైన విశేషముగా లేనివాడు అయిన ఒక వ్యవసాయదారుని కుమారుడు కష్టపరంపరలముఖస్థముననుండియు స్థాపించి జయకరముగ సాగించిన ఒకానొకదుకాణమే వీనియన్నిటికిని మాతృక. వస్తువిక్రేతగ తాను జయమందితీరుదునను గాఢనమ్మకమే ఆతొలుతటిదినములలో వూల్‌వర్తునకు ఉండినఆస్తి. పలురకముల వస్తువులు చౌకగ విక్రయించు అసంఖ్యాకదుకాణములకు తాను స్వానుదారుడగుటకు ఆదినములలో నాతడు స్వప్నములు గాంచువాడు. తుదకు ఆస్వప్నములు సత్యములైనవి. చనిపోవులోపల ఆవ్యవసాయదారుని కుమారుడు ఐశ్వర్యవంతమైన అమెరికాదేశములో న్యూయార్కుమహానగరమున ఔన్నత్యమునందు అసదృశమైన వూల్‌వర్తుటవరును నిర్మించినాడు. గగనమును చుంబించు ఈ బ్రహ్మాండమైన బురుజు - వూల్‌వర్తు స్థాపించిన స్టోరుల కాష్‌రిజిష్టరులలోనికి ప్రవహించివచ్చిన లక్షలకొలదియైన ఆరుపెన్నీల నాణెములవలని లాభముచేతనే నిర్మింపబడెనని తెలిసికొనినతోడనే ప్రతివారికిని 'అల్పమనునది అల్పముకాదు' అను నానుడి సత్యమైనదగుట ఎఱుకకు వచ్చును.

ఫ్రాంకువూల్‌వర్తు కథ, ఆరుపెన్నీల స్టోరు స్థాపించవలయునను ఆతని తీవ్రకాంక్ష జీవితపుటారంభదిన

ములలోనున్న ప్రతియొక యువకుడును అవశ్యముగ పఠించి కంఠస్థమొనర్చుకొనదగినది. దరిద్రమువలని కష్టనిష్ఠురములకు అన్నివిధములైన వానికి గురియై ఎట్టి పలుకుబడియులేని సామాన్యవ్యక్తి అపజయమునుండి జయమునుసాధించిన ఇట్టి మనోజ్ఞవృత్తాంతము మఱియొకటి ప్రపంచేతిహాసమునలేదు. ఇక్కడ చెప్పబడనున్న వూల్‌వర్తు కథ అంతయు చదివినమీదట ఏ యువకుడును—ఆతడెంతటిశోచనీయస్థితి యందుండుగాక-- తనకు జయమందుటకు తగిన వీల్పులేవని చెప్పలేకపోవును. ఏమనిన—రాగల కష్టమునుండి విడుమరగాంచుటకు ఎట్టివీలును లేకపోయినను దానికి ఎదురై నిలిచినవాడు ఎవడైన లోకమున ఉండుచో ఆతడు వూల్‌వర్తు ఒక్కడే. పుట్టుదరిద్రుడు - చనిపోవునరికి ఆతడొకకోటీశ్వరుడును, ప్రపంచప్రఖ్యాతపురుషుడును- ఆతని ఐశ్వర్యమునకు, యశమునకు అరుపెన్నీలస్టోరులే కారణము.


న్యూయార్కురాష్ట్రమునందలి రాడ్మాన్ అను ప్రదేశమునగల ఒకానొకకర్షకుని కుటీరమున ఆతడు జనించెను. ఆతనికి ఏడువత్సరములప్పుడు ఆతని తలిదండ్రులు ఆ రాష్ట్రమునందలిదేయగు గ్రేట్ బెండునకు కాపురము మార్చిరి. వారి మందిరము దరిద్రదేవతకు విహారమందిరమై యుండెను. ధైర్యమునందును, ఆత్మవిశ్వాసమునందును వూల్‌వర్తునకు ఏమాత్రము తీసిపోవుచాలుడైనను ఆ దినములలోని కుటుంబపరిస్థితులకు నిరుత్సాహమును పొంది బ్రతుకు గొడ్డేఅని భావించియుండును. అనంతరకాలమున ఆతడు ధనికుడైన పిమ్మట ఆతని జీవితమును లిఖితమొనర్చిన బి. సి. ఫార్బిస్‌తో ఆనాటి తమ దరిద్రస్థితినిగూర్చి ఆతడిట్లు చెప్పుకొనెను: "ఇవతాళించు శీతలవాతావరణముగల ప్రదేశమున నివసించుచున్నను నేనప్పుడు ఒక ఓవర్ కోటు కలిగియుండుట యెట్టిదో ఎఱుంగకుంటిని. స్కేటు (మంచుపై నడచియాడు క్రీడ) చేయుట అనునెట్టిదియో నాకు తెలియదు. ఏమన స్కేట్లుకొనుటకు మాకు ధనము లేకుండెను. గొడ్డుతోలుతో చేయబడిన ఒకజత బూట్లు ఏడాది తొడగవలసియుండెను. అవి ఆరుమాసములే మన్నునవి. మిగిలిన ఆరుమాసములును నేను జోళ్ళులేక ఒట్టికాళ్ళతోడనే తిరుగవలసియుండెను."

ఆతడు స్కూలులో చదువుకొను దినములలో సెలవుదినములందు పొలముపని చేయువాడు. కాని ఆ దినములలోకూడ ఆతనికి దుకాణము పెట్టవలయుననియు, అందుకు ప్రథమశిక్షణముగా ఏ దుకాణమునందైనగల్లాపెట్టెదగ్గఱ కూర్చుండి అమ్మకము నేర్చుకొను ఉద్యోగము సంపాదింపవలయుననియు కాంక్షయుండునది. పాఠశాలావిద్య ముగిసినతోడనే వూల్‌వర్తు ఒక వ్యాపారకళాశాలయందు శీతకాలపు తరగతులకు పోయి తరిబీయతు నొందెను. అనంతరము ఉద్యోగాన్వేషణమునకు గడంగెను.

ఆ దినములలో అమెరికాదేశము వివిధవ్యాపారములందు అత్యంతాభివృద్ధికి వచ్చుచుండెను. అట్టి పరిస్థితులలో ఉత్సాహవంతుడగు వూల్‌వర్తును ఉద్యోగిగా తీసికొనుటకు అనేకులు తయారుగనుందురను భావము మనకు కలుగును. కాని మనశక్తియుక్తులు ఇతరులు గ్రహించునటులు చేయుట ఒక్కొక్కప్పుడు అతికష్టమైయుండును. జీవితారంభముననుండు పలువురు పేదబాలురకువలెనే నాడు వూల్‌వర్తునకుకూడ తనశక్తియుక్తులు ఇతరులు గ్రహించునటులు చేయుట సుకరమైయుండలేదు.

తాను నివసించుచున్న గ్రామమునకు చేరువగల స్టోరులను అన్నిటిని ఒకదానివెంట నొకదానిని ఆతడు గాలించెను. కాని ఎందును ఆతనికి పనిదొరకలేదు. అయితే ఆతడు పుయిలోడలేదు. పట్టుదలపూనెను. వూల్వర్తు చరిత్రయొక్క సారమును ఒక్కమాటలో చెప్పవలసివచ్చో పట్టుదల అనిచెప్పిన చాలును. తుదకు అచటగల ఒక రైల్వేస్టేషనునందు జీతములేని అసిస్టెంటు స్టేషనుమాస్టరు ఉద్యోగము నాతడు సంపాదింపగలిగెను. వస్తువిక్రయముచేయు ఉద్యోగము సంపాదింపవలయునను ఆతని తీవ్రకాంక్ష ఇటుల తొలిసారి నెఱవేఱెను.


అసిస్టెంటు స్టేషనుమాస్టరు ఉద్యోగమునకును వస్తువిక్రయమునకు ఏమిసంబంధమని పాఠకులు ప్రశ్నింప



ఫ్రాంక్ విన్ ఫీల్డు వూల్ వర్తు



వూల్వర్తు టవర్ (న్యూయార్కు)



శ్రీయుత డాక్టరు, రావుసాహేబు
గారపాటి ఆంజనేయచౌదరిగారు



శ్రీయుత, డాక్టరు
తోలేటి కనకరాజుగారు, యల్. యం. యస్.

వచ్చెను. ఆదినములలో అమెరికాదేశమునందు చిన్న చిన్న తావులయందలి స్టేషనుమాస్టర్లు తమరైల్వేపను లకు తోడు ఇతరవ్యాపారముకూడ సాగించువారు. వూల్ వర్తు కాపురపు సెలవగు గ్రేట్ బెండునందలి స్టేషనుమాస్టరుకూడ రైల్వేపనికితోడు ఒక చిన్న చిల్లర దుకాణమును నిర్వహించువాడు. పలుసరుకులమ్ము ఆదుకాణము స్టేషనుకు అంటియున్న సామానులు తూచు షెడ్ న ఒకమూల ఉండునది. జీతములేకపోవుగాక అసిస్టెంటు స్టేషన్ మాస్టరుహోదాలో ఫ్రాంకువూల్ వర్తు ఆషాపులో పనికి కుదిరెను. వస్తువిక్రయముచేయు టలోగల తనముచ్చట తీర్చుకొనుట కాతనికి ప్రథమావ కాశము కలిగినది. సగటున రోజుకు కొన్నిషిల్లింగుల అమ్మకముమాత్రమే సాగునది. అది యొక ప్రారంభము మాత్రమే అయియుండెను. కాని ఆతనికి రైళ్ళలో ప్రయాణముచేయు జనులనుగూర్చి తెలిసికొనుటకు చక్కని అవకాశముండునది. ధనమార్జించుటకు అవి వృద్ధినందుటకు హెచ్చు అవకాశమునిచ్చు పనిని సంపా దించుట కాతడు కృషిసల్పుచుండువాడు.

ఇప్పటి కాతనికి ఇరువదియొక్కటవ వత్సరము. చేరువ పట్టణమున ఒకదానియందలి ఒకబట్టలషాపులో వస్తువిక్రేతగ ఆతడు కుదిరెను. ఈఉద్యోగమున ఖాయ పడుటకు ఆతడు మూడుమాసములు జీతములేక పని చేయవలసియుండెను. అట్లు జీతములేక మూడుమాస ములు పనిచేయుచు ఆక్రొత్తపట్టణమున జీవించుటకు ఏబదిడాలర్లుఅగును. అదృష్టవశమున ఆతనివద్ద ఆమొ త్తము ఉండెను. గత పదివత్సరములనుండియు ఆతడు పొలముపనివలన సంపాదింపకలిగినదానిలో వెనుకవేయ గల ప్రతిఒక్క సెంటును వెనుకవేసి చీమవలె కూడ బెట్టిన మొత్తము సరిగా ఏబదిడాలర్లు. ఆఉద్యోగము నిలుపుకొనుటకు ఆతడు మూడుమాసములవఱకు వార ము ఒక్కంటికి మూడున్నర డాలర్ల చొప్పున తన డబ్బు వెచ్చబెట్టుకొనుచు ఉండవలయును. తనదగ్గఱ గల లొడ్డులాసుకు సెలవైపోయిన మూడుమాసముల యనంతరము ఆతడు వారమునకు మూడున్నరడాలర్ల జీతముమీద పనిచేయవలసియుండును. మేఘములను నమ్మి చెఱువులోఉన్న నీటిని వ్యయపెట్టు పనికివలె ఇందును అపాయశంక హెచ్చు. ఏమన మూడుమాస ములు అయినతరవాత - చేతిచమురు కొస్తయు భాగవ తమైన తరువాత - ఆఉద్యోగము తనకు ఈయబడనిచో ఆతడు బికారియై యింటికి పోవలసియుండును. కాని జయమందదలచినవాడు ఇట్టి అభ్యర్థనాభంగభయము లను కొన్నిటిని ఎదుర్కొనవలసియుండునని సూక్ష్మ బుద్ధిగల వూల్వర్తు గ్రహించెను. కావున ఎదుర్కొనెను. 1873-వ సంవత్సరమున మార్చిమాసమున ఒకానొకదిన మున ఆభావికోటీశ్వరుడు తమపొలమునుండి ఒక బండి మీద క్రొత్తపనిలో ప్రవేశించుటకు ప్రయాణమయ్యెను. నేలమీద మంచు దట్టముగా కురిసియుండెను. దవడలు నొక్కుకొనిపోవునట్లు ఇవతాళించు శీతలము. తన తండ్రి అమ్మకమునకై మార్కెట్టునకు కొనిపోవుచున్న బంగా ళాదుంపల బస్తాలపై ఆత డామంచులో చలిగాలిలో కూర్చుండి ప్రయాణమున కారంభించెను. కోటికి పడగ ఎత్తిన ఆకుబేరుడు ధనసంపాదనమునకు తాను గావిం చిన ప్రథమప్రయత్నమునకు ఈపరిస్థితులలో ప్రయా ణము చేసెను.

రెండున్నరసంవత్సరములు గతించినపిమ్మట అతడు వారమునకు ఆరుడాలర్లు సంపాదించుచుండెను. వస్తు విక్రేతగా మంచి అనుభవమును సంపాదించుచుండెను. ఆసమయమున వారమునకు పదిడాలర్లు జీతముగల ఉద్యోగము మఱియొకతావున ఖాళీవచ్చినదని విని వూ ల్వర్థు దానికి దరఖాస్తుచేసెను. చేయుటతడవుగా అది ఆతనికి ఈయబడెను. మంచిజీతము. కాని వూల్వర్తు చాలకష్టపడవలసియుండెను. ఆతని ఈక్రొత్త యజ మాని మనహరిశ్చంద్రకథలోని కాలకౌశికునివంటి చండశాసనుడు. ఒక్కొక్కసమయమునందు వూల్వర్తు నిలువునక్రుంగిపోవువాడు. రెండు నెలలు పనిచేసిన తరు వాత ఆయజమాని వూల్వర్తు వారముజీతములో రెండు డాలర్లు తగ్గించెను. జీతములోకోత - ఎంతగ రెక్కలు ముక్కలు చేసికొనినను యజమానికి తృప్తికలుగకుం డుట: వూల్వర్తునకు అంతులేని మనోవేదన కలిగించెను. దానితో ఆతనికి వరములనిస్సత్తువ ఏర్పడి ఆరోగ్యము

పూర్తిగ చెడిపోయెను. ఇంటికిపోక తప్పినదికాదు. ఏడాదివఱకు ఆత డెట్టిపని చేయుటకును అసమర్థుడై యుండెను.

వారమునకు పదిడాలర్ల జీతమువచ్చుచున్నది గదా అను ధైర్యములో ఆతడు లోగడ వివాహమాడి యుండెను. ఈరోగమునకు తరువాత తానిక వ్యాపారమునకు పనికిరాననియు, తనకందు జయముకలుగదనియు నాతడు నిశ్చయించుకొనెను. కావున ఒకచిన్న పొలమును కొనెను. అందు తనభార్యసాయమున కూరలు పండించుట, కోళ్ళను పెంచుట మొదలగు డబ్బువచ్చు పనులను చేయుటకు కడంగెను. పొలము కొనుటలో పూర్వపు యజమానికి అంతడబ్బును ఇచ్చివేయలేదు. కొంత బాకీయున్నది. అది తీర్చుటకు వాయిదా ఈయబడెను. పొలముపనివలన ఆర్జించి ఆతడు కుటుంబమును పోషించుటతోడు ఈబాకీనికూడ తీరుమానము చేయవలసియుండెను.

నాలుగునెలలైనది. ఆతడు మొదటపనిచేసినవారు ఆతనికి తిరిగి ఆహ్వానముపంపిరి. వారమునకు పదిడాలర్ల జీతము. ఈఆహ్వానములో వూల్వర్తునకు అదృష్టరేఖ బయలుపడినదని చెప్పవచ్చును: వారమునకు పది డాలర్ల జీతము దొరుకుటచేతకాదు. ఆబట్టలదుకాణములో తాను విక్రేతగ జయమునందియుండుట ఆషాపువారు తెలిసికొనియున్నారని ఆతడెఱింగి తిరిగి తన శక్తియందు ఆతనికి విశ్వాసముకలుగుటకు కారణమగుటచేత. పొలముపని భార్యకు అప్పజెప్పినాడు. తాను షాపులో ప్రవేశించినాడు. కొంతకాలమునకు పిమ్మట పొలము వేఱె ఒకరికి అమ్మివైచి షాపు చెంతగల ఒక చిన్నఇంటిని తీసికొనిరి. ఏడాది తిరిగి వచ్చులోపల ఆదంపతులు ఏబదిడాలర్లు కూడబెట్టగలిగిరి. వారి దాంపత్యవృక్షమునకు సంతానఫలము కూడ కలిగినది.

కాని వూల్వర్తు జీవితము ఇంకను సుఖమెఱుగని సంతతపరిశ్రమయే ఆయిఉండెను. ఉదయము ఏడుగంటలు మొదలు రాత్రి పదిగంటలు దాటువఱకు గల్లా దగ్గఱకూర్చుండి ఒక్కటే వరుసను పనిచేయవలసియుండెను. ఇట్లు కష్టపడి ఆతడు వారమునకు పదిడాలర్లు ఆర్జించుచుండెను. ధనముకంటెను అప్పటి ఆతని ఆర్జనలో విలువయైనది కలుగుచున్న లోకానుభవము.. ఆ లోకానుభవమే 1879-వ సంవత్సరమున స్వతంత్రముగ వ్యాపారము ప్రారంభించుటకు ఆతనిని సమర్థునిగ నొనర్చెను. ఆ సంవత్సరములో ఆతడు బాల్యమున తాను స్వప్నములు గాంచుచుండిన అయిదుసెంట్లు (మూడుపెన్నీలు) విలువగల వస్తువుల షాపును న్యూయార్కుస్టేటుకు చెందిన యూటికాలో స్థాపింపగలిగెను.

ఆతడు ఉద్యోగమునకు కుదిరియున్న దుకాణములో ఈ పద్ధతిని ఒకసారి పరీక్షించియుండిరి. పలురకముల సరకులతో నిండినతొట్లు—వస్తువులతోసహా అయిదేసి సెంట్లు అని ప్రచురింపగా సంతరోజులయందు అవి కారపుకొనగల మాదిరిగా వెలబోవునవి. ఇది చూచి వూల్వర్తు యజమాని మూర్ అను పేరిటివాడు వెంటనే వూల్వర్తును ఆతడు కాంక్షించుచుండిన అయిదుసెంట్ల స్టోరును తెఱచునట్లు ప్రోత్సహించెను. వూల్వర్తు తెఱచుటకు ఉఱకలువైచెను. కాని డబ్బులేదు. ఒకషాపు తెఱచుపాటి ధనమును అప్పటికింకను ఆతడు ఆదాచేసి యుండలేదు. ఆ సంగతి నాతడు మూర్‌తో చెప్పెను. అందుమీద మూర్ అయిదుసెంట్లు విలువగల వస్తువులు డెబ్బదిపైనుల వఱకు క్రెడిట్ మీద ఇత్తునని చెప్పెను. అందులో మొదటి వూల్వర్తుస్టోరు పుట్టువునొందెను. కాని అది జయవంతముకాలేదు. 'ఏవస్తువ మూడు పెన్నీలకుమించి లేదు' అన్నదానికి ఎగబడుట ప్రజాలోకమున సమసిపోయెను. ఆశ అడగారగా, ధైర్యము సడలిపోవగా వూల్వర్తు మూర్ వద్దకు వచ్చెను. అయినను మూర్‌నకు వూల్వర్తుశక్తియందు నమ్మకము పోలేదు. పోయియేయుండునేని నేడీ ప్రకరణము వ్రాయుటకు అవసరమే లేకుండియుండును.

వూల్వర్తునకు ఆతడు ఇంకను హెచ్చుసరుకును అప్పుగా ఇచ్చినాడు. పెన్సిల్వేనియాయందలి లంకాస్టరునందు రెండవషాపు తెఱువబడెను. తెఱువబడుటయే తడవుగ ఈ షాపు జయలక్ష్మికి విడిదిపట్టు ఆయెను. దీనినిచూచి, ఎందఱో ఇట్టి షాపులను స్థాపించిరి. ఒకశ్రే

ధర వస్తువులుగల ఇట్టి షాపులు కుక్కగొడుగుల వలె కాగా ప్రజలకు వానియందు మోజు తగ్గిపోయెను. క్రమముగా అన్నిషాపులు మూతవడిపోయెను. వూల్వర్తు షాపుమాత్రము నిర్విఘ్నముగా సాగుచుండెను.

వూల్వర్తు తన మూడవదుకాణమును తెరచెను. అతని సోదరుడే అందు మేనేజరు. దీనికి రెండవదాని అంశపట్టలేదు. మొదటిదానివలె ఇదియు దివాలాయయ్యెను నేడు వూల్వర్తు షాపులు రెండువేలకు మించియున్నవి. కాని వీనికి మాతృస్థానము లనదగిన మొదటి మూడు షాపులలోను రెండు పూర్తిగా దివాలతీసెను. అగుగాక! తాను జయమందితీరెదనని వూల్వర్తు గాఢముగ నమ్మియుండెను. షాపు స్థాపనకు ఆ దినములు పూర్తిగా అనుకూలములై యుండలేదు. 'ఏ వస్తువయు అయిదుసెంట్లకు మించిలేదు' అను సైనుబోర్డుతో వ్యాపారము చేయుచుండిన సంస్థలన్నియు ఒక్కొక్కటిగా మూతవడిపోవుచుండెను. కాని వూల్వర్తు దృఢతరమగు ఆత్మవిశ్వాసము గలిగియుండెను. భావిచరిత్ర వలన అట్లు కలిగియుండుట ఒక ఈశ్వరాదేశమను కొనవలసియుండును. ఒకవేల వస్తువులమ్ము దుకాణదారులలో కెల్ల మిగిలి నిలిచినవాడు వూల్వర్తు ఒక్కడే అగుటకు ఎంతయో కాలము పట్టలేదు.

1880 లో తాను కొంతకాలము సెలవుపుచ్చుకొను పాటి ధనవంతుడనైతినను భావము అతనికి కలిగెను. సెలవుగొని జన్మనగరమునకు వచ్చినాడు. గొప్పవీరుని వలె సన్మానింపబడినాడు. తాను చేయవలసినపనిలో చాలభాగము గుమాస్తాలను పెట్టి చేయింపగలుగుపాటి ధనసంపద అప్పటికే అతనికి కలిగెను. కాని అతడు తన దీక్షాపరత్వమును తగ్గించలేదు. తనజయము ప్రవృద్ధమానమై వెలయుచుండుటకు తాను ఎప్పటివలె సడలని దీక్షతో పనిచేయవలసి యుండుననుట అత డెఱుంగును. కావున అతడు సడలని దీక్షతో పనిచేయువాడు. సోమరులు ఎచ్చటగాని జయమందిన నిదర్శనములు లేకుండుట అత డెఱుంగును.

పెన్సిల్వేనియా యందలి స్క్రాన్‌టన్‌నందు నాలుగవషాపు తెరువబడెను. దానికి అతని సోదరుడు మేనేజరు. ఆ సోదరుడు ఇప్పుడొక కోటీశ్వరుడు. ఆ స్క్రాన్‌టన్ షాపు నేటికికూడ విశేషవ్యాపారము చేయు వూల్వర్తు షాపులలో నొకటి. దీని జయము ఫిలాడెల్ఫియాలో నొక పెద్దషాపు తెరచుటకు వూల్వర్తును ప్రోత్సహించెను కాని ఫిలాడెల్ఫియా అంగడి జయపథము పట్టలేదు. నూరుపౌనుల నష్టముతో కొద్ది వారములలో ఆ దుకాణము మూసివేయబడెను. వూల్వర్తుయొక్క మొదటి ఐదుషాపులలో మూడు అపజయము నొందెను. సాధారణుడు పరిస్థితులు లాభజనకములుగ లేవని చెప్పివైచును. కాని వస్తువిక్రయమున తీరని అభిలాషగలిగి పరిశ్రమించుచున్న ఆ వ్యవసాయదారుని కుమారుడు అట్లు చెప్పనొల్లడు. చక్కగ కొనలుసాగుచున్న దుకాణములు తనకు రెండుగలవు. అట్టివి కనీసము ఒకవేయి ఆయినను కలిగియుండుటకు అతడు కృతనిశ్చయుడయ్యెను. కావున అతడు ఒకషాపు తరువాత మఱియొకషాపు స్థాపింప దొరకొనెను. ఒక్కొక్క షాపు నందును తన చుట్టమునో, నమ్మదగిన మఱియొకనినో నియమించువాడు. షాపుల జయనిర్వహణమునకు అతడీరీతిని మంచి పునాదులువైచువాడు.

యుద్ధము జయింపబడినట్లును; అపజయభయము, కష్టదినములు వెనుక పట్టినట్లును కనుపించెను. కాని మఱియొక దెబ్బ. న్యూయార్కు అను నొకపెద్ద పట్టణమున ఒకషాపు తెరువగా అది దివాలాయయ్యెను. మఱియొక ప్రయత్నమును అట్టిఫలమునే పొందెను. కాని వూల్వర్తు జంకలేదు. జయము చూపుమేరలో ఉన్నదనియే అతడు నమ్మెను. కావున పట్టుదల చూపెను. షిల్లింగు షాపుల తెరచెను. కాని నెగ్గలేదు. కాని ఈ షాపుల దివాలాలు అతని కొకలెక్కలోనికి రాలేదు. 'తప్పుచేయని వాడు ఏపనియు చేయజాలడు'అను సత్యము అత డెఱుంగును. కావున షాపులపెట్టు విధానమున తనకు మంచిదని తోచినవాని నెల్ల ప్రయత్నించిచూచెను. తఱచుగా విశేషధననష్టమునకు గుఱియగుచుండెను. కాని ప్రాయకముగా ఏదియో ఒకషాపు జనముల నాకర్షించి అతనికి విశేషధనమును గొనివచ్చి అతనికి కలిగిన నష్టమునుకూడ దీసి ఇతర ప్రయత్నములకు

వలయు మూలధనమును కూర్చుచుండునది.

క్రమముగ ఒక్కొక్కటిగ అతడు పలు షాపులను స్థాపించెను. ఈ షాపులన్నిటికిని సరిపడు వస్తువులను టోకుగా కొనుటకు న్యూయార్కుమహానగరమున ఒక చిన్నఆఫీసు నెలకొల్పు ధైర్య మాతనికి కలిగెను. ఆఫీసు నెలకొల్పుటలో అతడు ఆడంబరములకు పోలేదు. ఆడంబరములకు పోవు అపరాధముల నాత డెన్నడును చేయనేలేదని చెప్పవచ్చును. వారమునకు కొన్ని షిల్లింగులుమాత్రము బాడుగగల ఒక చిన్నగదిని అతడు గైకొనెను. ఇచ్చట అతడు దినమునకు పదు నాలుగు గంటలు పనిచేయువాడు. ఎక్కవుంటులు తానే వ్రాసికొనువాడు ; క్రొత్తపద్ధతులు ఆలోచించు వాడు ; తన షాపులకువలయు స్టాకు అంతయు కొను వాడు, క్రొత్తషాపుల నిర్మాణమునకు కడంగువాడు. అంతగ పనిచేయుటచే అతని ఆరోగ్యము పూర్తిగ చెడిపోయినది. ఎనిమిదివారములు మంచము పట్టెను.

అందుతో అతనికి తానుచేయుపనికొంత తన ఉద్యోగస్థులచే చేయింపవలసియుండుట తెలిసివచ్చెను. ఒకగొప్ప వ్యాపారమునకు తాను మంచిపునాదులు వైచినాడు. ఇతరులు దానిని క్రమముగా నిర్వహింప వలసినదినములు వచ్చినవి. క్రొత్తక్రొత్త పద్ధతులు ఆన్వేషించుట మాత్రము తనపని. ఆ వ్యవసాయదారుని పుత్రు డిపుడు తన వ్యాపారమునకుకూడ హెడ్డాఫీసులు, ట్రావెలింగు ఏజంట్లు, మానేజర్లు ఉండుట గమనించినాడు. షాపు తరువాత షాపు తెఱువబడు చుండెను.

పదిఏండ్లలో పండ్రెండు జయకరములైన షాపులను స్థాపించెను. అందు ఒక్కదానిలోకూడ ఆరుపెన్నీల విలువమించిన వస్తువు స్టాకు చేయబడియుండలేదు. తొలుతటి దినములనాటి కష్టము లాతని కిపుడులేవు. ఈ పండ్రెండుషాపులు తెఱచుటకు, వానిని స్టాకుతో నింపుటకు అతడు ఒక పెన్నీకూడ అప్పుచేయలేదు, అంతయు అతనుకూర్చిన ధనమే. పదమూడు మంచిసంఖ్య కాదందురు. కాని అతని పదమూడవ దుకాణము మొదటినుండియు జయపథమంటెను. అప్పటి వూల్వర్తు షాపు లన్నిటిలో అది పెద్దది. న్యూయార్కు చెంతగల బ్రూక్లిన్‌లో అది తెఱువబడెను. ఆదినుండియు అది లాభమే కలిగించుచుండెను.

జయమువలె జయమందునది మఱియొకటి లేదు. చికాగోలో మఱియొకబ్రాంచి. ఆ ప్రాంతములందు కూడ పలుషాపులు నిర్మింపబడెను. 1905-వ సంవత్సరమునాటికి తన వ్యాపారమును అతడు ఇరువదిలక్షల పౌనుల విలువగల ప్రయివేటుకంపెనీగా రిజిష్టరు చేయ గలిగెను. ఇదిఅంతయు క్రెడిట్ మీద తెచ్చిన డెబ్బది పౌనుల వస్తువులతో ప్రారంభింపబడిన వూల్వర్తు మొదటి షాపుయొక్క విస్తృతరూపమగుట మనము మఱువరాదు. 1912 నాటికి వూల్వర్తు షాపుల సంఖ్య ఆఱువందలు. అమెరికాఖండము నతిక్రమించి లండనునకును, గ్రేటుబ్రిటనునందలి ఇతరప్రదేశములకు ఆ వ్యాపారము ప్రాకుటకు ప్రారంభమయ్యెను. 1916 నాటికి అతడు ప్రపంచమునందలి పెద్దవర్తకులలో కెల్ల పెద్దవర్తకుడయ్యెను. ఏడాదికి అతని ఖాతాదారుల సంఖ్య 700,000,000. వారు అతని వివిధవిపణుల యందు ఏడాదికి క్రుమ్మరించు ధనము 20,000,000 పౌనులు. ఈ ధనమంతయు ఆరుపెన్నీల కూడికయే అనుట మనము విస్మరింపరాదు. అతనివద్ద పనిచేయు వారి సంఖ్య ఏబదివేలు. అట్లాంటిక్ మహాసముద్రము యొక్క అవ్వలి ఇవ్వలి తీరములయందు వేయికిమించి అతనిషాపులు వెలయుచుండెను. ప్రపంచేతిహాసమున ఇట్టిది అశ్రుతపూర్వము. ఆకాశమంటిన ఈ బ్రహ్మాండ వ్యాపారమునకు ధ్వజస్తంభమై ఆకాశమంటు బ్రహ్మాండపు బురుజు (టవర్) న్యూయార్కు నగరమున గ్రాలుచున్నది. గగనచుంబితములగు సౌధరాజములకు పేరుమోసిన న్యూయార్కు నగరమునందే ఔన్నత్యమున దానితో దొరయుపాటిది లేదనుచో ఇక ప్రపంచమున లేదని చెప్పనేల?

'ఏ వస్తువయు ఆరుపెన్నీలకుమించి లేదు' అను సైనుబోర్డుతో వ్యాపారముచేయు తన షాపులకు విశాలవిశ్వమున విశేషప్రకటన జరుగుటకుగాను ఫ్రాంకు విన్‌ఫీల్డు వూల్వర్తు ఈ వూల్వర్తు మందిరమును నిర్మిం

చెను. ఆ మందిరగోపురము న్యూయార్కు వీధుల మట్టమునకు 792 అడుగుల ఎత్తువఱకు లేచియున్నది. అది కట్టుటకు 2,500,000 పౌనులు వ్యయమయ్యెను. ఎన్ని లక్షల అరుపెన్నీలలోని లాభము గణించిన ఈ మొత్తమగునో ఒకసారి ఊహింపుడు. ఇవతాళించు శీతకాలమున చలి కాపుకొనుటకు ఒక ఓవరుకోటు కొనుకొనుటకైన డబ్బులులేని పేదరైతు బిడ్డడేదీని నంతను సాధించినవాడు. ఒకని పట్టుదలకు, ఉత్సాహమునకు, పరిశ్రమకు కలిగిన ఇంతటి చక్కని బహుమానము మఱి యేవణిక్పుంగవుని కథయందు కాని మనము కానము.

1916 నకు పిమ్మటకూడ వూల్వర్తు దుకాణములు సంఖ్యాబలమున పెరుగుచునే యుండెను. ఆ కంపెనీకి ఇపుడు ఆంగ్లదేశమునకూడ ఒక బ్రాంచిగలదు. ఆంగ్లదేశమునందలి వూల్వర్తుకంపెనీ వ్యవహారములకు ఆ బ్రాంచి కార్యాలయము జవాబుదారి వహించియున్నది. ఆంగ్లదేశమునందలి వూల్వర్తుషాపులలో అమ్మబడు వస్తువులలో నూటికి ఎనిబదియేడువఱకు ఆంగ్లదేశమున చేయబడినవే. అప్పటికి ఆంగ్లదేశమున 320 వూల్వర్తు షాపులుండినవి. ప్రస్తుతము ఆషాపులసంఖ్య అమెరికా దేశమున 1932 ను, ఆంగ్లదేశమున 486 ను అయి ఉన్నది.

ఈ షాపులలో ఒకడుకొనగల వస్తువులనుగూర్చి వివరింపబనిలేదు. ఆంగ్లదేశమునందును, అమెరికాదేశమునందును ఆ వస్తువు లెట్టివో ఆ బాలగోపాల మెఱిగియుందురు. ఒక్క అమెరికాదేశముననే వూల్వర్తు షాపులు ఒక సంవత్సరమునకు 50,000,000 జతల మేజోళ్ళను; 90,000,000 పౌనుల పెప్పరుమెంటులు మొదలగు కన్ఫెక్షనరీ సామగ్రిని అమ్మెను.

మనలను ఆశ్చర్యపారమునకు గొనిపోవు అంకెలు. ఈ అంకెలను గమనించిన అనంతరము తన మొదటి ఉద్యోగమునకు బండిలో బంగాళాదుంపల బస్తాలమీద కూర్చుండి వణుకుబుట్టించు చలిలో ప్రయాణమై వెళ్ళిన ఆ రైతుబిడ్డను జ్ఞప్తికెలయించుకొనుడు. వ్యాపారము కూడ విచిత్రమైన ఒక గారడీయనుట మీకు ఇపుడు తోచుటలేదా?



## ఓ కవీ!

౧

విశ్వమంతా ఒకే
వేణుగానమై న్నన
తానవర్ణాలు - పా
షాణాలు పాడవా?

౨

జగమే మహాప్రేమ
సామ్రాజ్యమేద్యైన
నాలేడి పులిబొబ్బ
లాలించి చచ్చునా?

౩

లోకమంతా ఒకే
లోలాక్షి కంటేను
ఎంకి అంతఃపురా
లేల కుండేనా?

౪

ప్రకృతి యే అన్నపూ
ర్ణాదేవి యాయెనా?
ఈ బిక్షుకుడు తిండి
కే మాడి చచ్చునా?

౫

రూపులన్నీ స్వామి
కాపురాలే ఐతే;
రారాజు నీనేస్తు
డై రాక పోవునా?

౬

కలలందు స్వర్గాలు
గట్టేటి ఓకవీ!
ఆడకోయీ! అబ
ద్ధాలు ముమ్మాటికీ
పాడకోయీ! వెఱ్ఱి
పాట లేనాటికీ.

—తురగా వేంకటరామయ్య.

జి
జ్ఞా
స

విజ్ఞానసంపాదనావసరమున అనేకవిషయములందు తప్పక కలుగు సందేహములను నివారించుకొనుటకు పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటవలని మీమాంసచే వారివారి సందేహములు తీరుటయేగాక సామాన్యపాఠకులకుకూడ విజ్ఞానముకలుగును. కావున ఆంధ్రభూమిపాఠకులు వివిధవిషయములందు తమకు కలుగు సందేహములను ఈ జిజ్ఞాసపుటయందు ప్రచురింప బంపుచుండ ప్రార్థన. —సంపాదకుడు.

**16. 'మౌంటు ఎవరెస్టు.' అను పేరు.**

ప్రపంచమునందలి పర్వతశృంగములలో అత్యున్నతమైనది హిమాలయము నందలి మౌంటు ఎవరెస్టు అని చెప్పబడుచున్నది గదా. హిమాలయమునందలి మఱికొన్ని శిఖరములకు గౌరీశంకర, కాంచనగంగ ఇత్యాది హైందవనామములుండగా దీనికి ఈ హూణనామము ఏల, ఎప్పుడు, ఎట్లు కలిగినది ?

—జోశ్యుల విశ్వనాథము.

**17. తేనెటీగల బెంచుట**

ఆంధ్రదేశమున మధుమక్షికాపాలనము (తేనెటీగలను బెంచుట) ఎచట జరుగుచున్నది.

—ఆర్. రామయ్యగౌడు.

**18. ఆంధ్రమున ప్రథమముద్రిత గ్రంథము**

తెలుగుభాషలో మొట్టమొదట ముద్రింపబడిన గ్రంథనామమేమి ? కర్త ఎవరు ? ముద్రణాలయము పేరేమి ?

—జీ. గంగాధరశాస్త్రి.

**19. అధమర్ణుల ఆందోళన**

అప్పు యిచ్చినవారిపై పుచ్చుకున్నవారు రేపుచున్న ఆందోళన దేశాభివృద్ధికి అనుకూలమా ? ప్రతికూలమా ?

—యస్. ఆర్. శ్రేష్టి

**20. కోడక్ ట్రేడుమార్కు**

జూన్ మాసపు ఆంధ్రభూమిలోని 'జార్జి ఈస్టుమాన్' కథ చాల ఆహ్లాదకరముగ పఠించితిని. ఆతని ట్రేడుమార్కు అగు 'కోడక్' ఆతని తల్లిపేర పెట్టబడినదని వినియున్నాను. నే విన్నది నిజమేనా ? నిజమే అయినచో అది ఆతని మాతృభక్తికి ఒక నిదర్శనముగా చెప్పవచ్చునా ?

—దామరాజు వెంకటరత్నము, బి. ఏ.

**21. గతవత్సరమున ముఖ్యమగు తిథులు**

1933-లో అంతర్జాతీయ సమస్యల దృష్టిలో చూచినచో అతి ప్రాముఖ్యము వహించిన అయిదారు తేదులను ఏర్పఱచి చెప్పవచ్చునా ?

—సామవేదము శేషగిరిరావు.

**22. బొబ్బిలిరాజాగారివంటి యువకమంత్రి**

మనరాజధాని ప్రస్తుత ప్రధానమంత్రులగు బొబ్బిలిరాజాగారు ఇంతకు పూర్వము ఇచట మంత్రులుగాఉన్న అందఱికంటెను యువకులని చెప్పబడుచున్నది. ఆంగ్లమంత్రులలో ఇంత చిన్నతనమున మంత్రిత్వము వహించిన వారెవరైన గలరా ?

—దామెరలచ్చారావు.

**23. నిజాము రాష్ట్రములోని తెలుగుజిల్లాలు**

నిజామురాష్ట్రములోని తెనుగు జిల్లాలు ఎన్ని ? వానివాని జనాభా లెంతెంత ? బ్రిటీషు తెలుగు జిల్లాలకంటె ఖనిజసంపదయందు ఇవి హెచ్చు అనవచ్చునా ?

—రెంటాల సీతారామస్వామి.

మీ
మాం
స

జిజ్ఞాసపుటను పఠించినమీదట అందు ఏఒక్కదానికైననుసరే తమకు సరియైన సమాధానము తెలిసియున్నచో దయచేసి దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి మా కార్యాలయమునకు పంపవలసినదిగ ఆంధ్రభూమిపాఠకమహాశయులను ప్రార్థించుచున్నాము మీమాంసలను వ్రాయునపుడు జిజ్ఞాసయొక్క నెంబరు, ఆసంచికయొక్క నెల సూచించుట ముఖ్యము.

—సంపాదకుడు.

### 1. ఆంధ్రలిపి ఉత్పత్తి

ఇప్పటి తెలుగులిపికి అంతగా భిన్నము కాని తెలుగులిపి పండ్రెండు పదమూడు శతాబ్దులనుండి యేర్పడియున్నది. అనగా ఇప్పటి తెలుగులిపి చదువనేర్చినవాడు అధిక ప్రయత్న మక్కఱలేకుండ పండ్రెండు పదమూడు శతాబ్దుల తెనుగు శాసనలిపిని చదువగలడు. కాన నేటి తెనుగులిపి పండ్రెండు పదమూడు శతాబ్దులనుండి యేర్పడినదన వచ్చును. పండ్రెండవ శతాబ్దినుండి పూర్వమునకు పోనుపోను తెలుగులిపి మారుపాటు చెందుచుండును, అట్లు జరుగుచుండు మారుపాట్లను పూర్వపూర్వములకు గుర్తించుచుపోయినచో మన తెలుగులిపి (ఆంధ్రకర్ణాటకలిపి) ద్రవిడ, పల్లవ, దేవనాగరి, బ్రాహ్మీలిపులనుకూడ కలుపుకొని ఆశోకలిపితో ఐక్యమందును.

—పరిశోధకుడు.


### 2. ప్రదీపముయొక్క ఛాయను కూర్చుండుట

దీపముయొక్క క్రీనీడను అలక్ష్మీస్థానములలో నొకటిగా పరిగణించిన మనపెద్దలు అచట కూర్చున్నచో ఆయుఃక్షయ మగునని చెప్పియుండిరి. ఇందు ప్రత్యేకము ఏమియు యుక్తిలేదని చెప్పవలసియున్నది. దీపపు క్రీనీడను ఉండుటవలన తేలు మొదలగు పురుగు పుట్రలవలని ప్రమాదములు కలుగుటకు అవకాశములు హెచ్చు. శరీరమునకు బాధకలిగించునది యేదియైనను ఆయువును తగ్గించునట్లే చెప్పవలసియుండును. బాధాకరములగు ప్రమాదముల సంఘటమునకు అవకాశము ఎక్కువగనుండు దీపపుఛాయయందు జనులుండకుండ చేయుటకుగాను వారికి ఉండగల భయములకన్నిటికిని పెద్దదియగు ఆయుర్దాయభంగభయమును మన పూర్వులు కల్పించిరనవచ్చును —సాధకుడు.

### 11. జర్మనీలో స్వాస్థికచిహ్నము

అసలు స్వాస్థికచిహ్నము ఆర్యసంతతులకు చెందినది. సూర్యునకు అదియొక చిహ్నముగ అంగీకరింపబడియున్నది. ఆంగ్ల వర్ణసమామ్నాయమునందలి 'యస్' అను అక్షరముల గుర్తులు రెండుతీసికొని ఒకదానిపై నొకటి-ఒకటి నిలువుగాను ఒకటి అడ్డముగాను-నిలిపినచో ఏర్పడు ఆకారమే స్వాస్థికచిహ్నము. పూర్వార్థగోళమునందును ఉత్తరార్థగోళమునందును అది అతిప్రాచీనకాలమునుండియు నొక అలంకారముద్రగా అంగీకరింపబడియున్నది. ఏజియనుల, గ్రీకుల మృణ్మయపాత్రల మీదను ; ఈజిప్టునందలి చిత్రపు పనులయందును ఈ గుర్తులు కనుపించుచున్నవి. కాని సూర్యోపాసనతో దీనికి ప్రత్యేకసంబంధముకలదు. హిందూదేశమున కానవచ్చు సూర్యోపాసకులకు—సౌరపతులకు—సూర్యవిషయికమైన మూడు ప్రత్యేకచిహ్నములు గలవు. అందులో ఒకటి-రెండు చంద్రవంకలపై నడుమ గీతగీయబడిన ఆకారమునందును. స్వాస్థికచిహ్నము ఈ ఆకారమునకు మెఱుగులుదిద్ది ఏర్పఱచినదని చెప్పవచ్చును.

—రేపాక జగన్నాథము.




# బర్మాయందలి ఆంధ్రులు: కొన్ని సమస్యలు

రంగూనులో కాలుపెట్టినతోడనే ఇచట మనకు ఆంధ్రకార్మికుల జీవితవిధానమున కనిపించునది వారి బ్రహ్మచారి జీవితము. అసలు వీరు సాధారణముగ స్వదేశమున అప్పుపడిపోయి దానిని తీర్చుకొనుటకుగాను ఇచటకు వత్తురు. వచ్చువారు కుటుంబములను తీసుకొనివచ్చు ఆచారము ఈ వఱకు లేకుండుట, తీరావచ్చినతోడనే పని దొరకదేమోనను భయము ఈ కారణములచే బర్మావచ్చువారు సాధారణముగ కుటుంబములను స్వదేశములందే విడిచివత్తురు. కుటుంబజీవితమునకు వెలియై పలుమాసములు నివసింపవలసియుండుటలో పలువురు చెడునడతలలోపడి శరీరారోగ్యమును చెఱచుకొనుచుందురు. సంఖ్యాబలమును పట్టిచూచినచో హిందూస్థానీ వాళ్ళకంటెను, బెంగాలీలకంటెను, అరవవాళ్ళకంటెను బర్మాలో ఆంధ్రులే ఎక్కువ. కాని కుటుంబజీవనవిషయములో గాని, పలుకుబడి విషయములోగాని, భాషావిషయములోగాని, గౌరవ విషయములోకాని కడమజాతులు అందఱికంటె ఆంధ్రులు శోచనీయస్థితి యందున్నారనుట ఇష్టము లేకపోయినను ఒప్పుకొనకతీరదు.

నేను బర్మావచ్చి ఆరుమాసములైనది. ఈ ఆరుమాసములును నేను బర్మాలో కలుసుకొనుచున్న ప్రతి ఆంధ్రనాయకుని వద్దను ఈ విషయములు ప్రస్తావించుచునే ఉన్నాను. ఈ శోచనీయస్థితిని తొలగించుటకు వారును ఆతురులే యైయున్నారు. కాని మార్గము మాత్రము పొడగట్టదు.

కుటుంబజీవనవిషయములో మనవారి శోచనీయస్థితి కొంచెము విపులముగ చెప్పెదను. బర్మా అంతటికినిగల అరవల సంఖ్య 84,327 మంది. అందు మగవారు 58,823; ఆడువారు 25,504. అనగా నూర్గురు మగవాళ్లకు 43 గురు ఆడువాళ్లు కలరన్నమాట. ఇక ఆంధ్రులసంగతి గమనింపుడు. బర్మా అంతటికిని తెలుగువారి సంఖ్య 131727 మంది. అందు మగవారు 108701; ఆడువారు 23026. అనగా నూర్గురు మగవాళ్లకు 21 మంది మాత్రమే ఆడువాళ్లు కలరన్నమాట. పదిమంది మగవాళ్ళకు ఇద్దరేసి మాత్రమే ఆడువాళ్ళు ఉన్నప్పుడు స్త్రీపురుషసంబంధము నియమబద్ధమై యుండుననుటకు అవకాశము గలదా? ఒక్క రంగూను పట్టణమునకుచెందిన అంకెలను మాత్రము తీసికొని ఈస్థితి ఎట్లున్నదో చూచెదము. రంగూనులో అరవవాళ్ళు 38,450 మంది. అందు మగవారు 23,354; ఆడువారు 15096—నూర్గురు మగవారికి అరువదియైదుగురు ఆడువారువంతున గలరు. ఇక తెలుగువారు 68,591 మంది. అందు 57,388 మంది పురుషులు, 11203 మంది మాత్రము స్త్రీలు. వందమంది పురుషులకు ఇరువదిమంది స్త్రీలు బర్మా మొత్తముమీదకంటె ప్రత్యేకము రంగూనులో అరవవారికి ప్రతినూర్గురు

పురుషులకును కొంచెము హెచ్చుసంఖ్య స్త్రీలుండగా తెలుగువారికి ప్రతినూర్గురు పురుషులకుగల స్త్రీల సంఖ్య కొంచెముతగ్గియున్నది బర్మాలోగల ఆంధ్రులు సాధారణముగ మంచి యౌవనములో నున్నవారు ఏమన యౌవనములో నున్నవారే చోఅవగ దేశమునువదలివచ్చి కాయకష్టముపడుటకు సమర్థులు, సముత్సాహులునై యుందురు జనాభాలెక్కలుకూడ ఈ విషయముననే నిరూపించుచున్నవి. ఆంధ్రకార్మికులలో చాలమంది ఇరువదియేండ్లకు పైబడి నలుబదియేండ్లలోపువారే అయిఉన్నారు. అట్టి నడివయస్సులో ఇట్టి శోచనీయపరిస్థితులలో నుండుటచే వారు చెడునడతలకుపాలై శరీరమును రోగమందిరముగా చేసికొనుచుండుచో ఆశ్చర్యము లేదు అరవలు కుటుంబములను తెచ్చుకొని జీవించుచుండగా మనవారు ఇంకను అందులకు ఎందుకు పూనుకొనకున్నారో నాకు తెలియకున్నది.

ఇక పలుకుబడి విషయములో ఆంధ్రులకు, అరవలకుగల తేడా గమనింపుడు. రంగూనులో ప్రతి ఎనమండుగురు మనుష్యులలోను ఒకడు తెనుగువాడు, పదునార్గురు మనుష్యులలోకాని ఒక అరవవాడు కనిపించడు అయినను పలుకుబడి విషయములో అరవవాడిదే పైచేయిగా ఉన్నది. బర్మా మొత్తముమీద అరవము మాటలాడే వారి సంఖ్య 184,107 మంది, తెనుగు మాటలాడే వారిసంఖ్య 160,610 మంది. పదివేలమందిలో 126 గురు అరవము మాటలాడగలరు. తెలుగు మాటలాడు వారిసంఖ్య ఆ పదివేలింటికి 110 మాత్రమే సంఖ్యాబలమునందు తగ్గియున్నను అరవవాడు భాషాబలమున తెనుగువాడిని తలదన్నినాడు. ఇది వాని పలుకుబడికి ఒకగొప్ప నిదర్శనము.

భాషాభిమానము విషయమున కూడ బర్మాఆంధ్రుడు బర్మాఅరవవానికి తీసిపోవుచున్నాడని చెప్పవలసి వచ్చినందుకు తెనుగువాడినైన నాకే సిగ్గుగాఉన్నది. కాని నిజము ఒప్పుకొనకతప్పదు. ఏడాదికి జపానునందు ఇరువదివేలును, గ్రేటుబిటనునందు పదునాలుగువేలును, మదరాసు రాజధానియందు నాలుగువేలును గ్రంథములు ప్రచురింపబడుచున్నవని వినియుముగదా. 1911-20 లోపల 74 గ్రంథములును, 1921-30 లోపల 65 గ్రంథములును బర్మాలో అరవవాడు ప్రచురించినాడు. బర్మా ఆంధ్రుడు వరుసగా 2ను 4ను గ్రంథములు మాత్రము ప్రచురించినాడు. పుస్తకముల విషయముననే గాక పత్రికలవిషయమునకూడ ఇచటి తెలుగువాడిట్టిశోచనీయస్థితియందే యున్నాడు. ఇచటి తెలుగువారికి చెప్పదగిన పత్రిక 'ఐరావతి' ఒక్కటియే. అరవవారికి పలుపత్రికలుగలవు. పత్రికలు చదివి లోకజ్ఞానమును పెంపొందించుకొని అరవవాడు చోఅబారి కార్యదక్షుడు, కార్యశూరుడు అయి బాగుపడుచున్నాడు; తన ఉనికి ఇతరులు గుర్తించునట్లు చేయుచున్నాడు. తెనుగువాడు కోరంగీఅని, నరసాపురీఅని పిలువబడుచు తన సంఖ్యాబలమునకు తగిన పలుకుబడిలేక అటుమటించుచున్నాడు.

వ్యాపారమునందును, పలుకుబడియందును, తెలివితేటలయందును రత్నములనదగిన ఆంధ్రనాయకులు కొందఱు బర్మాయందుండబట్టిగాని లేనిచో అచటి ఆంధ్రునిస్థితి ఇప్పటికంటె ఎంతయో శోచనీయస్థితియందుండియుండును. ఆనాయకులకు ఆంధ్రులతరపున నానమస్కారములు. —పి. వీరాస్వామి.

# "తాకితే మూగవాళ్ళు"

౧

వారిలో ఒకఆమెపిల్ల గుండుపూరుగ - బంగారువన్నెతో వెలిగిపోతుంది. పిల్లలకు పిల్లలను చూపించినప్పుడు - హిందూ మహమ్మదీయుల మాదిరి - చేతులు చేతులు కలుపుట అలవాటు. వన్నె, శ్యామలలు చాచుకొన్నచేతులతో ఆహ్వానించుకుంటూ ఉన్నప్పటికి వకుళ 'మాపిల్లను తాకనివ్వొద్దు' అన్నది.

అవ్వ—ఆపిల్లకు పుండాబూచా? తాకితే ఏం?

వకుళ—మాటలురాని పిల్లలు తాకొ్కంటె మూగవాళ్ళవుతారుగా?

అవ్వ—ఆఁ! నిజమే!

వన్నెతల్లి కోరచూపులతో కొంతసేపుంది. కపటపు నవ్వులకు తరుగులేదు—అచట వున్నవారు యీ కపటనాటకమును గమనించలేదు—వూరి అమ్మలక్కల పుట్టు పూర్వోత్తరాలు సిద్ధాంతరాద్ధాంతములుగ వాదించుకొని, సాయంకాలము యెసళ్ళుపెట్టే వేళకు ఇళ్ళకు వెళ్ళారు.

మరునాడు వూరి సుబ్బ వకుళవద్దకువచ్చి 'వన్నెను మీ పిల్లను తాకనివ్వొద్దు అన్నావటనే?' అన్నది.

వకుళ—అవును! మాటలురాని పిల్లలు తాకొ్కగూడదుగా?

సుబ్బ—'మాపిల్లకంటె వాళ్ళపిల్ల అందగత్తా? వాళ్ళపిల్ల మాపిల్ల అంతయెరుపు ఉందా! ఆపిల్లకి బుజ్జిముక్కు; దొడ్డికాళ్ళు; మాపిల్లతాకితే అవి చక్కనవుతవిగావాల?' అని వెన్నెతల్లి అంటూవుంది.

వకుళ—మాపిల్ల అందగత్తెఅని వారితో మేము చెప్పలేదు. మాపిల్లను వారి పిల్లవాడికి చేసుకోవద్దులే! నీకు తెలియదటమ్మా! మాటలురాని పిల్లలు తాకొ్కంటే మూగివాళ్ళవుతారని?

సుబ్బ—అవును!

వకుళ—అందుకోసమే! అన్నాను. గాని,...మాపిల్ల చక్కని చుక్కని చెప్పలేదే! మొన్న లక్షుమ్మ పిల్ల మాపిల్లను తాకబోతే తాకనివ్వకమ్మ!... మూగివాళ్ళవుతారంది. నేనేమన్న కోపగించుకొన్నానా? వాళ్ళను నేను యేమన్నాను, గనుక యింతరచ్చ చేయాటమునకు...

సుబ్బ—పనిపాటలు లేకపోవటమే ...ఇరుగు పొరుగువారితో చెప్పటమే కాదు, వన్నెతండ్రితో ఏం చెప్పిందో చెప్పిందట ఆయన 'మాపిల్లను యెందుకు తాకనివ్వొద్దు? అన్నారు. మమ్మలను యెలిపెట్టినారా? నేను పోయి అడిగివస్తాను ఉండ' మని బయలుదేరాడట. కింబడివున్నవారు ఇదియేమంత గొప్పసంగతి. పోయి యేమని అడుగుతావు. మాటలు రాని పిల్లలు తాకొ్కగూడదని నీకు మాత్రం తెలియదా? అంటే ఉగ్రుడైనవాండంతా చల్లబడ్డాడట.

వకుళ—మేము యేమిమాట్లాడినా ఇట్లు పెడఅర్థాలు చేస్తారు. వీరికి చదువువచ్చిఉంటె వ్యంగ్యకవిత్వము వ్రాసి దేశానికిమేలుచేసేవారె! యీ గొడవ నాకెందుకులే! తగులాడుటకు నాకు వోపికలేదు.

సుబ్బ—డబ్బుగల పిల్లకాయలు ఏమంత అందంగా వున్నారు. పదిమందివాళ్ళను గౌరవిస్తూ చంకకెత్తుకొంటూవుంటే, వారికి రూపముజాస్తి అవుతుంటుంది. కట్నాలుజాస్తియిచ్చి పెళ్ళిళ్ళుచేస్తారుగాన, అప్సరసలుఅని వెంకమ్మఅంది.

వకుళ—యింక యీ విషయము నాతో మాట్లాడవద్దు.

సుబ్బ—పిల్లలను పిల్లలుతాకొ్కంటె యీపిల్ల చస్తుందా? ఆపిల్ల చస్తుందా? అని కామమ్మ అన్నది.

వకుళ—(కళ్ళ నీళ్లుపెట్టుకొంటూ) ఎవరిపిల్లలు చావవద్దు......అందరు చల్లంగా ఉంటేచాలును—తెలివితక్కువగా మూఢాచారమును నేను పాటించినందుకు యింతవచ్చింది. పనిపాటలు లేనివారికి ప్రొద్దుపోవుటెట్లు? దేనికో ఒకదానికి కాలునువ్వచుండాలి. చదువు సంధ్యలువచ్చి దేశముబాగుపడినా? అర్థములేని మూఢాచారములు పోవాలి. ఒక విషయములో సందేహమువస్తే ముఖాముఖిగ మాట్లాడి తీర్చుకోవాలి. కాని, యిరుగుపొరుగు వాళ్ళ దగ్గర మాట్లాడి గోరంతలు చేసికోకూడదు—

ఇట్లుఅంటూ వకుళ లోపలికివెళ్ళింది.

—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

# మణిమాల

## హిందూదేశమున ఆంగ్లవిద్యారంభము.

"హిందూదేశాధిపత్యమును వహించిన క్రొత్తలో ఈస్టిండియాకంపెనీవారు ఈ దేశమున ఆంగ్లభాషను ప్రవేశపెట్టు అభిప్రాయములేకుండ నుండిరి. అప్పటి హిందూదేశపు ప్రఖ్యాతరాజప్రతినిధులలో నొకడగు వారన్ హేస్టింగ్సనువాడు ఈ ప్రాగ్దేశపు సారస్వతమనిననూ, ఇచటి మతవిధులనినను అమితమగు అభిమానము, గౌరవమును. ఇచటి ప్రాక్తనవిద్యావిధానమును పునరుద్ధరించి ప్రభుత్వమువారి రక్షణమున దానిని సక్రమముగ నడిపి ప్రజల ఆచారవ్యవహారములలో సాధ్యమగునంతవఱకు జోక్యము కలిగించుకొనకుండుట అతని పద్ధతి. 1813-వ సంవత్సరమునందు శాస్త్రవిద్యాభివృద్ధికి లక్షరూపాయిలు ప్రత్యేకించుచు చేయబడిన శాసనముకూడ సంస్కృత, అరబిక్ భాషల శాస్త్రగ్రంథముల పెంపొందించుటకేయని తలంపబడినది. 1814-లో ఈస్టిండియా కంపెనీవారి కోర్టు ఆఫ్ డైరెక్టరులు ఇండియాగవర్నరుజనరలున కిట్లు వ్రాసిరి: "అనుఖ్యాతముగవచ్చుచున్న విద్యావిధానము నే వారలను అవలంబింప నీయవలసినది. ఇండ్లయందే విద్యాభివృద్ధి గావించుకొను వారిపద్ధతిని కూడినంతవఱకు ప్రోత్సహించుచు అవసరమగుచో ధనసహాయముచేయునది." ఇట్లు భారతదేశమున ఆంగ్లవిద్యాభ్యాసనకాంక్ష ప్రభుత్వమువారివలన పెంపొందింపబడలేదని చెప్పవచ్చును. 1816-లో కలకత్తాయందు గడియారముల వర్తకము చేయుచుండిన డేవిడ్ హేర్ అను ఆంగ్లేయుడును, రామమోహనరాయలును కలిసి భారతీయులలో ఆంగ్లభాషాభ్యాసనమును రేకెత్తించుటకు హిందూకాలేజీని స్థాపించిరి. ఈక్రొత్తవిద్యాసంస్థను క్రైస్తవమిషనరీలును, హిందూ పూర్వాచారపరులును కూడి అనూయాదృష్టులతో చూచువారు. పదునైదు వత్సరములకు పిమ్మట బెంగాలునందలి పబ్లికు ఇన్‌స్ట్రక్షను కమిటీవారు తమనివేదికలో ప్రజలకు ఆంగ్లభాష నభ్యసింప తీవ్రకాంక్ష కలిగినదనియు, హిందూకాలేజీలో తయారై వెళ్ళిన యువకులు స్వతంత్రపాఠశాలలను పలుతావులయందు స్థాపించుచుండిరనియు తెలిపిరి. బొంబాయిలోని ఎల్ఫిన్‌స్టన్ విద్యాసంస్థ అచట ప్రభుత్వము చేసి 1827లో తిరిగి స్వదేశమునకు వెళ్ళినవాని పేర నెలకొల్పబడెను. హిందూదేశపు ఆంగ్లవిద్యారంభచరిత్రలో మిక్కిలి చిత్రమైనది కలకత్తాయందలి వైద్యకళాశాల సంస్థాపనము. అది 1835 లో స్థాపింపబడెను. ఐరోపాఖండమునందు అప్పట్లో అమలునందున్న వైద్యవిద్యాపద్ధతి ననుసరించి భారతదేశమునగూడ వైద్యవిద్య బోధించుట ఆ కళాశాలా స్థాపనోద్దేశము. ఈ కళాశాలకు పురిటిలోనే సందుకొట్టునని పలువురు తలంచిరి. ఏమన హిందువులలోని ఉత్తమకులమువారు శవమును తాకుటకు ఆచారమొప్పదు. కాని మధుసూదనగుప్త అనుమానసీయుడు ఆఆచారము నతిక్రమించి శవమునుతాకి దానిని డైసెక్టుచేయుటకు దొరకొనెను. దానితో క్రమముగా ఆ ఆచారముయొక్క బిగి సడలిపోయెను."

—ది ఎడ్యుకేషనల్ రెవ్యూ.

* * * *

## ప్రపంచమున మొదటి అచ్చుకూటము.

"నేడు ప్రపంచమున అచ్చుకూటములు సర్వసాధారణమైయున్నవి. కాని అయిదువందల ఏండ్ల క్రితము ప్రపంచమున కంతటికిని ఒకటే అచ్చుకూటము ఫ్రాన్సులో ఉండునది. దానిని కనుగొని నిర్మించినవారు అల్లుడు, మామలు. మామపేరు ఫాస్టు; అల్లుని పేరు స్కోఫర్. నివాసము మెన్జు అనుచోట. వారు ముద్రించిన ప్రథమపుస్తకము కీర్తనల పుస్తకము. అది 1457 లో ముద్రింపబడెను. అంతకుపూర్వముకూడా వారు పుస్తకములు ముద్రించకపోలేదు. కాని ఆముద్రించిన పుస్తకములను వ్రాతగ్రంథములే అని చెప్పి వారు అమ్ముచుండిరి. అవి ముద్రితగ్రంథములని ఎల్లరకు తెలిసినచో

ముద్రాయంత్రముయొక్క ఉనికి తెలిసికొని దానివంటి యంత్రమును తాముకూడ నిర్మింప ఇతరులు ప్రయత్నింతురని వారిభయము. ఈకీర్తనల పుస్తకమును కూడ వారు వ్రాతగ్రంథముగనే అమ్మజూపిరి ఎంతకాలమునకు వారు అట్లే అమ్ముటకు నిశ్చయించిరి. కాని ప్రభుత్వమువారి నిర్బంధముచే వారు అచ్చుకూటముయొక్క సంగతిని చెప్పక తప్పినదికాదు. బైబిలు ముద్రణమునకు వారు 1450 లో ప్రారంభించి 1460 లో పూర్తిచేసిరి. ముద్రితప్రతులు పెక్కింటిని తీసుకొని ఫాస్టు ప్యారిసు మహానగరమునకు పోయి వానిని వ్రాతప్రతులుగ అమ్మజూపెను. ఆరోజులలో ప్రజలకు దయ్యములందు నమ్మకము హెచ్చుగా ఉండెను. అవి మానవులకొఱకు కొన్ని పనులుకూడ చేసిపెట్టునని అప్పటిజనుల అభిప్రాయము. ఫాస్టు అమ్మజూపిన వ్రాతప్రతులు అచ్చముగా ఒకదానిని ఒకటి పోలిఉండుట చూచి జనులు అనుమానపడి ఇది నిశ్చయముగా దయ్యములకృత్యమని నిర్ధారణచేసిరి. ఈసంగతి ఊరంతయు పాక్కెను. దయ్యములచే ఇట్టి కృత్యము చేయించినందులకుగాను ప్రభుత్వమువారు ఫాస్టును పట్టుకొని జెయిలులోపెట్టిరి. అందుమీద ఫాస్టు తనఅచ్చుకూటముయొక్క ఉనికి ప్రభుత్వమువారి తాబేదారులకు చెప్పి వారిని గొనిపోయి అచట పుస్తకములు అచ్చువేయు విధానమంతయు చేసిచూపి అందు దయ్యములకు జోక్యములేకుండుట నిరూపించి తాను నిర్దోషినని పించుకొని శిక్ష తప్పించుకొన్నాడు. ప్రపంచమునందలి మొదటిఅచ్చుకూటపు అధిపతి ఇట్లు జైలుకు వెళ్ళియుండుటచేతనో ఏమో నేడు కూడ భారతదేశపు ముద్రాపకులు పలువురు జైళ్ళకు వెళ్ళి వచ్చుచున్నారు!''

—దిఇండియన్ ప్రింటర్సు మంత్లీ.

* * * *

## విమానపుటపాచరిత్ర.

"ఆంగ్లదేశమున విమానయానమున విశేషాభినివేశము గల కొందఱు 1910 లో ఒకనాటి మధ్యాహ్నమున బ్లాక్‌పూల్ విమానాశ్రయస్థానమునుండి కొద్ది ఉత్తరములుగల సంచితో విమానమొకటి బయలుదేరుటకు ప్రోత్సహించిరి. విమానపుటపాకు అదియే ప్రారంభమని చెప్పవచ్చును. ఆమొదటి టపావిమానచోదకుని నామము క్లాడ్ గ్రాహమ్‌వైట్. విమానపుటపావిషయమున ఈప్రథమప్రయత్నము ప్రత్యేకవ్యక్తులచే చేయబడినది. కాని మరుసటివత్సరము 1911 లో లండను-విండ్సరు నడుమ ప్రభుత్వమువారు విమానపుటపాను పరీక్షించిరి. ఈపరీక్షలో పోస్టుఆఫీసువారు కూడ సహకారముగావించిరి. లక్షముప్పదివేల ఉత్తరములు ఆదినములలో విమానపుటపాద్వారా లండను-విండ్సరు నడుమ బట్వాడా అయ్యెను. గస్టవ్ హేమల్ అనువాడు అప్పటి విమానచోదకుడు. యుద్ధకాలమున విమానపుటపా బాగుగ ప్రచారములోనికి వచ్చెను. సైనికనివేశములకు సత్వరముగ టపా గొనిపోవుటకు విమానములు విరివిగ ఉపయోగింపబడినవి. ఆదినములలో ఆఱుమాసములలో నూరుటన్నుల తూకముగల ఉత్తరములు విమానములద్వారా రవాణాచేయబడెను. విమానపుటపా చరిత్రలో 1919-వ సంవత్సరము అతిముఖ్యమైనది. ఆసంవత్సరము విమానములపై అట్లాంటిక్ మహాసముద్రము అతిక్రమింపబడెను. అట్లు అతిక్రమించినవారిలో ప్రసిద్ధులు హారీహాకరు, ఆల్‌కాకు, బ్రౌను వీరలు తమతోకూడ కొంత టపాను - స్వల్పమే యగుగాక - తీసుకొనిపోయిరి. ఆసంవత్సరము నవంబరు నెలలో లండను-పారిసు నగరములనడుమ విమానములపై టపా కొనిపోవుటకు పోస్టాఫీసువారు అధికారరీత్యా కంట్రాక్టునిచ్చిరి. క్రమమైనవిమానపుటపా అప్పటినుండియే ప్రారంభమైనదని చెప్పవచ్చును. నేడు ప్రపంచమునందలి నలుమూలలకు విమానపుటపాగలదు. నేలమీద వెళ్ళుటకు తీసుకొనుకాలములో సగము కాలములోనే విమానములద్వారా టపా ఆయాస్థలములకు చేరుచున్నది. లండనునుంచి పారిసుకుగల 230 మైళ్లకు 1912 లో విమానపుటపాచార్జి అర్ధక్రౌను అయిఉండెను. అయిదువేలమైళ్ళ దూరముననున్న ఇండియాకు నేడు ఆరుపెన్నీల ఖర్చుతోమాత్రము మనము ఉత్తరము పంపగలుగుచున్నాము. అంతదూరముననున్న మధ్యఆఫ్రికాకుకూడ ఉత్తరము పంపుటకు విమానపుటపాలో నేడు ఏడున్నరపెన్నీలకు మించదు. సముద్రములు, ఎడారులు, పర్వతములు, అరణ్యములు అతిక్ర

ఖించి వేలకొలదిమైళ్ళు ప్రయాణముసల్పి విమానములు మన టపాను బట్వాడా చేయుచున్నవి. విమానపు టపాబిళ్ళ—నీలవర్ణపుది—వేగమును సూచించును. ఆంగ్లదేశపు విమానపుటపాకార్యాలయములు చూచితిమేని ఆశ్చర్యపడిపోదుము. ఒక్క నిముషముకూడ వృథాపోదు. నిముసమునిముసమునకు టపా. సార్టర్లు వేగమునకు మూర్తులో అనునట్లు పనిచేయుచుందురు. టపా అంతయు విమానాశ్రయస్థానమగు క్రాయిడన్‌కు మోటార్లమీదవచ్చి పడును. వానిలో పూటెక్కి విమానములు ఐరోపాను దాటి ఇండియాకు పోవునది తూర్పుగాను, ఆఫ్రికాకు పోవునది దక్షిణముగాను ప్రయాణముచేయును. సముద్రములు—సైకతసముద్రములనదగిన ఎడారులు—అవభూములు—ఆకాశమంటు కొండలు—అతిక్రమించి క్రాయిడన్ విడిచిన అయిదురోజులలో టపావిమానము కరాచి చేరుచున్నది."

—డెయిలీ పోస్టు.

* * * *

## స్త్రీ వర్ణన: మామిడిపళ్ళపోలిక.

ఆంధ్రభూమి మే మాసపు సంచికలోని 'మామిడిపండ్ల పేళ్ళనుగురించి' అను వ్యాసములో—స్త్రీవర్ణన: మామిడిపళ్ళ పోలిక—అను విషయమునుగూర్చి "మన కవులు మామిడిపళ్ళకీ, మహిళాజనానికీ ఉపమాలంకారశోభ కలిగించలేదు. మన పురుషకవులు రుచివిస్తారంగల మామిడిపళ్ళను స్త్రీల ధరిమానా రానీయకపోవడంలో గొప్ప కుమ్మక్కు ఉండితీరాలి." అని వ్రాయబడిఉంది. కవి సార్వభౌమ కూచిమంచి తిమ్మకవి మాత్రము ఈ కుమ్మక్కులో చేరలేదని చెప్పవలసియున్నది. ఆతని 'రసికజనమనోభిరామము'లో 'మామిడిపండువంటి మదవతి'గలదు. గమనింపుడు:

ఉ. అమహిళాలలామముల యందు ర
          హిన్ బొడగంటి దివ్యశో
     భామృదుతాసుగంధపరిభాసిత
          రూపవిలాసలీలలన్
     వేమఱు గోముమీఱి యరవిందశ
          రాసనుచే వెలుంగు క్రొ
     మ్మామిడిపండువంటి యొక మత్తమ
          తంగజరాజగామినిన్.

# ఎలక్షన్ జ్వరము

కష్టాలు ఒంటరిగా రావంటారు పెద్దలు. మెదడువెన్నముకజ్వర మనబడే మెనెంజిటిసు ఫీవరు దేశంమీదపడి ఎన్నాళ్లోకాలేదు. దాని వెనకాలే ఎలక్షనుజర్వం వచ్చిపడింది. కైలాసపర్వతం మొదలుకొని కన్యాకుమారి వఱకు దేశంయావత్తు ఈ ఎలక్షన్ జ్వరం మైకంలోపడి ఒళ్లుతెలియక పలవరిస్తోంది. పలవరింతలకు తోడు ఒక్కొక్కచోట సంధిలక్షణాలుకూడా కనిపిస్తోన్నాయి. ఎం. బి. బి. ఎస్ పరీక్ష ప్యాసుచేసి అంతోయింతో వైద్యోనారాయణో హరి అనిపించుకుంటూవున్న మావంటి పెద్ద డాకుదారలకు (డాక్టరు పదతద్భవము) కూడా ఈ ఎలక్షనుజ్వరనిదానం చేయడం చాలా కష్టంగాఉంది. ఈ జ్వరం నాడికి అంతుపట్టదు ధర్మామీటరు కొలతకిరాదు. సాధారణంగా జ్వరాలు ఎప్పుడువస్తాయో చెప్పలేం. ఎలక్షనుజ్వరంవిషయంలో మాత్రం ఒకటి నిశ్చయంగా చెప్పవచ్చు. సరిగా అది ఏరోజున ఎన్నిగంటలకు వస్తుందో, ఎన్నిగంటలు నిలబాటు చేస్తుందో చెప్పవచ్చు. ఫలానానాడు ఫలానాగంటకు వస్తుందని తెలిసినప్పటికీ ఈ జ్వరాన్ని నిరోధించడానికి ఏ మందు మాకులేదు. ఎలక్షనుజ్వరంవస్తోంది అంటేచాలు కొన్నికొన్ని సున్నితమైన తత్వాల మీద ఆ జ్వరకారకక్రిములు ధారాళంగా పనిచేయడం ప్రారంభిస్తాయి.

ఈ జ్వరలక్షణాలు నిరూపించి చెప్పడం కష్టం. పాతస్నేహితాలు ఎన్నోతిరగతోడబడతాయి. స్నేహితులు భార్యల్లా లాలింపబడతారు. ప్రత్యర్థులు మాత్రం గర్భశత్రువులుగా చూడపడతారు. మాటలు ఆవేశపూరితాలు అయిఉంటాయి. వాగ్దానాలు

పెచ్చురిల్లుతాయి. ఇంకా ఏన్నెన్నో లక్ష ణాలు పొడసూపుతాయి. రోగం ఒకటే అయినా రోగి శరీరతత్వాన్నిపట్టికూడా రోగ లక్షణాలు మారుతూ ఉంటాయి. ఎలక్షను జ్వరకారకక్రిములు దేశంమీద ఎట్లా వ్యా పింపబడతాయి అన్న విషయంలో పెద్దపెద్ద డాక్టర్లే ఇంకా తుదినిర్ణయానికిరాలేదు. ఈ రోగకారకక్రిములు వ్యాపించడానికి దినపత్రి కలు చాలావఱకు కారణం అయివుంటాయని తోస్తోంది. రాజకీయాల్లో మొగ్గఉన్న తత్త్వం గల పెద్దలకు జాతిమతకులభేదాలతో నిమి త్తంలేకుండా ఈ ఎలక్షనుజ్వరక్రిములు చాల త్వరగ తగులుతాయి అని నిశ్చయంగా చెప్పడానికి నిదర్శనాలున్నాయి. కాని ఒక మనిషినుండి ఈక్రిమి మరోమనిషికి నోటి ద్వారా వ్యాపిస్తుందో, చూపుద్వారా వ్యా పిస్తుందో, మఱోద్వారా వ్యాపిస్తుందో నిదానం దొరకటంలేదు. ఎలక్షనుజ్వరక్రిము లను గూర్చిన తత్త్వపరిశోధన ఢిల్లీలో ప్రా రంభమైనా తీవ్రపరిశోధన రాంచీలోగాని జరగలేదు. రాంచి పరిశోధనలు చాలక పా ట్నాలోకూడా చేశారు. పరిశోధనకు ఫలి తాలు ఏమిన్నీ తేలలేదుకాని ఎలక్షను జ్వర క్రిములుమాత్రం దేశంఅంతా పాకిపోయి నాయి. మునుపు ఈక్రిములు కద్దరుబట్టలకు కొంచెము జడిసేవి. ఇపుడు వానికి ఆజడుపు కూడా పోయింది. నేడు కద్దరు బట్టలమీద కూడా వాని ప్రాబల్యం తొలగింపరానిది గానే ఉంది

ఆయుర్వేదవైద్యులు జ్వరానికి లంఘనం పరమౌషధం అంటారు. మావంటి అల్లోప తిక్ వైద్యులు జ్వరాలకి జావపోయిస్తారు. యునానివైద్యులు అన్నిరోగాలతోపాటు దీనికికూడా ఏదో ఇంత తియ్యటిమందు యిస్తారు. ఎలక్షనుజ్వరానికి మాత్రం ఇవిఏవీ పనికిరావు. అన్నిజ్వరాలతోపాటు ఈజ్వరం లోకూడా అన్నహితవుఉండదు. అయితే ఆమాత్రంచేత సాధారణజ్వరరోగివలె ఎల క్షన్‌జ్వరరోగి లంఘనంఉండడు. దొరికి నప్పుడు ఇంత అన్నమో, కాఫీయో హిత వున్నా లేకపోయినా కడుపులో పడేస్తాడు. సాధారణజ్వరచికిత్సకు ఆయుర్వేద అల్లో పతిక్, యూనాని విధాలలో మందులు విభే దించి ఉంటాయి సన్నిపాతభైరవి, జ్వరకుఠా రము, మిరియాలకషాయం మొదలైనవి ఈ ఎలక్షనుజ్వరానికి అవసరంలేదు. మలేరియా జ్వరానికి క్వినైన్‌లాగ ఎలక్షనుజ్వరానికి ఎంతసేపు ఓట్లు—క్వాకరుఓట్లుకావు—పర మౌషధం. చెముడువచ్చేవరకు క్వినైన్ మిం గితే మలేరియాజ్వరం చప్పగా కుదిరేటట్లే నిండుగా ఓట్లుపొందుతే ఎలక్షనుజ్వరం పూ ర్తిగా దిగజారుతుంది. సాధారణజ్వరాలలో ఒక్కొక్కప్పుడు మందు మోతాదును మిం చితే వికటిస్తుంది ఎలక్షనుజ్వరంలో మాత్రం ఓట్లమోతాదు ఎంతహెచ్చుగ ఉపయోగిస్తే అంత కార్యకారిగా ఉంటుంది.

సాధారణంగా అంటువ్యాధులు స్పర్శ చేతగాని వ్యాపించవు. కాని ఎలక్షనుజ్వరం అనే అంటురోగం రోగిని చూడ్డంచేతగాని రోగినిగూర్చి వినడంవల్లగాని అంటుకుం టుంది. డాక్టర్లు, నర్సులుకూడా ఎంత జాగ్ర త్తగాఉన్నా ఈజ్వరం తగులుబాటును తప్పించుకోలేరు. ఎలక్షనుజ్వరం తగిలిన మనిషి ఎంతసేపు ఎల్లాగో ఒకలాగ తనవైపు మనుష్యుల్ని ఆకర్షించుకోవడానికి అతిగా ప్ర యత్నిస్తాడు. కాబట్టే ఈజ్వరం తగిలినవారు జిల్లాకు ఒకళ్లిద్దఱు ఉన్నా ఈజ్వరం జిల్లా అంతా వ్యాపించిపోతుంది.

అయితే ఇతరరోగాలవలె ఎలక్షనురోగం రోగిని మంచంపట్టించదు. అది అతనికి రాత్రిళ్లుకూడా నిద్రలేకుండా చేస్తుంది. జన్మ మధ్యంలో లేని చురుకుతనం-- పుట్టిఎఱగని చావు తెలివి - డబ్బులంటే నిర్లక్ష్యం - మనుషులంటే ఎక్కడలేని ప్రేమా పుట్టిస్తుంది. ఇతరరోగాలలో రోగికి రెస్టు అవసరం. ఎలక్షనుజ్వరంలో రోగి రెస్టుతీసుకున్నాడా అంటే కాళ్ళుచేతులు చల్లబడి మృతలక్షణాలు కనిపిస్తాయి. ఇతరరోగులు ఉన్నచోట శబ్దం యెంతమాత్రం పనికిరాదు. ఎలక్షను రోగులకు నాదబ్రహ్మాండుంటేగాని పని జరగదు. వీరికి ఒంటెద్దుబళ్ళు, జట్కాబళ్ళ చప్పుడు చాలదు. మోటారుకార్లు, బస్సుల కయిబాయ్ శబ్దాలు ముఖ్యంగా ఉండితీరాలు. ఆశబ్దాల హెచ్చుతగ్గులనుబట్టే ఏలక్షను జ్వరంయొక్క హెచ్చులొచ్చులు ఆధారపడి ఉంటాయి.

అచ్చటచ్చట ఒకరిద్దఱు రోగుల హృదయస్పందనం ఆగిపోవడానికి కారణమైనా ఈజ్వరంవల్ల జననష్టం ఇంతవఱకు ఆట్టే లేదు. అయితే జననష్టంకలగటం లేదనే కారణంచేత రోగచికిత్సకు శ్రద్ధపెట్టక పోవడం పురుషలక్షణంకాదు. హిందూదేశంలో ఈరోగానికి చికిత్సవిషయమై ప్రయత్నాలు జరక్కపోలేదు. ఆరోగ్యదర్పణం అనే వైద్యగ్రంథం వ్రాసిన డాక్టరు గాంధి అనే ఆయన ఈజ్వరచికిత్స విషయంలో చాలాపనిచేశాడు. 1920, 1923 లలో ఈఅంటురోగం దేశంలో ప్రబలినప్పుడు ఆడాక్టరు బాగాపనిచేశాడు. 1920 లో అతను ఇచ్చిన ఇంజక్షనులు ఘాటుగాపనిచేశాయి. అతనివల్ల ఇంజక్షను పుచ్చుకుని అతడు పథ్యపువస్తువుగా ఏర్పాటుచేసిన కద్దరు స్వీకరించిన వారికి ఈజర్వం బొత్తిగా అంటలేదు. ఈ జ్వరంతిరిగి 1923 లో ప్రబలింది. అప్పుడు ఆడాక్టరు ఇంజక్షనులపవరు కొంతతగ్గిపోయిందికాబోలు బాగాపనిచేయలేదు. ఈ యేటి ఎలక్షను జ్వరానికి తానుమందు ఇవ్వలేనని ఆడాక్టరు స్పష్టంగా ఒప్పేసుకున్నాడు. అల్లాంటి స్పెషలిస్టులు చేతకాదని ఒప్పుకున్నప్పుడు మావంటివాళ్లం ఏంచేయగలం? విశాఖపట్టణంజిల్లాలో మన్యంలో ఈమారుమూలకొండలమధ్యఉన్న మాఊళ్లోకూడా ఈ ఎలక్షనుజ్వరలక్షణాలు కనిపిస్తూ ఉన్నాయిఅంటే కేవలం పల్లమిప్రదేశాలైన కృష్ణా గోదావరి, గుంటూరు జిల్లాల్లో ఈజ్వరం చాలాప్రబలంగా ఉండిఉండాలి.

—పి. బ్రహ్మాజీరావు, ఎం బి బి.ఎస్.

## ఉలికిపడకుము, గోపాల!

కుడుపుదూడలు పొదుగులు గుడువలేదు
చెదిరిపోలేదు గోవులు చేలకైనఁ
గఱకుకామందు జాడలు గానరావు
ఉలికిపడకుము, గోపాల! ఉలికిపడకు!
ప్రాణమిగురొత్త వీచెడుఁ బైరుగాలి
కమ్మగాఁ బక్షిగణములు గంతమెత్తి
చిదుపపింఛైనఁ జొరసీని చెట్టుపైని
బ్రకృతిగీతావళుల జోలపాటఁబాడ
నొడ లెరుంగక నిదురింప కులికిపడెదు
ఉలికిబడకుము, గోపాల! ఉలికిపడకు!!
అనుపమోద్యానవనసమూహములయందు
నమలమణిమయసౌధాంతరములయందుఁ
బరిమళంబులజిమ్ము పూపాన్పుపైని
రమణితోడుత శయనించు రాజుకంటె
సుఖతరంబైన నిద్రలో జొక్కినావు
ఉలికిపడకుము, గోపాల! ఉలికిపడకు!!!

—ముక్కవిల్లి వెంకటనారాయణ, బి.ఏ.

# పట్నవాసపు కోడలు

అగ్రహారాల్లో మిక్కిలి పేరుబడ్డది రామనగరం— పర్లాకిమిడికి సుమారు 12 మైళ్ళదూరంలో ఉంది. గ్రామానికి సమీపంలోనే ఉంది వంశధారనది. ఊళ్ళోఉన్న వాళ్లలో నూటికి తొంభైతొమ్మిదివంతులు వేగినాటి కొంపలే.

ఆ గ్రామంలో శాస్త్ర చెప్పుకోతగ్గ కుటుంబం దూశివారిది. ప్రస్తుతం వెంకటేశం భుక్త ఆ కుటుంబానికి పెద్ద. తనతండ్రీ, తాతలూ బాగా ధనధాన్యాలు గడించి నిలువచేసేరు, పౌరోహిత్యాలవల్ల సంపాదించి. ఇప్పుడేంలేదన్నా, 70 గరిశెల ధాన్యం, 8 గరిశెల పెసలూ, 2 గరిశెల నువ్వులూ పండే భూములున్నాయి. పెద్దయిల్లూ వాకిలీ ఉంది. సిరీ, సంపదా ఉంటేనేగాని ఏయింటికీ శోభలేదంటారు పెద్దలు. ఉన్న లోటేమీ లేకుండా భుక్తకు ఇద్దరుకొడుకులూ, ఒక్కకూతురు గల్గేరు. ఉన్నది పల్లెటూరవడంనుంచీ, కులవృత్తి వీడ్డానికిష్టంలేక పోవడంనుంచీ, వెంకటేశంభుక్త తన పెద్ద కొడుకుని పౌరోహిత్యం చెయ్యడంలో బాగా తరిఫీదు చేసేడు. నరసింహశాస్త్రికి 20 ఏళ్ళు ఒంటికొచ్చేయి, ఇంట్లో కామమ్మ ఊరికే వెంకటేశంప్రాణాలు కొరుకుతోంది, కొడుక్కి పెళ్ళిచెయ్యమని.

చాలా రోజులనుంచీ ఉంది ఉబలాటం వెంకటేశానికి పట్నవాసం సంబంధంచేద్దామనీ, వియ్యంకుడు గవర్నమెంటులో మంచి ఉన్నతోద్యోగై ఉండాలనీన్నీ. అంచేతే, తన భావమరది కూతుర్ని నరశింహునికిచ్చి పెళ్ళిచెయ్యలేదు

* * * *

పర్లాకిమిడికి డెప్యూటీ సూపరింటెండెంటుగా అధికార్లు నారాయణరావును కర్నూలునుంచి బదిలీచేసేరు. మొదట వారిది ముంగండ అగ్రహారం. నారాయణరావు చాలాకాలంక్రిందట పోలీసు డిపార్టుమెంటులో ప్రవేశించేడు. తన చాకచక్యం ఏమిలేకపోయినా, అదృష్టం పట్టింది. శీతారామరాజు పితూరీలో బాగా పనిచేసేడు. ఆదెబ్బతో సర్కిల్ ఇనస్పెక్టరయ్యేడు. తిరిగీ మహాత్మనిధర్మమా అని అసహాయోద్యమం వచ్చింది. నారాయణరావు అదృష్టరేఖ బయలుబడ్డది. చేయించిన లాఠీచార్జీలనీ వాటినీమెచ్చి దొరతనంవారు వెంటనే డిప్యూటీ సూపరెంటెండెంటు పదవిచ్చేరు. కొంతకాలం కర్నూలులో ఉంచి, అక్కడినుంచి పర్లాకిమిడికి బదిలీచేసేరు.

నారాయణరావుగారికి కుమారులు కలుగలేదు గాని కన్యాదానాలుచేసి తరించడానికి వీలుగా నలుగురు కూతుళ్ళు పుట్టేరు. పెద్దకుమార్తెకు వివాహం జరిగింది. అల్లుడు రాజమండ్రీ ట్రెనింగ్ కాలేజీలో లెక్చరరుగా ఉన్నాడు. రెండవపిల్లకింకా పెళ్ళికాలేదు. 13 ఏళ్ళున్నాయి. పిల్ల చాలఏపైంది. ఇంతవరకూ దూరదేశాల్లో ఉండడంచేత తగినసంబంధం కుదరలేదు. అమ్మాయిని మెట్రిక్యులేషన్ వరకూ చదివిద్దామని నారాయణరావుగారి తలంపు. కాని ఆబిడ్డ నాలుగోఫారంలో చదువుతూ ఉండగానే, ఆయనగారికి బదిలీ అయింది.

పర్లాకిమిడిలో చార్జిపుచ్చుకున్నాక, సర్కార్యేటు బైల్దేరాడు నారాయణరావు. రామనగరానికి దగ్గరగానున్న కొత్తూరు గ్రామంలో ఏదో కూనీజరిగింది. అంచేత ఆకేసువిషయంలో వెళ్ళాలిసొచ్చింది. క్రొత్త సూపరింటెండెంటు వేగినాటివాడనగానే అగ్రహారస్తుల భుజాలు పొంగిపోయేయి. అందులోనూ వెంకటేశం భుక్త హడావిడి చెప్పనక్కరలేదు. ఇంటివద్ద తగిన ఏర్పాట్లన్నీచేసి ఉదయాన్నే కొత్తూరు వెళ్ళేడు. ఆ రోజునే 10 గంటలకల్లా కారులో నారాయణరావుగారు కొత్తూరులో మఖాంచేసేరు. కేసువిషయం బాగా విచారణసలిపేరు. ముద్దాయీలను లాకపులో పెట్టేరు... వెంకటేశం భుక్త అసలే అగ్రహారపు పిరికిపంద: దొరగార్ని (నారాయణరావుగార్ని) చూడగానే అతని ప్రాణాలు లేచిపోయేయి. ఎలాగైతేనేం, ధైర్యం చిక్కబట్టి, నమస్కారంచేస్తూ, నారాయణరావుగారితో, తానెవరైనదీ, ఏంపనిమీదొచ్చిందీ, మనవి

చేసుకున్నాడు. ఏం ఉన్నా లేకపోయినా, వేగినాటు వాడు తిండికి వెనకతియ్యడు. ఒకడి కింత పెట్టినా, తా నింతతిన్నా అశాఖవాళ్ళనే ముందుగా చెప్పాలన్నారు పెద్దలు. అందులో చేరినవాడే మన నారాయణరావు. మంచి ఘనాపాటీ. తిరిగి చాలారోజులకు, అగ్రహారం భోజనం సంప్రాప్తం అయినందుకు చాలా సంతోషిస్తూ వెంకటేశంచేసిన ఆహ్వానాని కంగీకరించాడు. ఇద్దరూ కారెక్కి రామనగరం వెళ్ళేరు...

నారాయణరావు రామనగరంలో అడుగుపెట్టిం దగ్గరనుంచీ ఆలోచనలన్నీ కొమార్తె వివాహవిషయమై పరిపరివిధాల పరిగెత్తాయి. ఇంత పెద్దఉద్యోగం చేస్తూ, తీరా "ఎత్తెత్తికాలేసి, ఎంగిలాకుల్లో పెట్టే డన్నట్లు," పల్లెటూరి సంబంధమా చెయ్యడం అని ఒక పెద్ద ఆందోళన. "పల్లెటూరైతే నేం? ప్రక్కను వంశధారనది-స్వచ్ఛమైన కంపులేని గాలి - ఆరోగ్యమైన స్థలం. కాస్తకలిగిన పెద్దకొంపలో పడేస్తే బిడ్డ సుఖపడుతుంది" అని వేరే ఆలోచన. ఇలాఉంటూఉండగానే వెంకటేశంగారింట్లో బస, వారి ఇల్లూ, వైభవం, పాడిపంటా, సిరీ, సంపదా, చూడ్డం తటస్థించింది. ఆలస్యం అమృతంవిషం అని ఇంక ఊరుకుంటే ఈ తరుణం పోతుందని నారాయణరావు అనుకున్నాడు.

భోజనాలయాయి. తాంబూలాలు వేసుకుంటూ నూపరెంటెండెంటుగారూ, తదితర గ్రామంలో ఉండే పెద్దలూ వసారాలో కూర్చున్నారు. వెంకటేశం భుక్త మోటారుడ్రైవరుకు దగ్గిరుండి భోజనంపెట్టిస్తున్నాడు. ఇదేసమయం అని నారాయణరావు - పోలీసుపిల్ల గనుక- వెంకటేశంభుక్తయొక్క ఆస్తి వివరాలు సంగతి వాకబుచేసేడు. కుర్రాణ్ణితాను భోజనసమయంలోనే చూశాడు, తృప్తిపడ్డాడు.

మధ్యాహ్నం మూడుఘంటలైంది. "భావగారూ! సెలవిప్పించండి. శీఘ్రకాలంలోనే ముహూర్తం ఏర్పాటుచేయిస్తాను. మీరూ మీప్రయత్నాలు చేయించండి."—అని నవ్వుతూ అన్నాడు నారాయణరావు కారెక్కుతూ.

"తమవంటివారు కోరడం, మాలాటివాళ్ళు కాదనడం ఉంటుందా? బావగారూ! ఇంతకూ తమబోటి పెద్దలతో సంబంధబాంధవ్యాలు జరుపడమనేది చాలా పెద్దమాట" అంటూ ఏవో పల్లెటూరు మర్యాదాగా మాట్లాడాడు వెంకటేశంభుక్త.

ఒకాదివారంనాడు తనకూతురు సులోచననూ, భార్య సూర్యకాంతాన్నీ తీసుకొని కారులో రామనగరం వెళ్ళి వియ్యాలవారిక్కి చూపించేడు. ఊళ్ళో ఉన్న అమ్మలక్కలంతా వెంకటేశంభుక్తదే అదృష్టం అన్నారు. బంగారంబిలుకలాంటి కోడలు దొరికింది కామమ్మ కన్నారు. నరిశిగాడి భుజాలు పొంగిపోయేయి తనకు కాబోయ్యే భార్యనుచూసి.

*  *  *  *

వివాహమైన రెండునెల్లకే సులోచన పెద్దమనిషైంది. వెంటనే రామనగరం ఖబురువెళ్ళింది. వెంకటేశంభుక్త తోటలోఉన్నాడు. ఈఖబురు తెలియగానే యింటికొచ్చి, ఆడవాళ్ళతో ఆలోచించి, నీళ్ళనాడే పునస్సంధానాని కేర్పాటుకావించమని కోరుతూ వియ్యంకునిపేర జబాబువ్రాసి పంపేడు. ఎలాగో అయిపోయింది. సులోచన అత్తవారింటికొచ్చింది.

సులోచన చాల సౌందర్యవంతురాలు, చదువుకున్నది. తండ్రితోపాటు నాల్గుదేశాలు తిరిగింది. పోకులలవడ్డాయి. ఎక్కడలేని పౌడర్లూ చాలవు. సబ్బులూ, వాసననూనెలూ విరివిగా వాడుతుంది. కాళ్ళకు చెప్పులుంటేనేగాని ఇంట్లోనైనా నడిచేబాపతుగాదు.

అత్తవారింటికి పంపేపూర్వం తండ్రి నానా ఉపదేశాలూచేశేడు కూతురికి. అగ్రహారం అయినా జీవనం చాలాబాగుంటుందని, ఊరుబైట మంచి తోటలూ, దొడ్లూ ఉండడంవల్ల సాయంత్రం చల్లగాలి అనుభవించ వచ్చుననీన్నీ, మగడు అగ్రహారస్థుడు గనుక తనచెప్పుచేతల్లో మెలుగుతాడనీ, అంచేత తన కత్యంతసుఖంగా ఉంటుందనీ ఇంకా ఏవేవో లాభాలు చూపించాడు. అన్నింటికీ ఊఅన్నదిపైకి సులోచన. మనస్సులో ఏమనుకున్నదో!

*  *  *  *

"సులోచనా, సులోచనా! రావేమే! ఏటికి

పోయి బిందెడునీళ్ళయినా ఏనాడూ తెచ్చిన పాపాన్ని పోలేదు. ఛీ. ఏఁవన్న కోడలివి దాపురమైనావే తల్లీ! ఉదయాన్ని లేచిందిమొదలు సాయంత్రందాకా అత్త ముండామోతురు కష్టపడిపోతూంటే, కాస్తోకూస్తో సాయంచేద్దామన్న బుద్ధి పుట్టలేదే? ఓసీ, నీచదువు పాడుగానూ! మీ చదువుల్లో అత్తగారిమాటవినొద్దని ఉందా? మాటాడవేఁవే? నీనోట్లో పుండుపుట్ట!" అంటూ మొదలెట్టింది కామమ్మ ఉదయాన్నే. ఈ థోరణంతా శాంతంగావిన్నాది సులోచన. ఆమె కిది వింతగా తోచలేదు. ఏనాడైతే తాను రామనగరం దూశివారి కోడలైందో, అనాటినుంచే తాను వారిచేత నొక పశువుగా చూడబడుతోనని అనుకుంది. ఊరు అమ్మలక్కలవలె ముడుకులు దిగని పక్షిమార్కు పంచ పదిమూర్ళది కుడిపైటవేసుకొని, మొగమునిండా పసుపురాసుకొని, దుక్కడబ్బున్నరంత కుంకుంబొట్టు పెట్టుకొని, మెట్టముడితో ఏటికి నీళ్ళకై వెళ్ళడం తన మతం కాదు. తానిదివరకెన్నడూ అల్లు చేయలేదు సరే కదా అట్టి అనాగరికులమధ్య ఎన్నడూ మెలగలేదు. ఉదయాన్నే లేచి, కాఫీ కాచుకొని త్రాగితే అత్తమామలు గుసగుసలాడేవారు. ఇంక, తనే అని నమ్మకున్న భర్త ఒట్టి అగ్రహారపుపెయ్య. బ్రాహ్మనార్థములు తప్ప వేరొండుపని చేతగాదు. ఇంట్లో ఏవైపుచూచినా, తన కసహ్యంగానే ఉంది. ఇంకా యింట్లో కాపురం ఎట్లానా అనిపించింది:

ఏఁవైనా సరే తన అలవాట్లుమానలేదు. అమ్మలక్కల గుసగుసలను లక్ష్యంచెయ్యలేదు. ఉదయం కాఫీ త్రాగినతరువాత, తా నేమాసపత్రికసంచికనో చదువుకుంటూ ఉండేది. తన వాయల్సుచీరలు, తన పోడుబూ మానలేదు. సాయంత్రం 5 గంటలకు తప్పనిసరిగా ఏటి ఒడ్డునున్న తోటలోకి చల్లగాలికై పోతూండడం, అక్కడ కాస్సేపు ప్రకృతిసౌందర్యం ఆనందిస్తూ, మధ్యమధ్య తన ఒంటరితనానికి కంట తడిచేసుకుంటూ దినాలు వెళ్ళబుస్తూ ఉండడం. మనిషన్నది ఎన్నిరోజు లోరుస్తుంది?

కామమ్మకు కోడలిసంగతేమి బోధపడలేదు. ఇంట్లో అటున్న చీపురుకట్ట యిటైనాపెట్టదు. తనగోలతంది. ఇంకాపోనీ, చేస్తేచేసింది లేకపోతేలేదు, కొడుకూ కోడలైనా సుఖంగా కాపురంచేస్తూన్నారా అంటే అదీలేదు—నరిశిగాడు పాపం ఎప్పుడూ వాకట్లోనే మంచంవేసుకొని పడుకుంటాడు. "ఏంరా? బాబూ, ఇంట్లోకివచ్చి గదిలో పడుకోరా, పైని చలిగా ఉందీ" అంటే "ఒద్దే, అమ్మా! యిక్కడ చల్లగా ఉంటుంది. గదిలో గాలి వెయ్యా"దంటాడు.

తానేటికి నీళ్ళకై వెళితే, నీళ్ళరేవున చేరిన ఊరిఆడంగులు, "మీ కోడలు రాలేదేఁవో, కాఁవమ్మా?" అంటారు.

"పోనీలెత్తూ చదువుకున్న కోడలు నీళ్ళు తెస్తుందా? మెరుగ్గా యింట్లో తిరుగుతూ ఉంటేనే కాఁవప్ప కడుపునిండుతుంది. ఆపిల్లచేత పనిచేయిస్తుందా?" అని పొరుగు రామారావుధాన్లుగారి భార్య వెక్కిరింపు.

"నరిశిగాడికి రాకపోయినా వాళ్ళ సులోచన బాగా ఇంగ్లీషు మాట్లాడుతుందట; మొన్న మాతమ్మడు విజయనగరంనుంచి శెలవులకొచ్చినపుడు చెప్పేడు. నీకెలా తెలుసునురా అంటే 'నేనూ ఆపిల్ల ప్రతిరోజూ సాయంత్రం తోటలోకూచుని మాట్లాడే వాళ్ళం' అని అన్నాడు. సులోచన మాట్లాడితే అచ్చ దొరసాని మాటల్లాగా ఉంటాయిట" అంటుంది నేమాని వారి సూరీడు. ఈవిధంగా పైకివెళ్ళితే తలవంపులు. ఇంట్లో కోడలిచేత తిరస్కరింపులు.ఇలా బాధ పడుతూంది కాఁమమ్మ.

వెంకటేశంభుక్తకు బుద్ధొచ్చింది. పట్నవాసంసంబంధం కావాలని బిర్రెబిగిసి మేనరికంమానినందుకు బాగా తగినశాస్తి అయింది. చూసింది, చూసింది సులోచన ఒకరోజున తండ్రికొకఉత్తరంవ్రాసి తక్షణం తన్ను తీసికెళ్ళమంది. మరుక్షణం ప్రత్యక్షంఅయింది కారు. సులోచన తన పెట్టెబేడాతీసుకొని పర్లాకిమిడి వెళ్ళింది—ఆదిహేనురోజులైనాక శ్రీదూశి వెంకటేశంభుక్త గారిపైన క్రిమినల్‌కేసుదాఖలైంది—తండ్రీ కొడుకులు ముద్దాయిలూ—పట్నవాస సంబంధం బాగా...

—టి. ఎస్. రాములు, బి ఏ.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

### ౯౫. గోలకొండపత్రిక తొమ్మిదవ సంవత్సరాదిసంచిక.

నిజాము రాష్ట్రాంధ్రుల క్షేమాభివృద్ధులకై విశేషముగ కృషిసల్పుచున్న గోలకొండ పత్రిక ఈవఱకొకసారి ప్రత్యేకసంచికను ప్రచురించియున్నది. ఇది రెండవ ప్రత్యేకసంచిక. నిజాము రాష్ట్ర పరిపాలకుల ఛాయా చిత్రములు సంచికకు విలువను తెచ్చుచున్నవి. ఈ సంచికయందలి ప్రత్యేకముగ పేర్కొనదగిన వ్యాసములలో బూర్గుల రామకృష్ణారావుగారు (బి. ఏ. ఎల్. ఎల్. బి) వ్రాసిన 'నిజామురాష్ట్రరాజ్యాంగచరిత్ర' అగ్రస్థానమును వహించుచున్నది. సురవరము ప్రతాపరెడ్డిగారు బి. ఏ. బి. ఎల్ వ్రాసిన 'టప్పాచరిత్ర'; ఇ. రామచంద్రరావుగారు (బి. ఏ) వ్రాసిన 'ప్రజారక్షణము' అను వ్యాసములు విషయగౌరవముగలవి. స్త్రీసమస్యల విషయమై స్త్రీలచే కొన్నివ్యాసములు వ్రాయించినందులకు సంచికాసంపాదకు లెంతయు ప్రశంసింపదగియున్నారు. ఏటేట ఇట్లే వత్సరాదిసంచికలు ప్రచురించునట్లు నిజామురాష్ట్రాంధ్రులు ఈ పత్రికకు తగుప్రోత్సాహ మీయవలసియున్నది. చిరునామా: గోలకొండపత్రికాకార్యాలయము, త్రూపుబజారు. హైదరాబాదు. (డక్కన్).

### ౯౬. వైజయంతి వార్షికసంచిక.

కొల్లాపుర స్నేహలతాకవితాసంఘము నుండి వెలువడిన వైజయంతి రెండవ వార్షికసంచిక. సంపాదకురాలు శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు సంచిక సుందరముగ ముద్రితమైయున్నది. నిడమర్తి సత్యనారాయణమూర్తి (బి. ఏ. బి. ఇ. డి) గారి 'తిక్కన స్వతంత్రరచన' మంచి విమర్శకవ్యాసము. కావ్యకళానిధి, కవిసింహ డి. రాజశేఖర శతావధానులుగారి 'రాణా ప్రతాపసింహ చరిత్ర'ను విమర్శించుచు వి. రామసుబ్బారాయుడుగారు ఒకచక్కనివ్యాసము వ్రాసిరి. పాళీభాషనుండి అనువదింపబడిన 'మాయాదేవి కల' అను రామసుబ్బారాయుడు బి. ఏ. గారి గద్య వ్యాసము ప్రశంసనీయముగనున్నది. శ్రీ సుబ్బారాయుడుగారు పాళీభాషాప్రవేశము లెస్సగ గలవారగుటవా రాభాషాసాగరమునందలి అమూల్యరత్నముల వెతకితెచ్చి ఆంధ్రికి సమర్పించుట భాషాపోషకమగును. ఈ సంచికయందు పద్యవ్యాసములు బహుళముళైయున్నవి. అందుకొన్ని స్త్రీరచనము లగుట విశేషము. భాషాసేవకుల కొందఱను ఒక సంఘముయొక్క కట్టుబాటునకు కొనివచ్చి వారి కావ్యప్రసూనములను వైజయంతి అను దండగా గ్రుచ్చి వెలయించుచున్న శ్రీ రామసుబ్బారాయుడుగా రెంతయు ప్రశంసనీయులైయున్నారు. డబుల్ క్రౌను సైజున 64 పుటలు. వెల 1—0—0.

### ౯౭. భారతదేశపు రైళ్లు.

శ్రీ దుర్గా సదాశివేశ్వరప్రసాద్ గారిచే రచియింపబడినది. మనదేశపు రైళ్ళకథ, రైలుబాటలు ఎవరికోసరము ?, ఎత్తుగడలోనే తప్పుదారి, పిసినారితనం, ప్రయాణీకులవలన, విదేశాలలో ప్రచారంవలన, కొనుగోలులో కొంటెతనం; రైలుబాడుగల అవకతవకలు, దూదికి రైలుబాడుగలు, రయిళ్ళవలన మనకు కలిగినదేమి?, మనకోరిక లేమిటి, ముందేమిగతి ? అను శీర్షికలక్రింద భారతదేశపు రైళ్ళనుగూర్చి లెస్సగ ఈ గ్రంథము ప్రవాహవేగముగల శైలిలో వ్రాయబడి సులభార్థబోధకమైయున్నది. ఈ క్రింది వాక్యరత్నములను గమనించుటచే గ్రంథశైలి కొంతకుకొంత తెలియగలదు. '...మనం చేస్తూఉన్న యూష రాఫ్ గిరీలోని మన చేతి

తక్కడలో దాళాఏమైనా ఉన్నదా?...విదేశపు పనిపాటలవారి కేమో అవకాశా లెక్కువచేసేదిగాను, దేశీయులైన పంచదాయిలవారి నోటగడ్డకొట్టేదిగాను అయినవి చివరకు రయిళ్ళు...పూచీపొందిన కంపెనీలు మొట్టమొదట యీపనిలో ప్రవేశించిన వగుటచేత ఎక్కువరాబడికి అవకాశాలు కలిగినటువంటివిన్ని వాటమైనటువంటివిన్ని చోటులు అవే ఏరుకొన్నవి పోగా అంతగా రాబడిలేని నాసిరకపువే ప్రభుత్వానికి మిగిలినవి...' రాజకీయవిజ్ఞానప్రచురణపరంపరలో ఇది నాలుగవ గ్రంథము. గ్రంథశైలివలెనే గ్రంథమూల్యము కూడ అందరికిని అందుబాటులో ఉన్నదై యున్నది. క్రౌనుసైజున 52 పుటలు. వెల ఒక అణా. వలయువారు ఖరీదుకు, తపాలాచార్జికి బిళ్ళలుపంపుచు బెజవాడ విజ్ఞానచంద్రికామండలివారికి వ్రాయునది.

## ౯౯. శకుంతల.

వచనము. ఆనందనికేతన ప్రచురణములలో రెండవ గ్రంథము. గ్రంథకర్త నరహరిశెట్టి శేషగిరిరావుగారు. కాళిదాసుని శాకుంతల నాటకకథను గైకొని ఈ గ్రంథమున రావుగారు దానిని ఒక నవలవలె నడిపిరి. గ్రంథమున 'ఆశీర్వచనము, నెచ్చెలులు, సంభాషణము, ఆతిథ్యము, చింతనము, మాఢవ్యుడు, నర్మస్నేహితునితో, ఆలోచన, శ్రీరామనవమి, ఉత్తరము, పునర్దర్శనము, శాపవచనములు, అంపకము, కొలువుకూటమున, అంగుళీయకము, శకుంతలాదుష్యంతులు' అను పదునాలు ప్రకరణములుగలవు. శైలి ప్రౌఢమును, నిర్దుష్టమును అయియున్నది. చెన్నపురిగ్రంథనిర్ణాయకసంఘమువారిచే ఆమోదింపబడినది. విద్యాశాఖాధికారులు దీనిని పాఠశాలలందు ప్రవేశపెట్టుదురుగాక యని కోరెదము. క్రౌనుసైజున 126 పుటలు. వెల పండ్రెండు అణాలు. వలయువారు గ్రంథకర్తపేర తూర్పువీధి, ఏలూరు అను చిరునామాకు వ్రాయునది.

## ౧౦౦. శ్రీరామదండు.

ఆంధ్రరత్నము దుగ్గిరాల గోపాలకృష్ణుడు మొక్కవోని రామభక్తుడు. 'ఆతడు సర్వకార్యములను శ్రీరామనామముతో సమన్వయము జేయుచుండెడివాడు. ఇట్టి భక్తాగ్రేసరుడగు గోపాలకృష్ణుడు శ్రీరామకార్యమని యెంచిన స్వరాజ్యయత్నమున సేవాదళముల సమకూర్చు సమయమున 'శ్రీరామదండు' అను ఆంధ్రసాంప్రదాయానుబద్ధమగు దళములను సమకూర్చుటయందెట్టి యాశ్చర్యమును లేదు. ఆతడీ 'రామదండును' గూర్చి వివిధసమయములందు వివిధరీతుల నాంధ్రమహాజనులకు 'బహుపరాక్' అను హెచ్చరికలను జేయుచు తానే యట్టి దళములనునిర్మించి వారిని తన చీరాల రంగమందున నడుపుటయేగాక యేతల్లక్ష్యబోధితములగు నిబంధనాదికములనుగూడ నిరూపించి గ్రంథస్థము చేసెను.' అను పీఠికలోని వాక్యములు గ్రంథమును గూర్చి లెస్సగ తెలుపుచున్నది. 'ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా' అనునది గోపాలకృష్ణయ్యగారి యెడల బాగుగ తార్కాణమైనది. రామదండును ఆంధ్రకాంగ్రెసు నాయకులే ఆమోదింపలేదు. గోపాలకృష్ణుని నుహనీయమైన ఆశయమునకు ఈ గ్రంథము దర్పణమైయున్నవి. కొన్నికొన్ని ఘట్టములు చదువుచుండగా రామదండు విషయమై గోపాలకృష్ణయ్యగారు పడ్డకష్టములకు, వారి ప్రతిభకు కుట్రాకములైయుండిన నాటిపరిస్థితులకు చాల విచారము కలుగును. ఆంధ్రుడగు వాడు తప్పకచదివి తీరవలసిన గ్రంథము. క్రౌనుసైజున 82 పుటలు. వెల 0-8-0 అణాలు. చిరునామా : గోష్ఠీ పుస్తకాలయము, బెజవాడ.

## ౧౦౧. అయోమయపంచాంగం.

హాస్యగ్రంథమాలలో రెండవపుస్తకము. సాలూరు పురవాసులు శ్రీయుత కొమ్మాజోశ్యుల వేంకటరమణయ్య శర్మగారిచే రచియింపబడినది. లోకమోహవిమోచకమును, ఆరోగ్యప్రదమును అగు హాస్యరసము ఈ గ్రంథమున ప్రస్తరింపబడినదని పీఠికలో శ్రీమహాకవి కాశీభట్ట కృష్ణరాయశాస్త్రిగారు వ్రాసినారు. గ్రంథమున కొన్నిఘట్టములు కడుపుబ్బ నవ్వింపజాలియున్నవి. కొన్నిఘట్టములు ప్రసాదమును, లలితమును అగు హాస్యముతో గూడియుండి శ్రీ వేంకటరమణయ్య శర్మగారు హాస్యచతురులగుటను నిరూపించుచున్నవి. కాలక్షేపార్థము చదువవలగు గ్రంథములలో దీనిని

తప్పక చేర్పదగును. హాస్యరసవిషయకములగు ఇట్టి గ్రంథములను మఱికొన్నిటిని రచియించి శ్రీ శర్మగారు భాషాసేవ చేయుదురుగాక యని కోరెదము. క్రౌను సైజున 78 పుటలు. వెల 0-4-0. వలయువారు గ్రంథకర్తపేర విశాఖపట్టణముజిల్లా సాలూరు వ్రాయునది.

## క్రొత్త పత్రికలు

### ౨౮. మాధురి

మాసపత్రిక. జూను మాసమున వెలువడిన మొదటి సంపుటపు మూడవసంచిక విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడినది. విశ్వనాథ సత్యనారాయణగారు (ఎం. ఏ) వ్రాసిన 'సుడిగాలి' అను లలితహాస్యము గల గద్యవ్యాసము పూజ్యస్థానము నందినది. ఉభయభాషాప్రవీణ చింతలపూడి శేషగిరిరావుగారి 'సీతారామాభ్యాంనమః' అనువ్యాసముకూడ హాస్యరసమిళితమే. వినోదార్థము చదువతగిన ఇతర వ్యాసములతో ఈ సంచిక ఒప్పుచున్నది. సాలుచందా పదకొండుఅణాలు. విడిసంచిక అణా. సంపాదకులు, ప్రకాశకులు: పి. వేంకటరామయ్యగారు. కార్యస్థానము: తెనాలి.

### ౨౯. సత్యవాణి

'సత్యకంఠముతో సర్వవిషయాలూ చర్చించే విశాఖపట్నం జిల్లా' వారపత్రిక. అనకాపల్లినుండి ప్రతి ఆదివారము వెలువడుతుంది. తొలిసంచిక 20-5-34 తేదీని వెలువడినది. స్వవిషయములో ఇట్లున్నది: "విశాఖపట్నమండలం విద్యుద్వేగంతో అభివృద్ధిపొందుతూ ఉన్నది. ఆంధ్రవిశ్వవిద్యాలయం నెలకొన్నది. ఓడరేవు ఏర్పడ్డది, విమానాశ్రయము నిర్మింపబడుతున్నది. ఇంతెందుకు ఆంధ్రులకు రాజధానీనగరం కాబోవుతున్నది విశాఖపట్టణము. ఈలాంటి మండలంలో పత్రికలెంత అవశ్యమో వ్రాయడం అనవసరం. సత్యకంఠంతో జిల్లాపురోభివృద్ధికోసం సేవచేసేసంకల్పమే సత్యవాణి జన్మించడానికి కారణం. మేడలమీద శయనించే శ్రీమంతులనీ నేలదున్నుకొనే కర్షకునీ, కూలిచేసుకొనే కార్మికునీ, ఊరిబయటనున్న హరిజనుణ్ణీ ఒక్క విధముగానే సత్యవాణి సేవచేస్తుంది. మండల పురోభివృద్ధితో పాటు ఆంధ్రరాష్ట్రనిర్మాణము, ఆంధ్రజాతి ఔన్నత్యము, ఆంధ్రవిజ్ఞానవికాసం సత్యవాణికి ఆదర్శాలు." ఇట్టి ఉన్నతాదర్శములతో వెలువడుచున్న ఈ పత్రికకు మల్లవరపు సుబ్బారావు బి. ఏ. బి. ఇ. డి గారు సంపాదకులు. శ్రీ సుబ్బారావుగారు యువకులును, పత్రికానిర్వహణోచితసైపుణీసంపన్నులును, హూణాంధ్రభాషావిశారదులును అయి ఉన్నారు. అగుట వారి యాజమాన్యమున 'సత్యవాణి' సముచితమగు అభివృద్ధి నంది తీరునని మేము గాఢముగ విశ్వసించుచున్నాము. సాలుచందా అనకాపల్లిలో 2-0-0. బయటవూళ్ళలో 2-8-0.

### ౩౦. కౌమోదకి

నంద్యాలనుండి వెలువడుచున్న పక్షపత్రిక. కౌమోదకి లోగడ కొంతకాలము ప్రచురింపబడి నిలచిపోయినది. ఇపుడు పునరుద్ధరింపబడి ప్రచారమునకు కడంగినది. ప్రస్తుతము రాయలసీమకంతకును ఇది యొక్కటియే పత్రికయగుట దీనిరాక ఆంధ్రులకు మఱియింత ఆమోదకరమైనది. ఉచితజ్ఞులగు డాక్టరు కైప సుబ్రహ్మణ్యశర్మగారు (ఏ. ఎం. ఏ. సి) దీనికి సంపాదకులగుట వైద్యవిషయము లిందు ప్రధానాంగముగ నొనర్చిరి. విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడిన తృతీయసంపుటపు నాలుగవసంచికలోని అశ్వగంధాది పానీయము, త్రిఫలాచూర్ణము, వైద్యవరుడగు నాగాపండితునిగూర్చిన శాసనవివరము, అనువిషయములు ఇందుకు నిదర్శనములు. 'పత్రికకు వైద్యవిషయములనేగాక భారతదేశాభ్యుదయమునకు మానవప్రయోజనముల నన్వేషించుట ప్రధానోద్దేశ్యమై యున్నది' అని సంపాదకులు తెలుపుచున్నారు. సాభిప్రాయవార్తలు, ఇతరములగు సంపాదకీయములు చదువదగియున్నవి. ఈ సంచికలో మధురకవి నాళము కృష్ణారావుగారిని గూర్చి వచనరచనాధురీణులగు మున్నంగి లక్ష్మీనరసింహశర్మగారు వ్రాసినపంక్తులు ఆంధ్రులెల్లరును చదువదగియున్నవి. ఈ పత్రిక పలువత్సరములు మని రాయలసీమాంధ్రుల సేవించుగాక యని కోరెదము. సంవత్సరపు చందా 2—0—0.

# సంపాదకీయ సమాలోచన

**బర్మా ఆంధ్రనాయకునకు పరాభవము:—**

బెజవాడలో ఒకసారి ఆల్ ఇండియా కాంగ్రెసుకమిటీ కూడినది. ఆ సభకు భారతదేశము పలుముఖములనుండియు నాయకమహాశయు లరుదెంచిరి. సాధారణసమయములయందే సమ్మర్దదారుణముగనుండు బెజవాడస్టేషను ఆ సభజరుగుదినమున జనసముద్రమైనది. గాంధి మహాత్ముడును వచ్చినాడు. రైలుదిగి గేటువద్దకు వచ్చినాడు. సాధారణముగ ఆతడు ప్రయాణము చేయునపుడెల్ల టిక్కెట్టు అనుచరులలోనే ఎవరో ఒకర్నకొని వారివద్దనే వుంచుకొనుటవాడుక. నాడును అట్లే జరిగినది. కాని టిక్కెట్టుగల ఆ అనుచరుడు ఆ జనులను ఒత్తిగించుకొని గాంధివెనుక పోలేక పోయినాడు. గాంధీ గేటుదగ్గరకురాగానే టిక్కెట్టు కలక్టరు ఆతడెవరో సామాన్యుడనుకొని టిక్కెట్టు అడిగినాడు. అనుచరునికొఱకు గాంధి అటుయిటు చూచినాడు. బెజవాడవంటి పెద్దస్టేషనులలోని టిక్కెట్టుకలక్టరులకు జబర్దస్తీ ఎక్కువ. ఆతని పిడికిటినిండ వసూలుచేసిన టిక్కెట్లు ఉన్నవి. అధికారగర్వముతో ఆచెయ్యి కదలించుచు ఆతడు గాంధిని పేరుచెప్పుమన్నాడు, గాంధి చెప్పినాడు. కలక్టరుగారికి మైకము వీడినది. ఆతని చేతిలోని టిక్కెట్ల దొంతర అప్రయత్నముగ రాలిపోయినది. ప్రార్థనారంజకమగు అంజలికి ఆతని చేతులు జతపడ్డవి. టిక్కెట్టు ఒకరిదగ్గర వుండుటచే ప్రయాణికులకు గలుగు సంఘటనములలో- గాంధికి జరిగిన పైవృత్తాంతము అతిచమత్కారముగ నున్నది; బర్మాఆంధ్రప్రముఖులలో నొకరగు శ్రీ గుత్తుల సూర్యనారాయణగారికి జరిగిన క్రిందివృత్తాంతము అతివిషాదకరమైనది. శ్రీ సూర్యనారాయణగారీనడుమ రంగూనునుండి స్వదేశమునకు వచ్చుచుండిరి. కట్టా వెంకటరెడ్డిగారు (బి. ఏ) సూర్యనారాయణగారి సెకండుక్లాసు టిక్కెట్టు తమవద్ద ఉంచుకొని ఓడయెక్కి అధికారుల అనుమతితో వారి సామానును సర్దించుచుండిరి. ఇంతలో సూర్యనారాయణగారు ఓడపైకి వచ్చుటకై చీడీవద్ద నిలువబడియున్న అధికారి సమ్మతిగొని ఓడలోనికి వచ్చుచుండగా మొదటిదర్వాను విడిచిపెట్టెను. రెండవదర్వాను సూర్యనారాయణగారి రెక్కపట్టుకొని టిక్కెట్టునడుగగా ఓడలో నున్నదనియు, అధికారి వుత్తరువు తోడనే తాను లోపలికివచ్చుచున్నాననియు తెలిపిరి. కాని దర్వాను వినిపించుకొనక చేతి దురుసుతనముతో వారిని గెంటెను. ఇది తప్పని చెప్పబోయినవారిని దర్వానులు కొట్టసాగిరి. బర్మా ఆంధ్రనాయకులలో నొకరు- పలుకుబడిగల శెట్టిబలిజయువజనసంఘాధ్యక్షులు అగు శ్రీ సూర్యనారాయణగారికిట్టి పరాభవము జరుగుటతోడనే రంగూను ఆంధ్రులలో కొంత అలజడికలిగినదని 'ఐరావతి' పత్రికవలన తెలియుచున్నది. ఈ దురాగతము జరిగినది స్కిండియానావిగేషన్ కంపెనీవారి ఓడవద్ద. ఈ కంపెనీవారు ఓడలు తెలుగురేవులకు నడుపువారయ్యు తెలుగువారనిన మిక్కిలి నిర్లక్ష్యముగు చూతురని

ఐరావతీపత్రికలో ఈ నడుమ ప్రచురింపబడు చున్న వ్యాసములు చెప్పుచున్నవి. విశాఖపట్టణమున ఈ కంపెనీవారి రిక్రూటర్లు, ఏజెంట్లు ప్రయాణీకులను బడితలతో బాదుట అవుడు కాదట విశాఖపట్టణమునందలి ఆంధ్రనాయకులు ఈ విషయమై విచారించుటలెస్స ఆంధ్రుల కందఱకును మాతృసంస్థయగు ఆంధ్రమహాసభ సరిగ పనిచేయుచున్నచో ఇట్టి విషయములందు కలుగజేసికొని వలయు ఒత్తిడిని కలిగించి ఆంధ్రులకు సౌకర్యములు కలిగింప గలిగియుండును. ఆంధ్రు డట్టిభాగ్యమునకు నోచిపుట్టలేదు. ఓడరేవులగు కాకినాడ, విశాఖపట్టణము, కళింగపట్టణము, గోపాలపురము మొదలగు తావులయందలి నాయకులైన ఈ విషయమై కొంత శ్రద్ధవహించి పనిచేసి రంగూనులో మన ఆంధ్రసోదరులు గావించుచున్న ఆందోళనకు ఆసరా అగుట గాఢముగ వాంఛింపదగినది.

ఆంధ్రసినేటు ఎలక్షనులు:—

ఆంధ్రసినేటుకు రిజిష్టర్డుగ్రాడ్యుయేట్ల తరపున మూడుస్థానములకు సెప్టెంబరు మాసమున ఎన్నికలు జరుగనున్నవి. లోగడ ఎన్నికలను పరిశీలించితిమేని అందు జయమందినవారు ప్రాయకముగా స్థానికసంస్థలకు చెందినవారును, కళాశాలాధ్యక్షులును, కళాశాలాధ్యాపకులును అయిఉండుట తేటతెల్లమగును. అయితే స్థానికసంస్థలసభ్యులకు, కళాశాలాధ్యక్షులకు సినేటులో ప్రత్యేకస్థానములు గలవు. వారు తమ ప్రత్యేకస్థానములకుతోడు రిజిష్టర్డుగ్రాడ్యుయేట్ల తరపు స్థానములనుకూడ ఆక్రమించుచున్నారు. ఇది విచారింపదగిన విషయము, ఉద్యోగేతరులు (నాన్-ఆఫీషియల్సు) సినేటులో ప్రవేశించుటకు రిజిష్టర్డుగ్రాడ్యుయేట్లస్థానముల ద్వారమునతప్ప అన్యద్వారమున అసలువీలు లేదు. ఉద్యోగేతరులు ప్రవేశించినగాని సినేటువ్యవహారములందు మొగమోటముల జోక్యము తక్కువకాదు. కావున రిజిష్టర్డుగ్రాడ్యుయేట్లు తమ తరపున ఉద్యోగేతరులనే సినేటునకు ఎన్నుకొనుట వాంఛనీయము. సెప్టెంబరుమాసమునజరుగు సినేటు ఎన్నికలకు నిలిచిన వుద్యోగేతరులగు అభ్యర్థులయందు తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురము నివాసులగు డాక్టరు తోలేటి కనకరాజుగారు (యల్. యమ్. అండ్ యస్) ఒకరు. శ్రీ కనకరాజుగారు వైద్యవృత్తియందు విశేషానుభవము కలవారు; మంచి ప్రాక్టీసు; వుత్సాహపూరితులు; వాఙ్మయము, చిత్రలేఖనము మున్నగు విజ్ఞానవిషయములందు అభినందనీయమగు అభిరుచి గలవారు. విశాఖపట్టణమునందలి వైద్యకళాశాల విశ్వవిద్యాలయము వారి యాజమాన్యముక్రిందకు త్వరలోవచ్చు సూచనలు గలవు. అట్టియెడ అనుభవము, అర్జన గల శ్రీ కనకరాజుగారివంటి వైద్యవరులు సినేటునకు ఎన్నుకొనబడుట ఎంతయు కోరదగినది. విశాఖపట్టణ వైద్యకళాశాల నిర్వహణక్రమముతో కనకరాజుగారికి సుపరిచయము కలదు. దాని అభివృద్ధికి అవసరమైన విషయములు వారు బాగుగ గుఱుతెఱింగియున్నారు. మోమోటములకు లొంగని— అధికారులవైపు మొగ్గని స్వతంత్రమైన చిత్తవృత్తిగల కనకరాజుగారివంటివారి ప్రవేశము సినేటునకు క్రొత్తబలమునుకూర్చును.

[‘భార్యలు బయట ఉన్నప్పటి మగవాళ్లవంటలు’ అను హాస్యవ్యాసమును; ‘రామప్రియ, నాకాభంగము’ లనుగూర్చిన విమర్శకవ్యాసములును కారణాంతరములచే ఈ సంచికయందు చేర్పలేకపోయితిమి. ఆగష్టు సంచికలో ప్రచురింపబడును. సంపాదకుడు]

# ఇన్స్యూరెన్సు విషయములు

## భీమా ప్రచారము

మనదేశంలోకూడ భీమావ్యాపారము పూర్తిగా అభివృద్ధికి రావలయునన్న తగిన ప్రచారము ఉండినకాని సాధ్యపడదన్నవిషయం ఎల్లరకు విశదమే. ప్రచారమునకు అనేకమార్గాలువున్నా, పత్రికల ప్రచారము ముఖ్యమైన మార్గాలలో ఒకటి అనిచెప్పక తప్పదు. అట్టి ప్రత్యేకపత్రికలు మన ఆంధ్రభాషలో మొన్నమొన్నటివరకు బొత్తిగాలేవు. ఇప్పు డిప్పుడే "భీమా పత్రిక" అను మాసపత్రిక మ-రా-శ్రీ నూరంపూడి కనకరాజు పంతులుగారి సంపాదకీయముక్రింద ప్రచురింపబడుచు ఆంధ్రలోకానికి భీమాతత్వమును వెల్లడించుటలో పాటుబడుచున్నది. ఒక భీమాపత్రిక చాలదనిన్ని, ఇంకను వార, పక్ష, మాస పత్రికలుప్రబలి, భీమా సూత్రములను మూలమూలలకు వెదజల్లు ప్రయత్నములను సలుపవలెనని పలువుర అభిప్రాయము.

భీమా విషయమును చర్చించు పత్రికలు ఆంధ్రభాషలో ఇంకను అవసరమేకాని, భీమా విషయములనే కాక తదితరసామాన్యముగ సర్వవిషయములను గురించి చర్చించు పత్రికలుండి అందు భీమావిషయమునకుగూడ ప్రాముఖ్యము నొసంగిన ఎడల భీమాప్రచారము ఎక్కువగా సల్పుటకు వీలుండునేమో యని నాతలంపు.

భీమా తత్వములను పలువురకు తెలియజేయుటయే భీమాపత్రికల ముఖ్యోద్దేశమైనను భీమా విషయములను మాత్రమే చర్చించుచుండిన ఎడల సదరు పత్రికలు భీమా విషయములు తెలుసుకొనవలసిన వారి పలువుర దృష్టులను ఆకర్షింపజాలవు. భీమావిషయక పత్రికపేరు విన్నమాత్రముననే ఇతరులకు దానినిచదివి విషయములను తెలుసుకొనవలయునన్నవాంఛ చాలతక్కువగ నుండును. భీమాకంపెనీలలో పనిచేయు ఏజంట్లు వగైరా భీమావిషయములందు అభిరుచి గలవారలకు మాత్రమే సదరు పత్రికలు ఉపయోగపడి, ఎక్కువగా ఎవరికొరకు సదరు పత్రికలు ఉపయోగింపబడదలచినవో వారికట్లు ఉపయోగపడుటకు వీలులేదేమో యని నాసంశయము. కావున, సర్వవిషయములు చర్చించు పత్రికలు ఉండి, అందు భీమా విషయములకు పూర్తి ప్రాముఖ్యమును ఇచ్చినఎడల తలవని తలంపుగానైనను భీమా విషయములనుగూడ పలువురు తెలుసుకొనుటకు వీలుండును. అట్టి పత్రికలవల్లనే నిజమైన ప్రచారము కొనసాగింపబడగలదు. ఇప్పుడు కావలసియున్నవి అట్టి పత్రికలే.

ఆంధ్రభాషలో నిర్వహింపబడుచున్న మాసపత్రికలలో అన్నివిషయములను చర్చించుచు, భీమా విషయములనుగూడ ప్రాముఖ్యము నొసంగుచున్న 'ఆంధ్రభూమి' ఈ లోపమును కొంత తీర్చుచున్నదని చెప్పవచ్చును.

ఒక కంపినీ మరియొకకంపిని పద్ధతులలో కొలది మార్పులు ఉండినను, మూలసూత్రములలో మార్పులు ఉండుటకు అవకాశములులేవు గనుక ఇతరదేశములలోవలె, మన దేశములోకూడ భీమా సూత్రములు, సిద్ధాంతములు వాటి పలువిధములైన ఉపయోగములు, భీమా వ్యాపారము దేశకళ్యాణమునకు ఎట్లు దోడ్పడునో తెలియపరుచు విషయములను అన్ని హిందూదేశకంపినీలవారికి అన్వయించు ఏకప్రచారమే ముఖ్యము. దీనివలన కంపినీలవారికగు ప్రచారములఖర్చు

తగ్గి ఉపయోగము ఎక్కువ అగుటకు వీలుండును. ఈ విషయములు కంపెనీ అధికారులు గమనించి వారందరు కలసి ఏకప్రచారమునకగు ఏర్పాటులుచేయుట మంచిది.

నూటికి సుమారు పదిమంది అయినను చదువగలిగినవారు లేని మనదేశంలో పత్రికప్రచారమువల్లనే పూర్తిగా ప్రబోధము కలిగించడము చాలకష్టము. నూటికి 90 మంది చదువురానివారు. వారలలో భీమా తత్వము పురికొల్పవలెనన్న పత్రికప్రచారమువల్ల కలుగు ప్రయోజనము చాలస్వల్పము. కావున సామాన్యమైన వారిలోనున్ను, భీమాయొక్క పూర్తిఫలితములను పొందవలసినవారిలోనున్ను భీమాఉపయోగములు తెలియునట్లు చేయవలయునన్న ఎక్కువగ ఉపన్యాసములద్వారానే కలుగవలయుగాని మరిఏఇతరమార్గములవల్ల నయినను పూర్తిఫలితములు పొందుటకు అవకాశము ఉండదేమో. కనుక అన్ని హిందూదేశపుకంపెనీల తరపున కొందరు ఉపన్యాసకులను ఏర్పాటుచేసి గ్రామములలోను, పట్టణములలోను ఉపన్యాసముల ద్వారా ప్రచారము చేయించినచో ఫలితము ఎక్కువకలుగుటకు వీలుండును.

ఇతరదేశములలో పూర్తిగా చదువుకొనినవారుండినను ప్రచారవిషయములలో వింతవింత మార్గములు అవలంబించుచున్నారు. అట్టి అన్నిమార్గములు మనదేశములో వెంటనే అమలులోపెట్టుటకు అనేకమైన అభ్యంతరములు ఉండినను ముఖ్యమైన ఒకటి రెండు మార్గములు అవలంబించుటకు కష్టముండదు. పూర్తిప్రచారములేనిదే ప్రజలకు భీమావిషయము తెలియజేయుటకు సాధ్యపడదు. ప్రజలు పలువిధములైన లాభములను గుర్తెరింగినగాని భీమావ్యాపారము మనదేశములో సంతుష్టికరముగ పనిచేయుటకు వీలులేదు. కనుక ప్రచారము వల్ల కలుగు ఉపయోగములు పలుకంపెనీలవారు గమనించి ఏఏ మార్గములద్వార భీమావ్యాపారము అచిరకాలములో అభివృద్ధిచెందించుటకు వీలుండునో ఆమార్గములు అరసి భీమా వ్యాపారము పెంపొందించి దేశముయొక్క కల్యాణమునకు, దేశజులఔన్నత్యమునకు దోడ్పడవలయునని కోరుచున్నాను.

—యం. యస్. ఆర్. ఎ. గుప్త.





# "జయ్ విజయ"

## (పూర్వపు జయ్‌భారత్ ఇన్సూరెన్సుకంపెనీ)

ఆంధ్రులకు సుపరిచయమైయున్న 'జయ్‌భారత్'కు 'జయ్‌విజయ' అనునది నూతననామము. 1931-వ సంవత్సరమున శ్రీయుతులు ఉప్పుటూరు వెంకటపున్నయ్య, దరిశి చెంచయ్యగార్లచే స్థాపింపబడి జయ్‌భారత్ ఇన్సూరెన్సుకంపెనీ గతమూడు వత్సరములలో ముప్పది వేలమంది పాలసీదార్లను సంపాదించి, దాదాపు అయిదులక్షల రూపాయిలను క్లెయిములక్రింద చెల్లించి, లక్ష రూపాయిల కిమ్మతుచేయు ఆస్తుల (ఎసెట్సు) సేకరించి, ప్రభుత్వమువారివద్ద వలయు సెక్యూరిటీని డిపాజిట్టుచేసి ప్రజాలోకమున అర్హమగువ్యాప్తిని గాంచినది. నామసాదృశ్యమునకు లాహోరునందలి భారత్ ఇన్సూరెన్సుకంపెనీ ఈ కంపెనీపై డిక్రీపొందిన కారణమున 'జయ్‌భారత్' అనుపేరు గతమాసము 15-వ తేదీనుండియు 'జయ్‌విజయ'గా మార్చబడినది. మదరాసు వైశ్యనాయకులలో వర్ధమానచంద్రులగు శ్రీయుత సామి వెంకటాచలం చెట్టిగారు ఈ కంపెనీయొక్క డైరెక్టరు బోర్డు అధ్యక్షులు; పున్నయ్య చెంచయ్య అండుకో వారు మేనేజింగు ఏజెంట్లు; శ్రీయుత జమిలి సమ్మాశ్వారయగారు మేనేజింగు డైరెక్టరులు. నూతన నామముతో వ్యవహరింపబడుచున్న ఈ కంపెనీ సామాన్యజనులకు ఉపయోగపడునట్లు నెలవాయిదాల పద్ధతులతో, ధారాళమగు షరతులతో క్రొత్త యిన్సూరెన్సు పద్ధతులను ఏర్పాటుచేసినది. 250-500 రూపాయిలకు కూడ పాలసీలిచ్చుటకుపూని కంపెనీవారు తమ ప్రజాహితకాంక్షను చూపుచున్నారు. నెలవాయిదాల పద్ధతిని ప్రీమియములుచేకొన ఈ కంపెనీవారు గావించిన క్రొత్త ఏర్పాటు పేదలకుకూడ అందుబాటునసుండి వారికి పొడిమి నలవఱచుటలో తోడ్పడగలదు. తెలుగువాడు నా సొంతము అని చెప్పుకొనగల అయిదు, ఆరు ఇన్సూరెన్సుకంపెనీలలో ఒకటియగు ఈ 'జయ్ విజయ' యథారీతిని అభివృద్ధినందుగాక యని హృదయపూర్వకముగ కోరెదము.

# జీవిత భీమా: కొన్ని ఆలోచనలు

## 3

## భీమా పద్ధతులు

జీవితభీమా అనగా ఏమో, అది మనజీవితయాత్రలో ఏవిధముగా నుపకరిస్తుందో మొదటిరెండు వ్యాసముల వలన తెలిసికొన్నాము. వృద్ధాప్యములో అక్కరకు వస్తుందనీ, అకస్మికముగా మృత్యువువాతబడినట్లయితే కుటుంబమునకు సహాయంగా వుంటుందనీ ఇదివరకే వ్రాసియున్నాము. ఈ వ్యాసములో వ్రాయబడిన విషయములు బాగుగా అర్థంకావాలంటే పై సంగతులు జ్ఞాపకం వుంచుకోవాలి.

భీమాఅనగా "తన భవిష్యత్తును గురించి జాగ్రత్త పడదలచిన వ్యక్తికిన్ని, భీమా వ్యాపారము చేయుటకు ఏర్పడిన వ్యాపార సంస్థకును జరిగిన ఒడంబడిక కదా. ఇట్టి ఒడంబడికలలో చాల పద్ధతు లున్నవి. ఈపద్ధతులన్నియూ పై విషయమున కుపకరించు విధమున నేర్పాటు చేయబడినవి.



శ్రీయుత జమ్మిలి నర్సా శ్వారుగారు.

### 1
### యావజ్జీవిత భీమా
### (Whole life)

ఈపద్ధతియందు భీమాచేయదలంచిన వ్యక్తి తనజీవితాంతమువరకును సంవత్సరమునకింత చొప్పున కంపెనీ వారికి చెల్లింపుటకు ఒప్పుకొనును. ఈ మొత్తమును సాలీనా రుసుము (Yearly Premium) యని పిలుస్తారు. సదరు మొత్తాన్ని పుచ్చుకొని, సదరు పాలిసీదారుడు చనిపోవునప్పుడు, అతని వారసులకు గాని లేక, ఎవరికి చెందవలెనని సదరు పాలిసీదారుడు లిఖితపూర్వకముగా తెలియజేసియుండెనో వారికిగాని కంపెనీవారు నిర్ణయమైన మొత్తాన్ని యిస్తారు. ఇది చాల ప్రాచీనమైన పద్ధతి. పూర్వకాలములో యీ పద్ధతిమీదనె చాల

వ్యాపారము నడిచినది. కాని యిందు చనిపోవువరకును పాలీనారుసుములు చెల్లించవలసి యుండుటచేతను, దీర్ఘకాలం జీవించువారు, తమవృద్ధాప్యమునందు, కష్టపడి సంపాదించు కాలము గడిచిన తరువాత, యీ భారమును వహించుటకు యిష్టము లేకపోవుటవలనను ఈపద్ధతి చాలచౌకపద్ధతి యయినప్పటికి ప్రజలు ప్రస్తుతం మన్నించుటలేదు.

అందువలన కొన్ని కంపెనీలవాండ్లు రుసుము చెల్లించవలసిన గడువు 70 ఏండ్లువరకని నిర్ణయం చేస్తున్నారు. అంటే పాలిసీదారునకు 70-వ సంవత్సరము వచ్చిన తరువాత అతడు రుసుములను చెల్లించనవసరములేదు.

2

## మితవాయిదాల యావజ్జీవితభీమా
## (Whole life with Limited Payments.)

పై పద్ధతియందు చెప్పబడిన యిబ్బందులను తొలగించుటకు ఏర్పడిన దీపద్ధతి. ఇందులో జీవితాంతము వరకుగాని, 70సంవత్సరములవరకు గాని పాలినారుసుముల చెల్లించ నవసరములేదు. పాలిసీదారుడు ఎంతకాలము వరకు, ఎట్టియిబ్బంది పడకుండా రుసుములను చెల్లించగలనని తలంచునో అంతవరకు వాయిదాను తానే నిర్ణయించుకొనును. సామాన్యముగా 55-వఏటితో వాయిదాలు పూర్తియగునట్లు చాలమంది నిర్ణయించుకొంటున్నారు. అప్పటితో ఆర్జనశక్తి తగ్గుతుందనీ, ఏవిధమైన బాధ్యతలులేక హాయిగా కాలముగడుపుకో వచ్చునని వీరి యభిప్రాయం. ఇందులో తాను కంపెనీకి ఎంతచెల్లించవలెనో తెలిసియుండును. వాయిదాపిమ్మట చెల్లించ నవసరములేదు. భీమా మొత్తమును పాలశీదారుడు చనిపోయినప్పుడు ఒకటవ పద్ధతియందు చెప్పబడిన ప్రకారము చెల్లిస్తారు. ఇందులో పాలినారుసుమమాత్రము మొదటిదానికంటె హెచ్చుగా నుండును.

3

## మితవాయిదాలభీమా
## (Endowment Assurance.)

ఇది పైనవ్రాయబడిన రెండు పద్ధతులకంటె చాల యుత్తమమైనదని పేరుపొందింది. ఇప్పుడు ప్రపంచములో జరిగే భీమావ్యాపారంలో మూడుపాళ్ళు యీ పద్ధతిలోనే జరుగుతుంది. దీనిలో రుసుము హెచ్చు. అయినప్పటికీ ప్రజలు దీనిని చాలగొప్పగా గౌరవించి ఆమోదిస్తున్నారు. ఇందులో మెరుగు ఏమిటంటే, నిర్ణయించుకొన్న వాయిదాలు ముగిసినపిమ్మట, భీమామొత్తాన్ని, పాలిసీదారునకు కంపెనీవారు యిచ్చేస్తారు. తాము కష్టపడి సంపాదించి, కూడబెట్టుకొన్న పైకము, పెద్ద మొత్తముఅయి తమచేతికి వస్తుందని ప్రతివారు యీ పద్ధతి అవలంబిస్తున్నారు. గడవులోపల తాము చనిపోవుట తటస్థించినయడల కుటుంబమునకు వస్తుంది. ఆకస్మికమరణం సంభవించినప్పుడు భీమారక్షణ, జీవించియున్నచో తన స్వార్జితమును తానసుభవించు భాగ్యము కల్గుతుంది గడువు నిర్ణయించుకొనుటలోగూడ రెండు పద్ధతులుగలవు. తానుచెల్లించు ప్రీమియమును, చెల్లించవలసిన సంవత్సరములు నిర్ణయించుకొనుట ఒక పద్ధతి. లేక తనకు యిన్ని సంవత్సరములు వచ్చువరకు రుసుములు చెల్లించుటయు, ఆవయస్సు నిండినవెంటనే సదరు మొత్తమునుపొందుట రెండవపద్ధతి. కొందఱు తమ షష్ఠిపూర్తియుత్సవమునకు ఖర్చులకుగాను భీమా చేయించెదరు

4

## ద్విగుణితమితవాయిదాల భీమా
## (Double Endowment Assurance.)

ఇది మూడవపద్ధతిలో చేరినదే. కాని యిందు గడువుకాలమువరకు పాలిసీదారుడు జీవించియున్నచో పాలిసీమొత్తమునకు రెట్టింపు కంపెనీవారొసంగెదరు. గడువులోపల చనిపోవుట తటస్థించినచో భీమామొత్తమునుమాత్రమె యిస్తారు. కాని రేట్లు మూడవపద్ధతికన్న హెచ్చు. దీని యుపయోగం అంతగా హెచ్చుగా లేదు.

5

## తాత్కాలికపు భీమా
## (Term Endowment.)

దీనిలో 3, 4 సంవత్సరాలకు మాత్రమే గడవు

పెట్టుకొని, ఆ గడువులోపుగ చనిపోయినచో కంపెనీ వారు మొత్తమును యిస్తారు. లేకపోతే యివ్వనే యివ్వరు. దీనిని ఏదైన తాత్కాలికపు దూరప్రయాణాలు చేసేవాండ్లు, విదేశాలకువెళ్ళి చదువుకొనేవిద్యార్థులకు సాహాయ్యంచేసే సంఘాలు విద్యార్థుల జీవితాల మీద, పెద్ద వ్యాపారసంఘముల్లో పెద్ద ఆఫీసర్లు విదేశాలకు వెళ్ళితే వారి జీవితాలమీద యీ పద్ధతిలో భీమాచేస్తారు. ఒక సంఘమువారు రు. 10 000 లు ఖర్చుపెట్టి ఒకనిని ఒకవిద్య నేర్చుకొనడమునకు జర్మనీ పంపిస్తారనుకోండి. అతడా చదువునేర్చుకొని వద్దిలోనికి వచ్చి దేశానికి ప్రయోజకుడైతేమంచిదే. లేక దురదృష్టవశాత్తు విదేశాల్లో చదువు పూర్తికాకమునుపు చనిపోతే, యీ సంఘమువారు పెట్టినఖర్చు వృథా అవుతుంది. అలాంటి సందర్భములలో యీ రకపు భీమా చాల ఉపకారిగా వుంటుంది. రేట్లు యిందులో చాల తక్కువ.

## 6

## సంయుక్త జీవితభీమా

## (Joint Life Policy.)

ఇందులో భార్యాభర్తలుగాని,ఒక వ్యాపారములో భాగస్తులుగాని కలిసి భీమా చేసికొనవచ్చును. ఈ యిరువురులో ఎవరు చనిపోయినను రెండవవారికి భీమా మొత్తమునిచ్చునట్లు ఏర్పాటుచేయబడును. పాశ్చాత్య దేశములలో భాగస్తులు యీ విధముగా భీమాచేయుట చాలహెచ్చు. ఇరువురు భాగస్వాములు వ్యాపారం చేయడానికి మొదలుపెట్టునప్పుడే, వారిలో ఎవరైనను ఒకడు అకస్మాత్తుగా చనిపోవునెడల ఆ చనిపోయిన వాడు కంపెనీలోపెట్టిన ధనమును, వాడు కంపెనీకి చేసిన కష్టమునకు తగిన ప్రతిఫలము, వాడి కుటుంబానికి తిరిగి యివ్వవలసివచ్చినప్పుడు, వాడు డబ్బులేక చాల కష్టపడవలసివస్తుంది. చెరి 50,000 పెట్టి ఒక ఫాక్టరీ కట్టించారనుకోండి. నాల్గు సంవత్సరాలు వ్యాపారం సాగించినతరువాత ఒకడు చనిపోయినట్లయితే, వాడి కుటుంబానికి కొంతడబ్బు హక్కు-విడుదలక్రింద యివ్వవలసివస్తుంది. అలాంటి సమయములలో పనికి వచ్చుటకుగాను ఇతరదేశాలలో గొప్పగొప్ప మొత్తాలు యీ పద్ధతిలో భీమా చేయిస్తారు.

## 7

## బాలబాలికల విద్యాసౌకర్యపుభీమా

## (Children's Endowments.)

పిల్లలు (చిన్నతనమునుండి వారు) పెద్దవారయి గొప్ప గొప్ప చదువులు చదవాలంటే వీలుగా వుండడమునకు ఏర్పడిన దీపద్ధతి. 16 సంవత్సరములు మించినతరువాత చదువుకు ఖర్చు ఎక్కువఅవుతుంది అందులకుగాను, బిడ్డచిన్నతనములోనె బిడ్డపేరుమీద భీమాచేస్తారు. ఆతనికి నిర్ణయమైన వయస్సువచ్చినపుడు, కంపెనీవారు ఒకేతూరిగాని, వాయిదాలమీదగాని భీమామొత్తమును యిస్తారు. ఇందులో పిల్లవానియొక్క గార్డియన్ యొక్కగాని తండ్రియొక్కగాని వయస్సునుబట్టి రుసుము నిర్ణయించెదరు. మధ్యకాలంలో గార్డియన్ చనిపొయ్యే యడల, యికముందు చెల్లించవలసిన సాలీనారుసుములు చెల్లించ నవసరములేకుండగనే, భీమామొత్తమును కంపెనీవారు యిచ్చివేస్తారు. గడువులోపల బిడ్డ చనిపొయ్యే యడల కట్టిన సాలినారుసుములను కంపెనీవారు వాపసు చేస్తారు. ఇదేమాదిరి బాలికల విషయంలో వివాహపు ఖర్చులనిమిత్తం యీ రకం భీమా ఆచరణలో వున్నది.

## 8

## సాంఘికపుభీమా

## (Group Assurance.)

ఈ పద్ధతి అమెరికాదేశములో విస్తారమైన ప్రచారంలోవున్నది. వందలు, వేలకొలది పనివాండ్లనేర్పరచి వ్యాపారముచేయు పెద్దపెద్ద వ్యాపారసంస్థలు, యంత్రాగారముల యజమానులు, తమకొరకై యావజ్జీవితమును ధారపోసిన కూలీలసంసారముల ఉపయోగం నిమిత్తం ఏర్పాటుచేయబడినది. ఈ పద్ధతిలో యజమానులు ప్రతికూలివాని మీదను వాని సంపాదన, యుపయోగమునుబట్టి భీమా చేయిస్తారు. సాలీనారుసుమును కొన్నిచోట్ల మొత్తముగాను, కొన్నిచోట్ల

వంతులుగాను, కంపెనీవారు భరిస్తారు. ఒకచోటునుంచి చాలవ్యాపారం వస్తుందనే కారణంచేతను, వాయిదా రుసుములను యజమానులె నేరుగాపంపించే ఏర్పాటుచేస్తారు కాబట్టి, భీమాకంపెనివారు తమరేట్లను తగ్గిస్తారు. ఈ విధమైన భీమావలన యజమానులయందు పనివాండ్లకు గౌరవంహెచ్చుతుంది. అకస్మాత్తుగా చచ్చిపోతే, కుటుంబానికి ఆధారమున్నదిగదా యని చాలసంతోషంగావుంటారు. కాని ఏకారణంచేతనైనా పనిపోయినట్లయితేమాత్రం రుసుములు చెల్లించడానికి కొంచెం యిబ్బంది పడవలసివస్తుంది.

కంపెనీవారు ప్రతివానికి ఒక పాలిసీయిస్తారు. డాక్టరు పరీక్షతోను, పరీక్షలేకుండగను పట్టాలు జారీచేయడంకద్దు. ఈ రకపు భీమా యింకా మనదేశంలో ప్రచారంలోనికి రాలేదు. ఈమాదిరి చిన్నచిన్న మొత్తములకు భీమాచేయడం, బీదవాండ్లకు అనుకూలంగా వుండడమునకుగాని, నెలసరి వాయిదాలపద్ధతిమీద వసూలు చేయడముగాని మన భారతదేశంలో కంపెనీలు యింకా మొదలుపెట్టలేదు. ప్రస్తుతం మద్రాసులోవున్న జయవిజయఇన్సూరెన్సుకంపెనీ మాత్రము యిలాంటి పద్ధతులమీద వ్యాపారంచేయడం మొదలుపెట్టింది.

## 9

## జీవితపర్యంతము ఆదాయపుపద్ధతి

## (Annuities.)

ఇది భీమాపద్ధతిగాదు. అయినప్పటికి, భీమా కంపెనీలన్నియు యీ వ్యాపారమును చేయడమునుబట్టి యిందులో దాన్నికూడా చేరుస్తారు. కంపెనివారు కొంత మొత్తాన్ని ఒకరివద్ద తీసికొని, ఆవ్యక్తి చనిపోవువరకు సంవత్సరమొకక్కంటికి యింతచొప్పున, యిస్తామని ఏర్పాటుచేస్తారు ఆవ్యక్తి చనిపోవుటతోడనే ఆ కంట్రాక్టు రద్దవుతుంది. సామాన్యముగా వడ్డీలకిచ్చి జాగ్రత్తగ వసూలుచేయుట, ఆస్తులుకొని పరిపాలించుట మొదలగు పనులుచేయుట కళక్కులేనవారు తను ధనమును యీ విధమున భీమా కంపెనీలలో దాచుకొంటారు.

—జమిలినమ్మాళ్వారు.



### దాగుడుమూతలపజుల్ సమాధానము.

1. పాపురము. 2. భద్రాచలము, 3. గౌతమబుద్ధ, 4. నాలుగు, 5. తులసీదాసు, 6. రామప్రియ, 7. మొసలి, 8. సరోజనీదేవి, 9. బ్రహ్మపుత్ర, 10. మకూచకము.

అన్నిటికిని సరియైన సమాధానములు పంపుటచే బహుమానధనము ఈక్రింది ఇద్దరకు పంచబడును.

(1) యస్. బి పి. బి. కె. యస్. నారాయణరావుగారు, కేర్ ఆఫ్, కపిలేశ్వరపురము జమీందారువారు, కపిలేశ్వరపురము, తూర్పుగోదావరి.

(2) రేపాక జగన్నాధముగారు, లాలీగోడ్డుపోష్టు, కోయంబత్తూరు.

### ఒక్కొక్కవిషయమున తప్పినవారు :

(1) క్రొత్త రామయ్యశ్రేష్టిగారు, నారాయణవరం, చిత్తూరు జిల్లా. (2) దామరాజు సుబ్బారావుగారు, మునుపల్లెపోష్టు, గుంటూరుజిల్లా. (3) ఆకెళ్ళ రామబ్రహ్మశాస్త్రిగారు, పి. ఆర్. కాలేజి, కాకినాడ.

### రెండేసివిషయములలో తప్పినవారు:

(1) పాలువాయి శ్రీనివాసరావుగారు, చింతాద్రిపేట, మదరాసు. 2. వసంతరావు అచ్యుతనరశింగరావుగారు, బాడువ. 3. యమ్. వి వి. రావుసతిగారు, కాళీఘట్టం, కలకత్తా. 4. చావలి సుందరశివరావుగారు, నిజాంపట్నం. 5. గద్దే వేంకటనారాయణరావుగారు, యలమర్రు. 6. శ్రీమతి చాగంటి సత్యవాణిగారు, కేర్ ఆఫ్, సి. హెచ్. శంకరశాస్త్రిగారు, ఏలూరు. 7. రామవరపు సుందరరావుగారు, విజయనగరం. 8. కె. కృష్ణారావుగారు, చెమ్మన్నగిరిపేట, బందరు. 9. యాతం సత్యనారాయణగారు, పార్వతీపురం. 10. శ్రీమతి మంగపాటి సీతామహాలక్ష్మిగారు, కేర్ ఆఫ్ యల్. వి. సుబ్బారావుగారు, తెనాలి.

బహుమానము పొందినవారు ఆధనమును భాగవతాది గ్రంథములను కొని పంపమనుటగాని, సొమ్ము మనియార్డరు చేయమనుటగాని, ఆంధ్రభూమికి చందాగా జమకట్టమనుటగాని మాకు తెలిపినవెంటనే ఆమేరకు వారి ఆజ్ఞలు నిర్వర్తింపబడునని మనవి.

# అవలోకనము

ఆంధ్రభూమి ప్రియులు, మే సంచికలయందు క్రమముగా 'జెకోస్లావాకియా రాజ్యనిర్మాణము'; 'ప్రెసిడెంటు మాసరిక్' అను వ్యాసములను వ్రాసిన శ్రీ వి. జగన్నాధస్వామి బి. ఏ గారు ఈ సంచికలో 'జార్జిలాన్సుబరీ జీవితారంభపుదినములు' అను వ్యాసమును వ్రాసియున్నారు. వ్యాసముపంపుచు వారు మాకు లేఖలోవ్రాసిన క్రిందివాక్యములు వ్యాసపాఠకులుకూడ తెలిసికొనదగియున్నవి. "బ్రిటీషులేబరు పార్టీ నాయకుడగు లాన్సుబరీ ఆండ్రూసువలె సర్వవేళల భారతదేశహితమును కోరువాడు. అతని నాయకత్వమున బ్రిటీషు లేబరుపార్టీవారు రౌండుటేబిలు సభలను బహిష్కరించి భారతదేశ పూర్ణ స్వరాజ్యము పట్ల తమకుగల ప్రేమాభిమానములను చాటిరి. 1933 వ సంవత్సరము డిసెంబరు 9-వ తేదీని అతడు గెయిన్సుబరీ పురమందిరమున ఉపన్యసింప పోయినపుడు కాలు జారిపడుటచే తొడయెముక విరిగినది. అతడాకారణమున ఆస్పత్రిలో ఉండగా వచ్చిన సానుభూతిలేఖలకు లెక్కలేదు. 'న్యూస్ ఆఫ్ ది వరల్డు' అనుపత్రికవారికోరికమీద అతడు ఆస్పత్రిలో ఉండినప్పుడే తన జీవితారంభపుదినములనుగూర్చి వ్యాసము వ్రాసినాడు. నా వ్యాసము దానికి తెనిగింపు. 1929-వ సంవత్సరపు లేబరుమంత్రివర్గమున ఫస్టు కమీషనరు ఆఫ్ వర్క్సుగా ఉండిన ప్రజ్ఞావంతుడు, నేడు పార్లమెంటులో అపోజిషన్ నాయకుడుగా ఉన్నవాడు తన తొలుతటి దినములలో తిండికొఱకు ఎంతకష్టపడెనో ఈ వ్యాసము చెప్పుచున్నది. జార్జిలాన్సుబరి సతి 1932 మార్చి మాసమున చనిపోయినది."

* * * *

శ్రీయుత దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారి 'తాకితే మూగవాళ్ళు' అనుకథను ముఖ్యముగ పఠింపవలసినదిగ మా సోదరీమణులను కోరెదము. 'పూరిసుబ్బు' వంటి తంటాలమారిస్త్రీలవల్ల కలుగుఇబ్బందులు గమనించి తెలివిగల సోదరీమణులు అట్టివారికి సాధ్యమగునంత ఎడమైయుండుట మంచిది. వ్యాససారాంశము: మాటలు రాని పిల్లలు ఒకరినొకరుతాకితే మూగవాళ్ళు అగుదురను నమ్మకము మూఢమైనదని. కాదని నిరూపింపగలుగుటకు తమ ఎఱుకలో ఏమైన ప్రత్యక్షనిదర్శనములున్నచో సోదరీమణులు మాకు తెలిపిన 'ఆంధ్రభూమి' లో ప్రచురింపగలము.

* * * *

తెనుగువారి సొంతములైన ఐదు, ఆరు భీమాసంస్థలలో నొకటియగు స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అన్స్యూరెన్సుకంపెనీ అధ్యక్షమహాశయులగు శ్రీయుత యమ్. యస్. ఆర్. ఎ. గుప్తగారు ఈ సంచికలో 'ఇన్స్యూరెన్సువిషయములు' అను శీర్షిక క్రింద భీమాప్రచారమునుగూర్చి ఒక చక్కనివ్యాసమును వ్రాసియున్నారు. గ్రామములలోను, పట్టణములలోను భీమాప్రచారముగావించుటకు భీమా కంపెనీలన్నియు కలిసి కొందఱు ఉపన్యాసకులను నియమించి వ్యవహరింపవలయునను శ్రీ గుప్తగారిసలహా సమంచితమును, సమాదరణీయమును అయిఉన్నది. ఇన్సూరెన్సు కంపెనీ యజమానులీవిషయమై ఆలోచించుటలెస్స.

* * * *

'సుకారీ, లంబాడీ, మరాటీ' చదివి ఆనందించుటకు కొంచెము ఆలోచనవలయును. నిరంతరము పరిభ్రమించుచుండు సూర్యచంద్రులు భూమ్యాకాశములు కలియుచోట ఉద్భవిల్లుచున్నట్లు కనిపించునట్లే స్థిరనివాసములేక నిరంతరము ఒక ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమునకు పరిభ్రమించుచుండు సుకారి, లంబాడీ, మరాటీల జననముగూడ కనిపించును. సుకారీ, లంబాడీ, మరాటీలవంటి నొమాడ్సుయొక్క జీవనపద్ధతిలోని ఆంతర్యమును ఈ వ్యాసము ప్రదర్శించుచున్నది. నొమాడ్సువంటి మన కలలకు రక్షకభటుడు నిద్ర. రక్షకభటుడు ఉన్నను వాని సంచారము, వాని విధానము సాగుచునే యుండును.

—సంపాదకుడు.

# చౌదరీస్ మెడికలు రిసెర్చి యిన్‌స్టిట్యూట్

దేని నిగ్గు అయినను పరిశోధనలవలననే తేలును. అసాధ్యములుగానుండిన రోగములెన్నియో మహాశయుల పరిశోధనలవలన నేడు చికిత్సాసాధ్యములై మానవలోకసౌఖ్యాభివృద్ధికి కారణభూతములగుచున్నవి. అయితే పరిశోధకుల చరిత్రలను పరికించితిమేని వారు వారి పరిశోధనారంభదినములలో చాల కష్టనష్టములకు గురియైయుండుట తెలిసివచ్చును. పరిశోధకులు కష్టనష్టములకు గురియగుటయేకాదు వారి పరిశోధనాఫలితము ప్రజ లొకపట్టున విశ్వసింపరు. టీకాలు మశూచికరోగావరోధమునకు ఎట్లు తోడుపడుచున్నవో నేడు ఎల్లరకును తెలిసినవిషయమే. కాని టీకాలు ప్రారంభింపబడిన ఆదిలో వానిని వేయించుకొనుటకు ప్రజలిష్టపడకుండిరి. ఇష్టపడకపోవుటయే గాదు టీకాలు వేయించుకొన్నచో ఆవులవలె కొమ్ములు మనుష్యులకుకూడ మొలచునని ప్రచారముసల్పిరి. అట్టి టీకాలు నేడు ప్రతినాగరికప్రభుత్వమువారిచేతను తమ ప్రజలకు విధింపబడియున్నవి. అయితే నేటి పరిశోధనల చరిత్రపుటలలో పాశ్చాత్యులే ఎక్కువగ కనిపింతురు. భారతీయులలో అందు ముఖ్యముగ ఆంధ్రులలో పరిశోధకులు మిక్కిలి తక్కువ. ఆంధ్రులగు కొంతి కామేశంగారి పరిశోధనలు ప్రభుత్వమువారి మన్ననలను బడసినవి. శ్రీ గారపాటి ఆంజనేయచౌదరిగారి క్షయ, మహాచక, కుష్ఠురోగ పరిశోధనలనుగూర్చి గతమాసపు సంచికలో కొంత వివరించియుంటిమి. అయితే శ్రీ చౌదరిగారి పరిశోధనలింతవఱకు ఉపన్యాసస్థితిని దాటలేదని చెప్పవలసియున్నది. బొంబాయి, పూనా, మదరాసు మొదలగు తావులయందు మహోపన్యాసములు గావించి శ్రీ చౌదరిగారు తమ పరిశోధనలను బహిరంగపరచి పలువురు వైద్యమహాశయుల ఆమోదమును, అభినందనములను అందియున్నారు. వారు ప్రస్తుతము నూజవీడున కనతిదూరముననున్న వాలికోటయందు 'చౌదరీస్ మెడికలు రిసెర్చి ఇన్‌స్టిట్యూట్' అను పేర పరిశోధకశాలను నెలకొల్పి తమ పరిశోధనలు పెంపొందింపనున్నారు. ఈ పరిశోధకశాలకు అనుబంధముగా క్షయ కుష్ఠురోగుల కాశ్రమముకూడ ఏర్పఱుప ప్రయత్నములు జరుపుచుంటిమని శ్రీ చౌదరిగారు మాకు తెలుపుచున్నారు. శ్రీ వారి ప్రయత్నములు సర్వవిధముల ప్రోత్సహింపదగినవి. వారి పరిశోధనలు జయమందునేని ఆంధ్రకీర్తిని పెంపొందింపగలవు. ఆంధ్రకీర్తిని పెంపొందించు విషయమెట్టిదైనను దానినిగూర్చి విస్తరించి పలుకుటకు 'ఆంధ్రభూమి' అమితోత్సాహిదైయుండును. కావున శ్రీ చౌదరిగారు పరిశోధకశాల క్రమాభివృద్ధిని ఎడపదడప ఆంధ్రులకు ఆంధ్రభూమి నివేదించుకొనుచుండగలదు. లోకమువారి విశ్వాసమును చూఱగొనువఱకే పరిశోధకుల కష్టములు. లోకము విశ్వసించినపిమ్మట పరిశోధకుల ఉన్నతికి పరిమితి యుండదు. శ్రీ చౌదరిగారు సత్యమగు కార్యదీక్ష వహించి తమ పరిశోధనల కట్టి ఔన్నత్యమును కలిగించునట్లు భగవానుడనుగ్రహించునుగాక యని కోరుచున్నాము.

**కామశాస్త్రము** ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుఁగుసేఁత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూఁడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లరి వ్రాఁతలుకావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాఁబట్టి దీనిగొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయి.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

# జూను సంచిక అందుకొనుచు ఒక సోదరి వ్రాసిన లేఖ

"జూను సంచిక 14-వ పుటలో సోదరులు ఆర్. శ్రీరామమూర్తి బి. ఏ. గారు పమిటలేని స్త్రీ చిత్రము స్త్రీల పత్రికయగు గృహలక్ష్మికి ముఖచిత్రముగా నుంచుటనుగూర్చి వెలిబుచ్చిన అభిప్రాయముతో నేను పూర్తిగ ఏకీభవించుచున్నాను. ఈ ఒక్క చిత్రమే కాదు గృహలక్ష్మిలోని లోనివిషయములుకూడ కొన్ని స్త్రీలు చూడరానివిగానున్నవి. ఒకనిదర్శనము: ఒకానొక భార్యాభర్తల సంభాషణ:

"మగాళ్ళెట్టి కోతలు కోస్తారు"

"నేనందరికి మల్లేకాదే!"

"మీరుమాత్రం చేప్పేవన్ని చేస్తారేమిటి?"

"ఏం, కావాలిచెప్పు. తక్షణం చేస్తాను."

"చెప్పనా" "కంటనే"

"అడుగో, అల్లావెడుతున్నాడు, వాళ్ళ మోహనరావుని భోజనానికి పిలవండి చూద్దాం, మీప్రజ్ఞ."

మోహనరావునుచూచి మోజుపడిన ఈ మోహనాంగి అక్షరాలలోనే గాక చిత్రరూపమునగూడ గృహలక్ష్మిలో కెక్కినది. అక్షరరూపమున, చిత్రరూపమున చూపినగాని ఆ ఆదర్శగృహిణిని గృహలక్ష్మిపాఠకురాండ్రు తెలిసికొనలేరని సంపాదకులు తలంచిరి కాబోలును. జనానాపత్రికాసంపాదకులగు రాయసం వెంకటశివుడుగారు, సౌశీల్యమునకు రాసిఅయిన శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు ఇట్టివాని ప్రచురణమునకు ఎట్లు సలహాయిచ్చిరో తెలిసికొనలేకుండ నున్నాను. మాకొఱకు ప్రత్యేకముగ ప్రచురింపబడుచున్న పత్రికలోనే మాస్త్రీజాతి ఇట్లు అవమానింపబడుచుండగా సర్వవిషయములు చర్చించుటకు నెలకొన్న 'ఆంధ్రభూమి' వంటి పత్రికలో 'తప్పేమున్నది?' వంటికథలు—స్త్రీలు చదువరానివి; చదివి సహింపలేనివి—ప్రచురింప బడినందులకు నేను విచారపడి లాభమేమి? అట్టి బొమ్మలు, అట్టికథలుగల పుస్తకములను ఆంధ్రసోదరులు తమ భార్యలచేత, అక్కచెల్లెండ్రచేత, తల్లులచేత చదివించుటకు ఎట్లు ఒప్పుకొనుచున్నారో నాకు బోధపడుటలేదు. మీరు ఈ ఉత్తరమును ఆంధ్రభూమిలో ప్రచురించి ఇందునుగూర్చి మీ అభిప్రాయమును వెల్లడింతురేని చాల సంతోషింతును. ప్రచురింపక బుట్టదాఖలు చేసినను ఈసోదరి చేయగలదేమియులేదు. కాని సంపాదకకర్మమునకు దూరులై మెలగిరనిమాత్రము తలచగలదు.

—చి. వెంకటరమణమ్మ.

[ఈ ఉత్తరము మా కార్యస్థానమునకు 19—6—34-వ తేదీని చేరినది. ఈసంచిక అప్పటికే చాలభాగము ముగిసినది. కావున మా సమాధానమును పై మాసమున ప్రచురింపగలము. —సంపాదకుడు.]




పి. కోదండరాంపిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీభవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు; బెత్తాలంగడివీధి, మద్రాను.

# జయవిజయ యిన్సూరెన్సు కంపెని లిమిటెడ్

(పూర్వపుజయ భారత్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.)

సామాన్యజనుల కుపయోగపడునట్లు


నెలవాయిదాల పద్ధతులతో, ధారాళమగు షరతులతో,

## నూతన పద్ధతుల నేర్పాటు చేసినది

నిరుద్యోగులకు మంచియవకాశము.

ఏజన్సీ షరతులకు హెడ్డాఫీసుకు వ్రాయుడు.

**5-104 ఆర్మీనియన్ వీధి, మదరాసు.**




## రామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన

తాత కృష్ణమూర్తి, బి.ఏ;యల్.టి.

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలది. క్రౌన్ సైజు, వెల 12 అణాలు

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దు మీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

తాత కృష్ణమూర్తి, భద్రాచలం.

# సువర్ణసుందరరసము

## సర్వసవామేహములకు సంజీవివంటిది

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చియున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్యరసాయనశాల, ముక్త్యాల

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయము చేయును. ప్రశస్తమైన రసాయనము. వెల: తులము 1 కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రిగారు, ఏ.ఎం.ఏ.సి.



# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధను, అజీర్తి, తలనొప్పి,' ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలుపడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనమువల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్థకౌషధము.

## జీవామృతము

(షూర్ణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.

ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును; లేక

## ఆయుర్వేదాశ్రమము.

151, గోవిందప్పనాయకవీథి, తపాలుపెట్టె287,

మదరాసు.

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

## పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకనే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారలు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవన్ని పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసకొనుము.




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీగ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0 4-0 ధరకే దొరకును.

## గంధర్వకల్ప

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు అయ్యుని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

పౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను పోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిపొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలుకక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కుపిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హెయిరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్‌స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు.

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను పోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారముర్రోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.